# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

సంపుటి : 56 సంచిక : 9 సెప్టెంబరు, 2023 పేజీలు : 24 వెల : రు. 10/-


# అటవీ సంరక్షకులెవరు? విధ్వంసకులెవరు?

**బిజెపి** ప్రభుత్వం, కేంద్రంలోని వారి అనుయాయులు, అడవులపై ఆధారపడి జీవనం సాగించే ఆదివాసులకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ద్వేషపూరిత ప్రచారం సాగిస్తూ వస్తున్నారు. వారు అడవులన్నింటినీ దురాక్రమిస్తున్నారని, విచక్షణారహితంగా చెట్లనన్నింటినీ నరికివేస్తున్నారని, గిరిజనులు సాగించే పోడు వ్యవసాయం కారణంగా పర్యావరణమంతా కాలుష్యభరితమౌతోందని, వేట కారణంగా వన్య ప్రాణులకు ముప్పు ఏర్పడుతోందని మాట్లాడుతున్నారు. అడవి, పర్యావరణం విధ్వంసం కావటానికి ఆదివాసులనే నేరస్థులుగా చిత్రిస్తున్నారు. ఆదివాసులను అడవులనుండి గెంటివేసి, అడవులను, అడవులలోని ఖనిజ, సహజ సంపదలన్నింటినీ కార్పొరేట్లకు, బడా సామ్రాజ్యవాద సంస్థలకు ధారాదత్తం చేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది.

దీనిలో భాగంగా, అడవుల సంరక్షణ, వన్యప్రాణుల మనుగడ, పర్యావరణ పరిరక్షణల పేరున భారత అటవీ చట్టం - 1927, అటవీ సంరక్షణ చట్టం-1980, అటవీ వన్యప్రాణుల సంబంధిత జీవవైవిధ్య చట్టాలు, పర్యావరణ చట్టాలను సవరించారు. అయితే అటవీ భూములలో అటవీయేతర కార్యకలాపాలకు విచక్షణారహితంగా అనుమతులివ్వటంతో కేంద్రపాలకుల మాటలకు, చేతలకు ఎక్కడా పొసగటం లేదు. ఫలితంగా, వన్యప్రాణులు క్షీణిస్తాయి; జంతు, వృక్ష జాతులు ధ్వంసమౌతాయి; పర్యావరణం ఘోరంగా దెబ్బతింటుంది.

గత 15 సంIIల కాలంలో 3 లక్షల హెక్టార్ల అటవీ భూములను అటవీయేతర కార్యక్రమాలకు మళ్ళించటం జరిగిందని కేంద్ర పర్యావరణ శాఖామంత్రి భూపేంద్రయాదవ్ ఇటీవలే పార్లమెంటు సాక్షిగా పేర్కొన్నాడు. ఈ భూములలో, 58,282 హెక్టార్ల భూమి గనులకు కేటాయించగా, రోడ్ల నిర్మాణానికి 45,326 హెక్టార్లు, నీటిపారుదల రంగానికి 36,620 హెక్టార్లు, విద్యుత్తు ప్రసారలైన్లకోసం 26,124 హెక్టార్లు, రక్షణరంగానికి 24,337 హెక్టార్లు, జలవిద్యుత్ కేంద్రాలకు 13,136 హెక్టార్లు, రైల్వేలకు 9,307 హెక్టార్లు, థర్మల్ విద్యుదుత్పత్తికి 4,107 హెక్టార్లు, పవన విద్యుత్తు మౌలిక సదుపాయాలకు 2,181 హెక్టార్లు, అటవీయేతర కార్యక్రమాలకు అత్యధిక అటవీ భూభాగాన్ని ప్రక్కకు మళ్ళించినట్లుగా మనకందుతున్న సమాచారం తెలియజేస్తోంది.

అదే సమయంలో, 3,67,214 హెక్టార్ల రిజర్వు అటవీ ప్రాంతం దురాక్రమించబడిందని మంత్రిగారు శలవిచ్చారు. కార్పొరేట్‌శక్తులు కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్ధించిన కొద్దిరోజుల తర్వాత, మార్చి 17న రిజర్వు అటవీ భూములలో క్యాప్టివ్‌మైన్స్‌కు లీజుకు ఇస్తున్నట్లుగా కేంద్రం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. అండమాన్, నికోబార్ దీవులలో 'టౌన్‌షిప్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆన్ గ్రేట్ నికోబార్' కోసం 13వేల హెక్టార్ల అటవీ భూమిని కేటాయించారు. ఇంకా అనేక ప్రాజెక్టులు ఆమోదం పొందవలసినవిగా వున్నాయి.

ఈవిధంగా, అటవీ ప్రాంతాలలో పథకాలకు అనుమతినీయటం ద్వారా అటవీ, పర్యావరణాల విధ్వంసంలో కేంద్రం అత్యుత్సాహం ప్రదర్శించింది. ఈ ప్రాజెక్టుల అనుమతుల విషయంలో, స్థానిక గ్రామసభల ఆమోదం, 'పీసా' చట్ట నిబంధనలను ఏమాత్రం లక్ష్య పెట్టకుండా వ్యవహరించింది.

అడవుల విచక్షణారహిత విధ్వంసం, పర్యావరణ సూత్రాల విచ్చలవిడి ఉల్లంఘనలతో భూసార క్షీణత పెరిగిపోవటం, అనేక ప్రాంతాలు ఎడారిగా మారిపోవటం, హిమాలయ పర్వతప్రాంత రాష్ట్రాలలో భీకరమైన వరదలు ఉప్పొంగటం వంటి అనేక పర్యావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అంతేకాదు, వన్యప్రాణులకు, వివిధ రకాల వృక్షజాతులకు, నీటివనరులకు, ప్రత్యేకించి స్థానిక ఆదివాసీతెగల మనుగడకే ప్రమాదకరంగా ఈ చర్యలు పరిణమిస్తున్నాయి. దేశ భవితవ్యాన్నే ప్రశ్నార్థకం చేసిన అటవీ చట్టాల సవరణలతో ఈ ప్రమాదకర పరిస్థితులు మరింత తీవ్రమవుతూ ఆందోళన కల్గించేవిగా వున్నాయి. ఈ అంశంలో పర్యావరణవాదుల, మాజీ పౌరఅధికారుల, మాజీ ప్రభుత్వోద్యోగుల, ఆదివాసీ సంఘాల, సామాజిక కార్యకర్తల, మేధావుల, ప్రజాస్వామికవాదుల, ఆదివాసీల విజ్ఞప్తులను, నిరసనలను, సూచనలను కనీసంగా పట్టించుకోకుండా ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రభుత్వం యొక్క ఈ చట్టాలు, విధానాలు, చర్యలపట్ల పర్యావరణవేత్తలు తీవ్ర ఆగ్రహం ప్రకటించటంతోపాటు, ఇవన్నీ అటవీ సంరక్షణ చట్టం-2023 పీఠికలో పేర్కొన్న లక్ష్యాలను తీవ్రంగా విచ్ఛిన్నంచేసేవేనన్నారు. వాతావరణంలో వెలువడే కర్బన ఉద్గారాలను 2070 నాటికి శూన్యస్థాయికి చేర్చాలని, అలానే 2030 నాటికి 2.5-3.5 టన్నుల కార్బన్‌డైఆక్సైడ్‌కు సమానమైన కార్బన్ నిక్షేపాలను సృష్టించాలని పేర్కొన్నదానికి భిన్నమైనవేనన్నారు.

ప్రాజెక్టుల కారణంగా నష్టపోయిన అటవీ భూముల స్థానంలో 9,34,380 హెక్టార్లలో పరిహారాత్మక అడవులను నిర్వహిస్తూ, ఈ తరహా అడవుల పెంపకానికి కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తున్నామని కేంద్రప్రభుత్వం చెబుతోంది. పరిహారాత్మక అడవులు సహజ అడవుల స్థానాన్ని భర్తీచేయలేవని 2016 ఏప్రిల్‌లో కేంద్రప్రభుత్వం పార్లమెంటులోనే అంగీకరించింది. పరిహారాత్మక అడవుల పెంపకం అనేది అశాస్త్రీయ, తప్పుడు విధానమని నిపుణులు దీనిపై విమర్శలు

# జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

వెబ్‌సైట్ :
www.janasakthionline.com
ఈ-మెయిల్ :
janasakthi1963@gmail.com

సంపుటి : 56
సంచిక : 9


## లోపలిపేజీల్లో....


రాజకీయార్థికం :

- అటవీ విధ్వంసకులెవరు? 1
- గుత్త పెట్టుబడులు-ప్రజారవాణా వ్యవస్థ 3
- కేంద్ర-రాష్ట్ర సంబంధాలు 6
- 'ఇండియా' కూటమి 9
- ఉత్తర భారతం-వరద బీభత్సం 10
- హర్యానా: మతోన్మాద ఘర్షణలు 12
- 'జపాన్ యాజమాన్యం-భారత్ ప్రతిఘటన' పుస్తక పరిచయం 13
- వ్యవసాయరంగం-సామ్రాజ్యవాద సంస్థలు 15

అంతర్జాతీయం :

- అమెరికా, చైనా, రష్యా-అంతర్జాతీయ రహదారులు 16
- ఫ్రాన్స్: జాత్యహంకార దాడులు 18

జోహార్లు :

- గద్దర్ 8
- జహీర్ అలీఖాన్ 19

రిపోర్టులు :

- బళ్ళారి: ఏఐకెఎంకెఎస్-ప్రదర్శన-సభ 20
- ఏజన్సీ గిరిజన సంఘం మహాసభ 22
- ఆదివాసీ దినోత్సవం-సభ 24



వెల : విడిప్రతి..................రూ.10/-
సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :
ఎస్.శేషమ్మ, ఎడిటర్
32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్,
ఎం.ఆర్.పురం, విజయవాడ-10.


చేశారు. "అడవులను నష్టపోవటమంటే కేవలం చెట్లను కోల్పోవటమే కాదు; ఒక పర్యావరణ వ్యవస్థ కుప్పకూలటం అనీ, నాటిన చెట్లు, కోల్పోయిన అడవుల స్థానాన్ని భర్తీచేస్తాయని ప్రభుత్వం ప్రకటించు కోవచ్చుకానీ, దీని అర్థం-విధ్వంసమైన విశిష్ట వృక్ష, జంతుజాలాన్ని పునరుద్ధరించటం ఎంతమాత్రం కాదని పూనే విశ్వవిద్యాలయ పర్యావరణ శాస్త్ర పిహెచ్‌డి స్కాలర్ సమర్పితరాయ్ పేర్కొన్నారు.

ఏమైనా, ప్రాజెక్టుల కారణంగా సర్వస్వాన్నీ కోల్పోయిన ఆదివాసులకొరకు, వారి పునరావాసం లేదా వారి జీవనోపాధికి హామీ ఇవ్వటానికి ఉద్దేశించిన పథకాలుగానీ, విధానాలుగానీ కేంద్రంవద్ద ఏమీ లేవు. ఈ ప్రాజెక్టుల ఫలితంగా ఎందరు ప్రజానీకం విస్థాపనకుగురై, అనాథులయ్యారనే సమగ్ర సమాచారం కూడా ప్రభుత్వం వద్దలేదు.

పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పులకు సంబంధించిన మంత్రిత్వశాఖ జనవరి 24న కొన్ని మార్గదర్శక సూత్రాలు విడుదల చేస్తూ "ప్రత్యేక మినహాయింపులున్న పరిస్థితులలో" ఒక హెక్టారు వరకు అటవీ ప్రాంతాన్ని నివాస ప్రాంతాల పథకాలకు మళ్ళించవచ్చని అందులో పేర్కొన్నారు. ఆ "ప్రత్యేక మినహాయింపులతో కూడిన పరిస్థితు"లేమిటనేది మాత్రం ప్రభుత్వం పేర్కొనలేదు. ఇది ధనికవర్గాలకు చెందిన ఫార్మ్‌హౌస్‌లు, నివాసాలు, గెస్ట్‌హౌస్‌లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీస్‌కు మినహా, ఆదివాసుల, పేద ప్రజానీకపు నివాసవసతికి ఉద్దేశించినది మాత్రం కాదు. ఉదాహరణకు, గత సం॥రం, బిజెపి పాలిత హర్యానా రాష్ట్రప్రభుత్వం, ఢిల్లీ శివారులలో గురుగావ్‌కు చెందిన అటవీ భూమిలో కార్మికవర్గ నివాస స్థావరాలైన 10,000 గుడిసెలను కూల్చివేసింది. అదే సమయంలో, ఆ ప్రాంతంలోనే నిర్మితమైవున్న ధనిక వర్గాల ఫాంహౌస్‌ల వైపు కన్నెత్తికూడా చూడలేదు. భూమి పట్టాలకోసం, భూమిపై శాశ్వత హక్కులకోసం గ్రామసభల ద్వారా ఆదివాసులు పెట్టుకొన్న దరఖాస్తులన్నింటినీ దశాబ్దాల కాలంగా నిరాకరించటమో లేదా ఎటూ తేల్చకుండా నిలిపివేయటమో జరుగుతూవస్తోంది. మరోవైపున కార్పొరేట్లకు, ధనికవర్గాలకు అడవులను యధేచ్ఛగా కట్టబెట్టటానికి అంతో ఇంతో ఆటంకంగావున్న చట్టాలన్నింటిలో కేంద్రం నిరంతరాయంగా, చాలా దృఢంగా మార్పులు చేస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నది.

'ఇండియన్ స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్టు'-2021 (ఐఎస్ఎఫ్ఆర్) ప్రకారం దేశ భౌగోళిక ప్రాంతమంతటిలో 7,13,789 చ॥కి॥మీ వైశాల్యంలో 21.71 శాతంగా అటవీ ప్రాంతం విస్తరించి వుంది. ఏమైనా, ఈ దట్టమైన, మధ్యతరహా అడవుల పరిమాణం తగ్గిపోయింది. ఆదివాసుల నిలకడైన ఆందోళనల కారణంగా వారు నివాసముండే అటవీ ప్రాంతాలలో దట్టమైన అడవులు మాత్రమే ఇంకా చెక్కుచెదరకుండా వున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. "నూతన నివేదిక ప్రకారం గిరిజనుల భూమిపై సామూహిక హక్కులను ప్రభుత్వాలు ఎక్కడైతే నికరంగా గుర్తించాయో, ఆ ఆదివాసీ, మూలవాసుల భూభాగాలలో అటవీ నిర్మూలనా శాతం పరిగణించదగిన స్థాయిలో తక్కువగా వుంది". (డౌన్ టు ఎర్త్-30-3-2021)

ఆదివాసులకు పోడుచేసుకోవటం, వేట, అటవీ ఉత్పత్తులే ప్రధాన జీవనాధారం. భారతదేశంలో సుమారు 6 లక్షల కుటుంబాలు 17 లక్షల 30వేల హెక్టార్లలో పోడు వ్యవసాయం చేస్తున్నారని, ఇది కూడా ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాలలో జరుగుతోందని ఒక నివేదిక పేర్కొంది. ప్రాజెక్టులు, గనుల తవ్వకం మొదలైన కారణాలతో ఆదివాసులను అడవులనుండి గెంటివేయటం; పోడు వ్యవసాయంలో నూతనంగా ఎదిగివస్తున్న తరాలకు ఆసక్తి సన్నగిల్లటం వంటి కారణాలుగా పోడు వ్యవసాయం తగ్గుతోంది. పోడు వ్యవసాయం ఒక ప్రాంతంలో కొంతకాలం చేసి, మరోచోట కొత్తగా పోడువ్యవసాయం ప్రారంభించినప్పటికీ, మొదట పోడుచేసిన ప్రాంతపు భూమిలో కొంతకాలానికి తిరిగి సహజంగానే అడవి పెరుగుతుంది. కలప కాంట్రాక్టుల పేరిట, ప్రాజెక్టుల పేరిట జరుగుతున్న అటవీ నిర్మూలనకు వ్యతిరేకంగా ఆందోళనలు జరపని ఆదివాసులే లేరంటే అతిశయోక్తి కాదు. మూలవాసులు తమ ఆహారంకోసం సాగించే వేట కారణంగానే వన్యప్రాణులు క్షీణించిపోతున్నాయని చెప్పటం కూడా సరైంది కాదు; అటవీయేతర ప్రయోజనాలకోసం వన్యప్రాణుల ఆవాస ప్రాంతాలను ధ్వంసంగావించటం వలననే, అవి క్షీణించిపోతున్నాయని అనేక అధ్యయనాలు చూపుతున్నాయి.

ఛత్తీస్‌ఘర్‌లోని 'హస్‌దెయో అరండ్' అడవిలో మధ్యప్రదేశ్‌లో మహన్ అడవి, ఒడిషాలోని తలబిరా అడవి, ఆరావళీ పర్వతాలలోని అడవులలో, గనుల త్వవకానికి బాక్సువాహ్ వజ్రాల గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆదివాసీ కార్యకర్తలను, ఆదివాసులను చట్టవిరుద్ధంగా అరెస్టులు చేయటమేగాకుండా హత్యకావించటం కూడా జరుగుతోంది.

అడవి తల్లిని దైవంగా భావిస్తూ అడవుల విధ్వంసానికి వ్యతిరేకంగా పోరాడుతూ, అనాది కాలంనుండీ అడవులను పరిరక్షించుకుంటూ వస్తున్నది ఆదివాసులే! ప్రభుత్వాలు పైకి ప్రకటిస్తున్న అటవీ సంరక్షణలనేవి గొప్పమోసపూరితమైనవని పైన పేర్కొన్న కేవలం కొన్ని అంశాలపై ➡

# గుత్త పెట్టుబడుల గుప్పిట్లో ప్రజా రవాణా వ్యవస్థ

ప్రొ॥ తోట జ్యోతీరాణి

**ఆర్థిక** వ్యవస్థ అభివృద్ధి, స్వావలంబన, దేశ భద్రత, ప్రజల జీవితాలు, మనుగడలను నిర్ణయించే అనేక అంశాలలో ప్రజా రవాణా వ్యవస్థ కూడా కీలకమైంది. పెట్టుబడిదారీ వ్యవస్థ చట్రాన్ని ఆమోదించిన ఆర్థిక అభివృద్ధి నమూనాలు కూడా మౌలిక సదుపాయాల రంగంలో, ప్రధానంగా రవాణా రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రస్తావించలేదు. ప్రజలకు భద్రతతో కూడిన చౌక రవాణా వసతులు, ప్రజా రవాణా వ్యవస్థలోనే అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ గుత్తాధిపత్యం వున్న ఏ రంగంలోనైనా ప్రజా శ్రేయస్సే ప్రధానమవుతుంది. లాభమే లక్ష్యంగా వున్న ప్రైవేటు పెట్టుబడులలో ప్రజా శ్రేయస్సు అన్న ప్రశ్నే వుండదు. పేదరికం, నిరుద్యోగిత తీవ్రంగా వున్నమనదేశంలో రోడ్లు, బస్సులు, రైళ్లు, రైల్వేస్టేషన్లు ప్రజలకు చౌక రవాణాను గ్యారంటీగా అందించటమే కాకుండా ఎంతో మందికి జీవనోపాధిని కల్పిస్తాయి. ఇల్లు లేని ఎంతోమంది పీడిత ప్రజలు రైల్వే ప్లాట్ ఫాంల మీద బతుకుతున్నారు. లాభం రాని రూట్లలో బస్సులు, రైళ్లు క్యాన్సిల్ కావు. మారుమూల గ్రామానికి కూడా చిట్టచివరి బస్సులో ఒక్క ప్యాసింజర్ వున్నా వెళ్తుంది. ప్రజా రవాణా వ్యవస్థ పీడిత ప్రజలకు ఒక భద్రత. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరముల తర్వాత 'అమృత కాల్'లో కూడా దాదాపు 40 శాతం గ్రామాలకు 'అన్ని కాలాలలో' రోడ్డు వసతి లేదు. వర్షా కాలంలో ఇటువంటి గ్రామాలలో నివసించే ప్రజలు, ముఖ్యంగా జబ్బులతో బాధపడేవాళ్లు, గర్భిణీ స్త్రీలు ప్రసవం కోసం దగ్గరలో వున్న ఆసుపత్రులకు పోవడానికి ఎంత ఇబ్బంది పడతారో చూస్తూనే వున్నాం. ఇటువంటి స్థితిలో ప్రజా రవాణా వ్యవస్థను అందరికీ అందుబాటులోకి తీసుకురావటమే ప్రజాస్వామిక ప్రభుత్వాల లక్ష్యంగా వుండాలి.

ఇందుకు భిన్నంగా గత మూడు దశాబ్దాల నుండి ప్రజా రవాణా వ్యవస్థ లక్షణమే అసమర్థత అంటున్నారు. ప్రైవేటు పెట్టుబడుల తోనే రవాణా రంగం ఆధునీకరణ సాధ్యం అవుతుందని, నాణ్యమైన రవాణా సేవలు అందుతాయని, రవాణా రంగంలో ప్రైవేటు పెట్టుబడులు అవసరం అన్న వాదన బలంగా ముందుకొచ్చింది. ఇందుకోసం పాలకులు ఈ రంగాన్ని సరళీకరించాలి, ప్రైవేటీకరించాలని, రవాణా రంగంలో ప్రైవేటు పెట్టుబడుల కోసం ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం (PPP) నమూనాను అంతర్జాతీయ విత్త సంస్థలు - ప్రధానంగా ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సీరియస్‌గా ప్రచారం చేశాయి.

మనదేశంలో ప్రజా రవాణా వ్యవస్థను ప్రైవేటీకరించడం 1990లలోనే ప్రారంభ మైనప్పటికీ, 2014 నుండి ఈ ప్రక్రియ తీవ్రం అయింది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్ (PPP) కోసం BOLT (Build Operate Lease Transfer), SPV (Special Purpose Vehicle) నమూనాలను రూపొందించారు.

ప్రారంభం నుండీ PPP నమూనాను కమ్యూనిస్టు పార్టీలు విమర్శించాయి. కానీ ఇటీవల కాలంలో వర్ధమాన దేశాలలో రవాణా రంగంలో పబ్లిక్ - ప్రైవేట్ పార్టనర్ షిప్ ప్రాజెక్టుల నిర్వహణ ప్రాతిపదికగా విమర్శలు వెల్లువెత్తాయి. 60 దేశాల సభ్యత్వంతో ఏర్పడిన అంతర్జాతీయ రవాణా ఫోరం అధ్యయనం ప్రకారం, రవాణా రంగంలో PPP ద్వారా ప్రైవేట్ పెట్టుబడుల సామర్థ్యాన్ని సూచించే ఏ ఆధారమూ లేదంటుంది. ఆధిపత్య దేశాలలో కేంద్రీకృతమైన ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం, రవాణా రంగంలో విదేశీ పెట్టుబడుల ద్వారా వర్ధమాన దేశాలకు తరలిరాదని చెబుతుంది. 1990లలో, 2000లలో PPP నమూనాను బలంగా ప్రతిపాదించిన మిఖాయిల్ క్లెయిన్, 2015లో ప్రపంచ బ్యాంకు కోసం రూపొందించిన వర్కింగ్ పేపర్‌లో PPP గొప్పదని చెప్పటానికి ఏ ఆధారమూ లేదంటాడు. 15 యూరప్ దేశాల్లో 227 రోడ్డు ప్రాజెక్టులను 2006లో అధ్యయనం చేసిన యూరోపియన్ పెట్టుబడుల బ్యాంకు నివేదిక ప్రకారం, సంప్రదాయిక పబ్లిక్ నిర్మాణ వ్యయంతో పోల్చితే PPP ప్రాజెక్టులలో ఈ వ్యయం 24 శాతం అధికం. ఈ అంశాన్ని PPPని సమీక్షించిన ఐక్యరాజ్యసమితి, 2016 అధ్యయనం బలపరిచింది. సమస్త రాయితీలతో, ప్రోత్సాహకాలతో ప్రారంభమవుతున్న PPP ప్రాజెక్టులలో నగదు ప్రవాహ సమస్య తీవ్రంగా వుండటం వైరుధ్యమే. 71 వర్ధమాన దేశాలలో 1200 ప్రజోపయోగ వ్యవస్థల్ని పరిశీలించిన అధ్యయనం ప్రకారం, PPP ద్వారా అధికంగా పెట్టుబడులు సమకూరినట్లు ఏ ఆధారమూ లభించలేదు. 2016లో ప్రపంచ బ్యాంకు దత్తాంశాలు ఈ అంశాన్నే ధృవీకరిస్తున్నాయి. దీనితో మెజారిటీ ప్రజలకు చౌక రవాణా లభించదు. లాభాలు వచ్చే రూట్లలోనే రోడ్లు, బస్సులు, రైళ్లు వుంటాయి. PPP రవాణా ప్రాజెక్టులలో పెట్టుబడులలో ప్రభుత్వ వాటా ఉంటుంది. బ్యాంకుల ద్వారా ప్రభుత్వ గ్యారంటీతో ప్రైవేటు సంస్థలకు పెట్టుబడులు లభిస్తాయి. రవాణా వ్యవస్థలో ప్రైవేట్ సంస్థలు ప్రవేశించడం వల్ల అదనపు పెట్టుబడులు రావు. సమర్థత లేదు. నిర్మాణ వ్యయం, నిర్వహణ వ్యయం అధికం. నూతన సాంకేతికత రాదు. అధిక ఛార్జీల భారం ప్రజలపై పడుతుంది. ఇక ఇందులోని కార్మికులు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తారు. జీతం తక్కువ, పనిగంటలు ఎక్కువ. తక్కువ టైంలో పూర్తి చేయవలసిన ట్రిప్పుల సంఖ్యను పెంచడం వల్ల ప్రమాదాలు తీవ్రంగా పెరుగుతాయని ఆధారాలు వున్నాయి.

ఇటువంటి సందర్భంలో మనదేశంలో రవాణా రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడం దుర్మార్గం. 'మేక్ ఇన్ ఇండియా' పేరిట మన తయారీ రంగంలో గుత్త పెట్టుబడుల ఆధిపత్యం బలపడింది. ఉత్పత్తి రంగానికే పరిమితం కాకుండా మొత్తం పంపిణీ వ్యవస్థ మీద పెత్తనం సాధించాలన్నది గుత్త పెట్టుబడుల లక్ష్యం. అందువల్లనే రిటైల్ వ్యాపార రంగాన్ని క్రమంగా ఆక్రమించుకుంటున్నాయి. ఉత్పత్తులను నిల్వచేసే గోడౌన్లు, శీతలీకరణ కేంద్రాలు ప్రస్తుతం గుత్త పెట్టుబడుల నియంత్రణలోనే వున్నాయి. ఇక రవాణా రంగం ఆక్రమణతో 'ఒకే దేశం, ఒకే మార్కెట్టు' వాస్తవమవుతుంది. గుత్త పెట్టుబడులు - స్వాధీనం చేసుకున్న ఉత్పత్తులను ఎంత మేరకు నిల్వ చేస్తారు, ఎంత మేరకు విడుదల చేస్తారు అన్న అంశమే ఉత్పత్తుల ధరలను నిర్ణయిస్తుంది. దీనివల్ల ప్రభుత్వ అదుపులో వుండవలసిన ధరల నిర్ణయంలో ద్రవ్య విధానం, కోశ విధానాలు కాలం చెల్లినవవుతాయి.

---

→ ఆధారపడే మనం చెప్పవచ్చు. అటవీ పరిరక్షకులెవరో, అటవీ విధ్వంసకులెవరో కూడా స్పష్టమౌతుంది. దీనికి ప్రధాన కారణం పాలకుల విధానాలు, వారి దోపిడీనే. కనుక ఆదివాసులను అడవులనుండి తరిమివేసి అడవులను భారీగా లూటీ చేసేందుకు, అధికస్థాయిలో అడవులను ధ్వంసం చేస్తూ, పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్న కార్పొరేట్లకు, సామ్రాజ్యవాద సంస్థలకు అడవులనంతా అప్పగిస్తున్న కేంద్రప్రభుత్వ దుర్మార్గమైన, ప్రజావ్యతిరేకమైన విధానాలపై ప్రజలంతా కలిసికట్టుగా పోరాటం సాగించాలి. ✡

## ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహక చర్యలు :

ప్రజా రవాణా వ్యవస్థను ప్రజల కోసం కాకుండా లాభంకోసం పనిచేసే గుత్త పెట్టుబడులకు అప్పజెప్పడం వారికున్న పాలకుల మద్దతును తెలుపుతున్నది.ఎంతో సమర్థవంత మైనవిగా పేర్కొనే గుత్త పెట్టుబడులకు లాభాల గ్యారంటీ ప్రభుత్వం ఇవ్వటం ఏమిటి? రవాణా రంగంలో ప్రవేశించే ప్రైవేటు సంస్థలు, నిధులు సమకూర్చుకోవటానికి ప్రభుత్వమే ట్రస్టులను ఏర్పాటు చేయటం మరొక వైరుధ్యం. ఈ క్రమంలో 2014లో మౌలిక సదుపాయాల పెట్టుబడుల ట్రస్టు, 2019లో రియల్ ఎస్టేట్ పెట్టుబడుల ట్రస్టులు ఏర్పడ్డాయి. పెట్టుబడి దారులను ఈ ట్రస్టుల్లోకి ఆకర్షించడానికి వీటి మీద క్యాపిటల్ గెయిన్ పన్నులను రద్దు చేశారు. 1961 ఆదాయపన్ను చట్టంలోని 54 EC క్రింద ప్రయోజనం పొందటానికి కావలసిన దివాళా కోడ్ పరిధిలోకి తీసుకొచ్చారు. సెబి సమాచారం ప్రకారం 2022– 23 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ ట్రస్టులు 66,958 కోట్ల రూపాయలను సమీకరించాయి. అంటే ప్రైవేటు రంగానికి రవాణా వ్యవస్థలో పెట్టుబడులను ప్రభుత్వమే ట్రస్టుల ద్వారా సమకూర్చింది.

మౌలిక వసతులను నిర్మించటం ప్రైవేటు రంగానికి కష్టం అంటూ గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులను పన్ను రాబడిద్వారా, అప్పులద్వారా సమీకరించిన నిధులతో ప్రభుత్వమే నిర్మిస్తుంది. నిర్మించిన ప్రాజెక్టులు బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులవుతాయి. ఇవి ప్రజల సంపద కదా! కానీ లాభం వచ్చే రూట్లను గుత్త పెట్టుబడులకు లీజుకి ఇచ్చి, నిర్వహించి లాభం సంపాదించుకొమ్మని ప్రభుత్వం చెప్పటం వైరుధ్యమే. మొత్తం రవాణా రంగపరిశీలనలో ప్రస్తుత వ్యాసం రోడ్డు రవాణాకే పరిమిత మవుతుంది.

## రోడ్డు రవాణా :

రహదార్లను నిర్మించడం, నిర్వహించటంలో భాగంగా కేంద్రప్రభుత్వం జాతీయ రహదారులను నిర్మిస్తుంది. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర రహదారులను, జిల్లాలను అనుసంధానం చేస్తూ రోడ్లను నిర్మిస్తాయి. రాష్ట్రంలో బస్సులను నడపటానికి ప్రతి రాష్ట్రంలో రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్లు వుంటాయి.

ప్రపంచంలో అతిపెద్ద రోడ్డు రవాణా వ్యవస్థలలో మన స్థానం రెండవది. 2017 అంచనాల ప్రకారం మన దేశంలో రోడ్డు పొడవు 56,03,293 చ.కి.మీ. ఇందులో జాతీయ రహదార్ల వాటా 2.88 శాతం. కానీ వీటి నిర్వహణలో రహదార్ల రోడ్డు రవాణా వాటా 40 శాతం. 2015లో సంవత్సరానికి రోడ్డు రవాణా ప్రయాణికులు 8,225 మిలియన్లు. కాగా సుమారు సరుకు రవాణా 7,980 మిలియన్ టన్నులు. 2012 నాటికి రోడ్డు రవాణాలో బస్సుల వాటా 20 శాతం. మిగిలిన 80 శాతం వ్యక్తిగత వాహనాలదే. ప్రైవేటు వాహనాలకు అనుగుణమైన రోడ్లు, ఫ్లైఓవర్ల నిర్మాణం, నిర్వహణ ప్రధానమైన అంశం అయింది. గుత్త పెట్టుబడులకు రోడ్డు రవాణా రంగం ఆకర్షణీయమైంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు రంగానికి ఎన్నో రాయితీలను, ప్రోత్సాహకాలను ప్రకటించింది. ప్రాజెక్టులను అధ్యయనం చేయటానికి కావలసిన వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. పర్యావరణ చట్టాల నుండి క్లియరెన్స్ బాధ్యత, దారిపొడుగునా సౌకర్యాల ఏర్పాటు బాధ్యత ప్రభుత్వానిదే. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతాన్ని NHAI మూలధన గ్రాంటుగా సమకూర్చుతుంది. ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం వాణిజ్య రుణాల రూపంలో పొందవచ్చు. టోల్ రేట్లను హోల్ సేల్ ధరల సూచీకి అనుగుణంగా పెంచుకో వచ్చు. ప్రాజెక్టు మొదలైన మొదటి 20 సం.లలో 10 సం.లు కార్పొరేటు పన్ను వుండదు. రోడ్డు నిర్మాణానికి కావలసిన ఆధునిక మూలధన పరికరాల దిగుమతుల మీద సుంకాలు వుండవు. విదేశీ పెట్టుబడులకు 100 శాతం అనుమతి ఉంటుంది. అంటే ప్రభుత్వ వ్యయంతో మాత్రమే గుత్త పెట్టుబడులకు లాభాలు వస్తాయి. ఈ క్రమంలో కార్మికుల మీద దోపిడీ తీవ్రత పెరుగుతుంది. సామాన్య ప్రజలు రవాణా వ్యవస్థకు దూరం అవుతారు.

ప్రభుత్వ ఆధిపత్యంలో వున్న రహదారులను ప్రైవేటు సంస్థలపరం చేయటానికి జాతీయ రహదారుల చట్టం – 1956ను 1995 లోనే సవరించారు. రవాణా రంగంలో ప్రైవేటు పెట్టుబడుల ఆవశ్యకతను అధ్యయనం చేయటానికి 2010లోనే జాతీయ రవాణా విధాన అభివృద్ధి కమిటీని స్థాపించారు. ఇక రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్లను ప్రైవేటీకరించడానికి 2015 లో మోటార్ వెహికల్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. 2012–17 మధ్యకాలంలో రోడ్డు రవాణాలో ప్రైవేట్‌రంగం వాటాను 75 శాతంకు పెంచాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకున్నారు. రవాణా రంగాన్ని వాణిజ్యీకరించటానికి 2018లో రూపొందించిన జాతీయ మౌలిక సదుపాయాల నివేదిక ప్రాతిపదిక అయింది.

2003లోనే జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా 540 బిలియన్ రూపాయల వ్యయంతో నిర్మించాలనుకున్న దేశంలోని మెట్రోపాలిటన్ నగరాలను కలిపే 5,846 కిలోమీటర్ల గోల్డెన్ క్వాడ్రి లేటరల్ ప్రాజెక్టులో, 7300 కి.మీ ఉత్తర –దక్షిణ, తూర్పు – పడమర కారిడార్ల నిర్మాణంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యం వున్నది.

1995లో పనిని ప్రారంభించిన NHAI – 68,670 మిలియన్ రూ.లతో 1,109 కి.మీ జాతీయ రహదార్లను నిర్మించే 21 ప్రాజెక్టులను BOT, Annuity, SPV నమూనాలలో ప్రైవేటు రంగానికి అప్పగించారు. జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుకు చెందిన 3, 4 దశల రహదారుల నిర్మాణాల నమూనా పబ్లిక్ –ప్రైవేట్ పార్టనర్ షిప్ (PPP)నే.

4011.45 కోట్ల రూ.ల విలువగల 1,157 కి.మీ రెండు లేన్ల రోడ్లను విస్తరించడానికి గ్లోబల్ టెండర్లను NHAI, 2013లో ఆహ్వానించింది. BOT ప్రాతిపదికన గెలిచిన బిడ్డర్స్‌కు అప్పగించింది. 18 శాతం లాభాలకు గ్యారంటీని ఇచ్చింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీల వల్లనే బిర్లా జిటిఎం కన్సార్టియం కోసం పెట్టిన 120 కోట్ల రూ.ల పెట్టుబడిని 5 సం.లలో రాబట్టుకున్నది. 2021లో ప్రకటించిన ఆస్తుల నగదీకరణలో భాగంగా నిర్మించిన రహదార్లను ప్రైవేటు సంస్థలకు లీజుకివ్వటం మొదలైంది. ఈ బాటలోనే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నడుస్తున్నాయి. ఆగస్టు, 2023లో తెలంగాణ ప్రభుత్వం 158 కిలోమీటర్ల ORRను 7,380 కోట్ల రూ.లకు IRB గోల్కొండ ఎక్స్ ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 30 సం.లకు లీజుకు ఇచ్చింది. ఇది 8 లేన్లతో వున్న ఎక్స్ ప్రెస్ ప్రాజెక్టు. ఆశ్చర్యకరంగా, ఇందులో 5,500 కోట్ల రూ.ల పెట్టుబడులను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణంగా ఇస్తుంది. మిగిలిన 2,862 కోట్ల రూ.లలో 1402 కోట్ల రూ.లను సింగపూర్ సంస్థ సమకూర్చుతుంది. అంటే కేవలం 1460 కోట్ల రూ.లతో 30 సం.లకు ఈ ప్రాజెక్టును IRB ప్రైవేటు సంస్థ దక్కించుకున్నదన్నమాట. దీని మాతృసంస్థ, ఇంటిగ్రేటెడ్ రోడ్స్ హైవే ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్, 11 రాష్ట్రాల్లో 24 ప్రాజెక్టులను BOT, TOT, HAM నమూనాలలో పొందింది. దేశ రహదార్ల వ్యవస్థ ఏ స్థాయిలో ప్రైవేటు టోల్ రోడ్లుగా మారినాయో దీనివల్ల అర్థం అవుతుంది.

ఇక ప్రైవేటీకరణతో అవినీతి అంతం కాదు సరి కదా పెరుగుతుందని ఇటీవలి కాగ్ నివేదిక స్పష్టం చేస్తుంది. ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణంలో ఒక కిలోమీటర్ రహదారి నిర్మాణ ఖర్చు 18 కోట్ల రూ.ల నుండి 256 కోట్ల రూ.లకు పెరిగినట్లు చూపెట్టటంవల్ల అవినీతి స్థాయి

అర్థమవుతుంది. భారత్ మాల పరియోజన పథకం మొత్తం అవినీతిమయం అని ఆరోపించింది. ఈ పథకంలో కనీసం 7.5 లక్షల కోట్ల రూ.ల అవినీతి జరిగిందని విపక్షాలు చెబుతున్నాయి. కానీ, కాగ్ పరిశీలించిన 5 టోల్ ప్లాజాలలో అక్రమ వసూళ్లు 132 కోట్ల రూ.లు. దేశంలో వున్న టోల్ ప్లాజాలన్నింటినీ పరిశీలిస్తే, లక్షల కోట్ల రూపాయల అక్రమ వసూళ్లు బయట పడతాయి. ఇదంతా ప్రజల నుండి అంటే వాహనదారుల నుండి వసూలు చేసిన డబ్బే కదా! రహదారులు గుత్త పెట్టుబడుల స్వాధీనం అయినప్పుడు ప్రజల మీద దోపిడీ తీవ్రత అధికమవుతుందన్న వాస్తవం స్పష్టమవుతుంది.

## రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు-బస్సులు :

మారుమూల ప్రాంతాలను కూడా అనుసంధానం చేయటంలో బస్సులే శక్తివంతమైన సాధనాలు. చౌక రవాణాను కూడా ఇవి అందిస్తాయి. కానీ 1990లలోనే రాష్ట్రంలో, నగరం లోపల ప్రైవేటు బస్సులను నడపటం మొదలైంది. ఇందులో భాగంగా ఢిల్లీలోని బ్లూ లైన్ బస్సు వ్యవస్థ రూపొందింది. బస్సుల ప్రైవేటీకరణతో చార్జీలు విపరీతంగా పెరిగాయి. రద్దీ సమయంలోనే బస్సులను నడపటం, నియమ నిబంధనలను ఉల్లంఘించడం, రాష్ డ్రైవింగ్‌వల్ల ప్రమాదాలు పెరిగాయి. అందువల్లనే 2008 నుండి ప్రైవేట్ రంగాన్ని దశల వారీగా నిర్మూలించడం మొదలైంది.

ఆశ్చర్యకరంగా, 2008లోనే ఉత్తరప్రదేశ్‌లో 465 రూట్లలో ప్రైవేటు బస్సులకు అనుమతుల నిచ్చారు. ఇందుకు ప్రాతిపదిక PPP నమూనా. ఈ అంశం మీద 2007 లో రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నప్పటి నుండి రోడ్డు రవాణా ఉద్యోగులు ఆందోళన చేశారు. హర్యానా రాష్ట్రంలో కూడా బస్సుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 2018లో ఉద్యోగులు తీవ్రంగా ఆందోళన చేశారు. నిజానికి మోటార్ వెహికల్ అమెండ్‌మెంట్ బిల్లును ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్ పోర్ట్ ఆర్గనైజేషన్ జాతీయస్థాయి ఆందోళనకు 2018 లోనే పిలుపునిచ్చింది.

ఇక పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ బస్సులు తగ్గటం, కాంట్రాక్టు ఉద్యోగులు పెరగటం తీవ్రమైంది. 2022 నాటికి రాష్ట్రంలో 3,250 పబ్లిక్ బస్సులలో 2167 నడుస్తున్నాయి. కాగా, లక్ష ప్రైవేటు బస్సులు నడుస్తున్నాయి. పైగా బస్సు డిపోల భూమిని ప్రైవేటుకు విక్రయించడం కూడా తీవ్రమైంది.

ఇక తెలంగాణలో, 2019 అక్టోబర్ 11వ తేదీ నుండి 52 రోజులపాటు 50 వేల మంది రాష్ట్ర రోడ్డు రవాణా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేశారు. ఈ సంస్థ బస్సులను రోజుకు 10 మిలియన్ల మంది ఉపయోగిస్తారు. 9,300 గ్రామాలను, 840 చిన్న గ్రామాలను అనుసంధానం చేస్తుంది. అయినా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదు. ఖాళీలను నింపటం లేదు. పెన్షన్లు లేవు. రెగ్యులర్‌గా వేతన చెల్లింపులు లేవు. సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం పాశవికంగా అణచివేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ పాలనా కాలంలోనే అద్దె బస్సుల వాటా 25 శాతం నుండి 35 శాతానికి పెరిగిందని, 55 వేలమంది ఉద్యోగులలో 30 వేల మంది ఉద్యోగులను ఐచ్ఛిక ఉద్యోగ విరమణ (VRS) పేరిట బలవంతంగా ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారని, రోడ్డు రవాణాసంస్థ భూములను, కీలక విభాగాలను ప్రైవేటుకు అప్పగిస్తున్నారని ఆనాటి ప్రతిపక్ష పార్టీ వైఎస్ఆర్ సిపి తీవ్రంగా విమర్శించింది. కానీ ఈ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపిలో రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసుకున్నది. దీనితో ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులు అయినారు. అదే సమయంలో కార్పొరేషన్ ఆస్తులు ప్రభుత్వ ఆస్తులైనాయి. అమ్మకాలు మొదలయినాయి. ఇటీవల కాలంలో 239 కార్పొరేషన్ స్థలాలను గుర్తించింది. అందులో 100 స్థలాలను 15 కోట్ల రూ.లకు 15 సం.లకు ప్రైవేటుకు అప్పగించింది. పెద్ద పరిమాణంలో వున్న స్థలాలను ఆయిల్ కంపెనీలకు 20 సం.లకు లీజుకు ఇచ్చింది. అవకాశాలు భారీగా వున్న స్థలాలను BOT నమూనాలో 33 సం.లకు ప్రైవేటుకు లీజుకు ఇచ్చింది.

ఆగస్టు, 2023లో TSRTC (Absorption of Employees into Govt. Service) Bill - 2023ని తెలంగాణా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడంతో రోడ్డు రవాణా ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులైనారు. కానీ 1.5 లక్షల కోట్ల రూ.ల విలువగల కార్పొరేషన్ భూములను ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం స్వేచ్ఛగా విక్రయించ గలుగుతుంది.

బ్రిహన్ ముంబయి ఎలక్ట్రిక్ సప్లై మరియు రవాణా (BEST) విభాగం, విద్యుచ్ఛక్తి సప్లయి మిగులుతో సిటీలో బస్సులను తక్కువ ఛార్జీలకు నడుపుతుంది. 2016లో సుప్రీంకోర్టు విద్యుచ్ఛక్తి వినియోగదారుల మీద అధిక ఛార్జీలతో చౌక రవాణాను అందించడం సరికాదని తీర్పు నిచ్చింది. నష్టాల సంచయనం వల్ల రోడ్డు రవాణాను ప్రైవేటీకరించారు.

## ముగింపు :

రోడ్డు రవాణాకి చెందిన రహదార్లు, ప్రభుత్వ బస్సులు ప్రజా రవాణా వ్యవస్థకు ప్రాతిపదికగా వుండాలి. పీడిత ప్రజల మౌలిక రవాణా అవసరాలను ఇవి తీర్చాలి. రోజు రోజుకూ తీవ్రమవుతున్న ఆర్థిక అసమానతలు, పెరుగుతున్న నిరుద్యోగం, పేదరికం దృష్ట్యా ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేయవలసిన అవసరం వున్నది. కానీ, రవాణా వ్యవస్థను మొత్తంగా, అందులో భాగంగా రోడ్డు రవాణా వ్యవస్థను గుత్త పెట్టుబడులకు అప్పగించే క్రమాన్ని అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రం చేస్తున్నాయి. రాష్ట్ర రోడ్డు రవాణా ఉద్యోగుల ఆందోళనలను దుర్మార్గంగా అణచివేస్తున్నాయి. మౌలిక రవాణాకు కూడా దూరం కావటంతో పీడిత ప్రజల జీవన సంక్షోభం మరింత సంక్లిష్టమవుతున్నది. ఈ రంగంలోకి అనేక రూపాల్లో చొరబడుతున్న సామ్రాజ్యవాద దోపిడీకి అండగా నిలిచే పెట్టుబడిదారీ దళారీ వ్యవస్థను మార్చుకోవడం ద్వారానే రవాణా రంగం ప్రజా రవాణా వ్యవస్థగా ప్రజలందరికీ అందుబాటులోకి వస్తుంది. అందుకు ప్రజల సంఘటిత పోరాటాలే మార్గం. ✸

---

**ఉత్తర...** (11వ పేజీ నుండి)

భగీరథ, అలకనంద, మందాకినీ నదులపై జలవిద్యుత్ కోసమంటూ, డ్యాముల నిర్మాణం కోసమంటూ చట్టభీతి లేకుండా అనుమతులిచ్చి పర్యావరణాన్ని నాశనం చేశారు. అడవులు నరికి, కొండలలో సొరంగాలు తవ్వారు. ఫలితంగా బండరాళ్ళు పట్టుకోల్పోయాయి.

వాస్తవాలు ఇవి కాగా, వీటిని మరుగు పరుస్తూ 'రికార్డు వర్షపాతం', 'కనీవినీ ఎరుగని వరదలం'టూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. 'గడచిన 50 ఏళ్ళలోనూ ఇంతటి కుండపోతను చూడలేద'ని హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ వ్యాఖ్యానించటంలో, ప్రమాద తీవ్రతను పెంచుతున్న కారణాల్ని మరుగుపరుస్తున్నాడు.

వాతావరణంలో జరుగుతున్న మార్పుల గురించి చెప్పుకుంటున్నామంటే, దాని పర్యవసానాలే ఈ పెను విపత్తులన్నీ అని అర్థం చేసుకోరాదు. దోపిడీ పాలకులు ప్రకృతితో చెలగాటమాడటం, వాతావరణంపై ఖచ్చితంగా ప్రభావం చూపుతోందన్నది వాస్తవం. మరో వైపున వారే స్వార్థ, స్వీయ ప్రయోజనాలకోసం విచక్షణారహితంగా అనుసరిస్తున్న విధానాలు, ఉపద్రవాల తీవ్రతను అనేక రెట్లు పెంచుతోంది. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు తీవ్ర నష్టం కలుగజేస్తోంది. ప్రజలను, రైతాంగాన్ని తిరిగి జీవితంలో కోలుకోలేనంతగా దెబ్బతీస్తోంది. పాలకుల పాపాలే ప్రకృతి శాపాలుగా ప్రజలను పెనువిపత్తులకు ఎరవేస్తోంది. ✸

# కేంద్ర-రాష్ట్ర సంబంధాలు | రాష్ట్రాల హక్కుల అణచివేత

**అధికారమార్పిడి,** ఆ తర్వాత సంస్థానాల విలీనం అనంతరం భారతవ్యవస్థ, రాష్ట్రాల సమ్మేళనంతో ఏర్పడి, సమాఖ్య వ్యవస్థగా రూపొందింది. రాజ్యాంగపరంగా, పరిపాలనా పరంగా, అలాగే కేంద్ర-రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాల పరంగా ఎలా వుండాలనే దానిపై రాజ్యాంగంలో, కనీసం మాట వరసకైనాగానీ కొన్ని హక్కులు, అధికారాలు, చట్టాలను రాష్ట్రాలకు కల్పించారు. రాష్ట్రాలకు కల్పించిన ఈ హక్కులను, అధికారాలను మరింత బలీయం చేయాలని, ఇంకా మెరుగైన చట్టసవరణలు చేయాలని సాగిన అనేక పోరాటాలు, ఆందోళనల ఫలితంగా కాలక్రమంలో రాష్ట్రాలకు మరికొన్ని హక్కులు అదనంగా కల్పించారు. ఈ అంశంలో ప్రజాస్వామికశక్తుల, కమ్యూనిస్టుల ప్రయత్నాలు విస్మరించవీలులేనివి.

అయితే, ప్రారంభం నుండీ కూడా, కేంద్రంలో పాలన సాగించిన ప్రభుత్వాలన్నీ ఈ హక్కులను కాలరాయటం, మరోవైపు రాష్ట్రాల నడుమ వివక్షను ప్రదర్శిస్తూ వస్తున్నారు. వారు సమాఖ్య విధానస్ఫూర్తిని మంటకలుపుతున్నారు. కేంద్రం-రాష్ట్రాల నడుమ అనేక సమస్యలు ముందుకొచ్చిన నేపథ్యంలో, వాటి పరిష్కారంలో భాగంగా అనేక కమీషన్లను నియమించటం జరిగింది. ఏమైనా, మొదటి పరిపాలనాపరమైన సంస్కరణల కమిషన్ (1966), సర్కారియా కమిషన్(1983), వెంకటాచలమయ్య కమిషన్ (2000), పూంచ్ కమిషన్(2007)లు వీనిలో ముఖ్యమైనవి. అయితే ఈ కమీషన్ల నివేదికలను అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ ఖాతరు చేయకుండటమే జరుగుతోంది. ప్రస్తుతం, కేంద్రంలో ఆర్ఎస్ఎస్ నియంత్రణలోని బిజెపి ప్రభుత్వాధికారంలో వుంది. 2014లో బిజెపి నాయకత్వంలోని మోడీ కేంద్రంలో ప్రభుత్వాధికారం చేపట్టినప్పటి నుండీ, రాష్ట్రాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా రాష్ట్రప్రభుత్వాలపై, ప్రభుత్వాల హక్కులపై అనేక రూపాల్లో దాడులు సాగిస్తూ ప్రభుత్వం చాలా దూకుడుగా, నిరంకుశంగా వ్యవహరిస్తోంది.

మొదటి విడత 2014లో మోడీ ప్రభుత్వాధికారంలోకి వచ్చినపుడు, కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రణాళికా కమిషన్‌ను రద్దుచేసి, 'నీతి ఆయోగ్'ను ఏర్పరచింది. ప్లానింగ్ కమిషన్ సూచనలమేరకు, కేంద్రప్రభుత్వం తన నిధుల నుండి రాష్ట్రాలలో వ్యవసాయం, పరిశ్రమలు, ప్రభుత్వరంగం, ప్రాథమిక మౌలిక వసతుల అభివృద్ధికోసం మరియు వెనుకబడిన రాష్ట్రాల అభివృద్ధికోసం ఎంతో కొంత భాగాన్ని వెచ్చించేది. ప్లానింగ్ కమిషన్ రద్దుతో, సంబంధిత రంగాలకు, ఆయా రాష్ట్రాలకు రావలసిన నిధులపై ప్రభావం చూపింది. కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలకు రాష్ట్రాలకు ఇచ్చే నిధుల ఖర్చును కూడా తగ్గించాలని నీతీ ఆయోగ్ సూచించింది. తదనుగుణంగా, కేంద్ర ప్రభుత్వం నిధులను తగ్గించుకుంటూ వస్తోంది. (ఉదా: ఉద్యోగ గ్యారంటీ పథకం, మధ్యాహ్న భోజన పథకం, సర్వశిక్షా అభియాన్ మొ॥)

2017లో కేంద్రప్రభుత్వం 'ఒక దేశం-ఒకే పన్ను' పేరిట 'వస్తుసేవల పన్ను' (జిఎస్‌టి) ప్రవేశపెట్టింది. అంతకు మునుపు, కేంద్రం పన్నుల ద్వారా వసూలు చేసిన ఆదాయంలో నుండి కొంతభాగాన్ని రాష్ట్రాలకు కేటాయించేది. అయితే, జిఎస్‌టి ఉనికిలోకి వచ్చిన తర్వాత, రాష్ట్రాల వాటా క్రమంగా తగ్గుతూ వచ్చి, ఈనాటికి ఆ వాటా బాగా తగ్గించివేయటం జరిగింది. జిఎస్‌టి పరిధిలోకి రాని పెట్రోలియం ఉత్పత్తులపై రాష్ట్రాలతో పంచుకోవలసిన ప్రాథమిక ఎక్సైజ్ పన్నులో పెరుగుదల ఏమీ లేదు. కాగా, కేంద్రం రాష్ట్రాలతో పంచుకొనే అవసరంలేని ప్రత్యేక ఎక్సైజ్ పన్నును, అదనపు ఎక్సైజు పన్నును, సర్‌ఛార్జీలను, సెస్సులను విపరీతంగా పెంచుతున్నారు. పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదలను ప్రజల వ్యతిరేకించినపుడు, రాష్ట్రాలపై కేంద్రం నెపాన్ని మోపి విలువ ఆధారిత పన్ను(వాట్)ను తగ్గించనందుకు రాష్ట్రాలను దోషిగా నిలబెట్టేందుకు ప్రయత్నించింది. రాష్ట్రాలకు కేంద్రం ఇవ్వవలసిన నిధులను సక్రమంగా పంపిణీ చేయక పోవటమే, ఆయా రాష్ట్రాలు తీవ్ర అప్పులలో కూరుకుపోవటానికి కారణాలలో ఒకటిగా వుంది. ఏమైనా, కొత్తగా అప్పులు తెచ్చుకునేందుకు రాష్ట్రాలను అనుమతిస్తే, ఆస్తి పన్ను, ఇతర పన్నులను పెంచమని రాష్ట్రప్రభుత్వంపై కేంద్రం వత్తిడి పెడ్తోంది.

రాష్ట్రాల అభిప్రాయంతో సంబంధం లేకుండా కేంద్రప్రభుత్వం, మూడు నల్లసాగు చట్టాలను తీసుకువచ్చి, రాష్ట్ర జాబితాలోనున్న వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాదులకు, కార్పొరేట్‌శక్తులకు పూర్తిగా దాసోహం చేసింది. ఈ చట్టాలే గనుక అమలైతే, వ్యవసాయరంగం, రైతాంగం పూర్తిగా దివాళా తీస్తారు. ఈ ప్రమాదాన్ని గ్రహించిన రైతులు, రైతుసంఘాలు, అనేక ఆంక్షల నడుమే అవిశ్రాంత ఆందోళనోద్యమం సాగించారు. ఈ చట్టాలను వెనక్కు తీసుకుంటున్నట్లుగా కేంద్రానికి ప్రకటించ తప్పలేదు. అయితే, కేంద్రం తన పరిధిలో వున్న కనీస మద్దతుధరల చట్టాన్ని అమలుచేయటానికి మాత్రం, అనేక నాటకాలాడుతున్నది. అదేవిధంగా విద్యుత్తు (సవరణ) బిల్లు చట్టంగా మారితే, విద్యుత్తు కొనుగోలు, అమ్మకం, ధర నిర్ణయం వంటి వానిపై, అలాగే రాష్ట్రాల పరిధిలోనున్న విద్యుత్ సంబంధిత సంస్థలపై నిర్ణయం తీసుకునే అధికారమంతా కేంద్రం చేతుల్లోకి వెళ్ళిపోతుంది. సాగునీటి మోటర్లకు మీటర్ల బిగింపు, విద్యుత్ ఛార్జీల అధిక హెచ్చింపులతో భరించలేని భారాలను రైతులపై, వినియోగదారులపై బలవంతంగా మోపుతున్నారు.

రాష్ట్రాల నడుమ నదీజలాల వివాద పరిష్కారం కోసమంటూ కేందప్రభుత్వం అంతర్రాష్ట్ర నదీజల వివాదాల చట్టం-1956కు సవరణ చేయటం ద్వారా, నదీజలాలపై అదుపు సాధించాలని చూస్తోంది. పైగా, ఆనకట్టల భద్రతా బిల్లు ద్వారా నదులు, జలాశయాలను; పోర్టుల బిల్లు ద్వారా రాష్ట్రాల పరిధిలోని చిన్న నౌకాశ్రయాల్ని కూడా కేంద్రం తన అదుపులోకి తీసుకొంటోంది. రాష్ట్రాల పరిధిలోని అధికారాలను తొలగించటం ద్వారా, కేంద్రం అడవులపై తన పట్టును మరింత బిగించింది. ఆదివాసులను అడవులనుండి తరిమేసి, అటవీ సంపదను కొల్లగొట్టేందుకు అవకాశం కల్పించే అటవీ సంరక్షణ చట్టానికి చేసిన సవరణలో భాగమే మణిపూర్‌లో హింస. దాని పరిణామాల ఫలితమే మణిపూర్ మారణకాండ.

సహకార సొసైటీల ఏర్పాటుతో రాష్ట్రాలలోని చిన్న సహకార బ్యాంకులను, సంస్థలను కేంద్రం చేజిక్కించుకుంటుంది. ఈ విధంగా అనేక రూపాలలో కేంద్రం-రాష్ట్రాల పరిధిలోని ఆర్థిక వనరులు, సంస్థలు, పరిశ్రమలను, సహజ సంపదలను వివిధ పద్ధతుల్లో తన అదుపులోకి తీసుకుంటూ వాటిని సామ్రాజ్యవాదులకు, బడా కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతూ వీలైన అన్ని మార్గాలలో రాష్ట్రాలపై దాడులకు పాల్పడుతోంది.

జమ్ముకాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగంలోని 370 మరియు '35ఏ' అధికరణాలను, కాశ్మీర్ ప్రజానీకంతో గానీ, ప్రజలెన్నుకున్న ఆ రాష్ట్రప్రభుత్వంతోకానీ, లేదా ఆ రాష్ట్రంలోని రాజకీయపార్టీలు,

నాయకులకు గానీ సంబంధం లేకుండా – అప్రజాస్వామికంగా రద్దుచేసి, జమ్ముకాశ్మీర్‌ను మూడు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టింది. ఢిల్లీ ప్రజానీకం ఎన్నుకున్న ఆ రాష్ట్రప్రభుత్వ అధికారాలను గుంజివేసుకుంటూ కేంద్రప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చి, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఆ అధికారాలను కట్టబెట్టింది. ఎన్నికైన ప్రభుత్వానికే అధికారాలుంటాయనే సుప్రీంకోర్టు తీర్పును తిరస్కరిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావటంపట్ల సుప్రీంకోర్టు నిర్ణయాన్ని కూడా అది సవాల్ చేసింది. బిజెపియేతర రాష్ట్రాల పాలనా వ్యవహారాలలో గవర్నర్లను ఉపయోగించి జోక్యం చేసుకుంటూ వారిపై ఆధిపత్యం చెలాయిస్తోంది. రాష్ట్రాల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండానే ఉపా, నాసా వంటి చట్టాలను–ప్రశ్నించే గొంతులను మరింత అణచివేసే విధంగా, వారిని జైళ్ళలో నిర్బంధించే విధంగా –సవరణలు చేసింది. ఇంకా, రాష్ట్రాల ఆమోదం, ఏకాభిప్రాయం లేకుండానే జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి, దానిని రాష్ట్రాలపై రుద్దారు. హిందీని అధికార భాషగా రాష్ట్రాలపై రుద్దేప్రయత్నం, కొన్నిరాష్ట్రాలు వ్యతిరేకించ టంతో ప్రస్తుతానికి వెనక్కు కొట్టబడింది.

ఈవిధంగా కేంద్రప్రభుత్వం రాష్ట్రాల ఆర్థిక, పరిపాలన, విద్య, వైద్య, భాష, సాంస్కృతిక రంగాలపై తన ఆధిపత్యాన్ని పెంచుతూ, నిరంకుశమైన పద్ధతిలో వ్యవహరిస్తోంది. పాలకవర్గ వ్యవస్థలన్నీ లోతైన సంక్షోభంలో వున్నాయని దీని అర్థం. ఈ సంక్షోభం నుండి బయటపడేందుకు పాలకవర్గ పార్టీలు ప్రజలను బలిచేస్తూ, ప్రజలపై అనేక భారాలను మోపు తున్నాయి.

కేంద్రంలో బిజెపి నాయకత్వంలో ఫాశిస్టు తరహా ప్రభుత్వం గత పాలకులు అమలు చేసిన సామ్రాజ్యవాద అనుకూల విధానాలను తన భుజాలపై కెత్తుకొని, వాటికి సేవచేస్తోంది. అది ప్రజల సమస్యలను తక్కువగా జూస్తూ అన్ని రంగాలను సామ్రాజ్యవాద కంపెనీలకు, కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలను మరింత దూకుడుగా అమలుచేస్తోంది. ప్రభుత్వరంగ పరిశ్రమలు, సంస్థలు, బ్యాంకులు, సహజ, ఖనిజ వనరులను లూటీ చేసుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ వుంటే, ప్రజావ్యతిరేక విధానాలను ముందుకు తెస్తూంటే, వాటిని వ్యతిరేకించటంలో రాష్ట్రప్రభుత్వాలు కనీసం నిజాయితీగా వుండకపోగా, వారూ అవే విధానాలను అవలంబిస్తున్నారు. సంక్షేమ పథకాల నిధులలో కోత, కార్పొరేట్లకు లక్షకోట్ల రూ॥ల విలువైన ఉద్దీపనలు, సబ్సిడీలను ప్రకటించటం జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు నోరు మెదపటంలేదు. రాష్ట్రాల అంగీకారం లేకుండానే సిబిఐ దాడులు సాగిస్తుందంటూ కేంద్రప్రభుత్వం ముందుకు తెచ్చిన సిబిఐ చట్టంలో మార్పులను మాత్రం రాష్ట్రాలలో పాలకవర్గ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కేంద్ర, రాష్ట్ర పాలక ప్రభుత్వాలు ఎవరి ప్రయోజనాలకోసం పనిచేస్తున్నాయో ఇది తెలుపుతోంది.

సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని, విదేశాల్లో మూలుగుతున్న నల్ల ధనాన్ని వెలికితీస్తామని, 2022 నాటికి రైతాంగ ఆదాయాలను రెట్టింపు చేస్తామనే అనేక గంభీర వాగ్దానాలతో బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. గత 9 ఏళ్ళలో వీనిలో ఒక్కటంటే ఒక్కటైనా నెరవేర్చకపోగా, ప్రజల సమస్యల తీవ్రత మరింత అధికమైంది. ప్రజాసమస్యలపై కేంద్రీకరించటానికి బదులుగా, మతతత్వ ఘర్షణలను, విద్వేష ప్రచారాలను ప్రోత్సహిస్తూ రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల ఎన్నికల్లో విజయం సాధించ గలమన్న వారి కుటిల పన్నాగం ఫలించలేదు. ఈ రాష్ట్రాలలో ఓటమితో, బిజెపి తీవ్ర సంక్షోభంలోపడి, అభద్రతా భావానికి గురవుతోంది. అదే విధంగా, ఇంకొన్ని రాష్ట్రాలలో చీలికలు, విభజన, కుట్రలకు పాల్పడి అధికారాన్ని చేజిక్కించుకుంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో, వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో విజయం సాధించేందుకు, అది తిరిగి బిజెపి యేతర రాష్ట్రాలలో దాడులకు, చీలికలకు పాల్పడుతోంది. లేదా ఎన్నికల నాటికి ఏదో విధంగా గెలుపొందేందుకు మతఘర్షణలను, మత విభేదాలను సృష్టించటానికి ప్రయత్నిస్తోంది. మోడీ–షా ద్వయం ఎన్నికల సన్నాహాలలో భాగంగా వారు హాజరయ్యే ప్రతిసభలోనూ, బిజెపియేతర రాష్ట్రప్రభుత్వాలపై, ఎన్‌డిఎ కూటమికి మద్దతునీయని, వెలుపలనున్న పార్టీలపై అవినీతి ఆరోపణలతో విరుచుకుపడు తున్నారు.

ఈ సంక్షోభం, అభద్రతల పతాక దశలో భాగమే, రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వ రద్దు! ఇటీవల మహారాష్ట్రలో ఇ.డి. కేసుల నెదుర్కొంటున్న, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ ఎన్‌సిపి నాయకుడు, మరికొందరు ఎంఎల్ఏలు బిజెపి కూటమిలో చేరిపోయి మంత్రులయ్యారు. దీనికి ముందుగా బిజెపి 'శివసేన'లో చీలికతెచ్చి మహారాష్ట్రలో అధికారంలోకి వచ్చింది. బీహార్ పరిస్థితి కూడా మహారాష్ట్రలాగానే వుండబోతుందని బిజెపి నాయకులు బాహాటంగానే హెచ్చరిస్తున్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర శాసనసభలో విజయం సాధించలేకపోయిన బిజెపి, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఉద్రిక్తతలు సృష్టిస్తూ, దాడులు, ఘర్షణలకు పాల్పడుతూ ప్రజలలో భయానక వాతావరణాన్ని కల్పిస్తోంది. రాష్ట్రాలలో బిజెపియేతర నాయకులు, సిబిఐ, ఐటి వంటి ఏజన్సీల ద్వారా బెదిరింపులకు, దాడులకు పాల్పడుతున్నారు. చివరికి వారు బిజెపిలోకి చేరటమో లేదా బిజెపికి లోబడటమో జరిగేవరకు కేంద్రప్రభుత్వం ఇలాంటి దాడులు కొనసాగిస్తూనే వుంది.

దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి చూస్తే– కర్నాటకలో బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల హక్కులన్నింటినీ గుంజుకొని, ప్రజా సంక్షేమాన్ని ప్రక్కనబెట్టింది. అవినీతి పెరిగి పోయిందని చివరకు కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రధాని మోడీకి ఫిర్యాదుచేసే పరిస్థితి వచ్చింది; ప్రభుత్వ వ్యవస్థలో ప్రతి పనికీ 'కమీషన్లు' (లంచాలు) వసూలు చేస్తున్నారని తెలిపింది. 'గో పరిరక్షణ చట్టం', 'హిజాబ్ అంశం' వంటి వాటితో ఉద్రిక్తతలను రేపటం ద్వారా తిరిగి రాష్ట్రంలో అధికారం చేపట్టాలని బిజెపి భావించింది. బిజెపి ఘోరమైన పాలన ఫలితమే కర్నాటక ఎన్నికలలో ఆ పార్టీ పరాజయం. అయితే, ఇక్కడ కర్నాటక ప్రజానీకానికి మరో ఇతర ప్రత్యామ్నాయం లేక కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారే తప్ప, కాంగ్రెస్ పట్ల విశ్వాసంతో మాత్రం కాదు. ఎంచేతనంటే, కాంగ్రెస్, బిజెపిలు రెండూ ఒకే వర్గానికి చెందినవారు కనుక!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసిపి అధికారం లోకి వస్తే, అది కేంద్ర ప్రభుత్వంతో పోరాడి ప్రత్యేకహోదాతోపాటు, విభజన హామీలను, పోలవరం నిధులను సాధించగలుగుతామని 2014 నాటి తమ ఎన్నికల ప్రచారంలో పేర్కొంది. అయితే, వైసిపి రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం సంపూర్ణంగా కేంద్ర ప్రభుత్వానికి సాగిలపడటమే జరుగుతోంది. కేంద్రం తీసుకునే ప్రతి నిర్ణయం, చట్టం రాష్ట్రంలో ఖచ్చితంగా అమలు జరుగుతున్నాయి. టిడిపి, జనసేన వంటి ప్రతిపక్ష పార్టీలు కూడా కేంద్రంతో సఖ్యంగా వుంటున్నాయి. **(2023 'జనశక్తి' ఆగస్టు సంచికలో 'ప్రభుత్వాధికారం కోసం బిజెపికి లోబడిన పాలకపార్టీల కుమ్ములాటలు' చూడండి)** ఇక, తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వం, బిఆర్ఎస్ నాయకత్వం కూడా నిర్దిష్ట అంశాలలో కేంద్రప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లుగా

# ప్రజా వాగ్గేయకారుడు కామ్రేడ్ గద్దర్‌కి జోహార్లు!



**గద్దర్** ప్రజా వాగ్గేయకారుడు, ఆశు కవి, ప్రజాజీవితంలో పీడిత వర్గాల, కులాల, వృత్తుల దుర్భర కష్టాలను గానం చేసిన గాయకుడు. కష్టజీవులను, బాధిత ప్రజలను స్పందింపజేసిన, మధ్యతరగతి వర్గాలను రంజింపచేసిన, స్వార్థపర బూర్జువా కళా బృందాలకు నోరూరుంచిన మహాగాయకుడు. ఆయన మరణించాడు కానీ ఆయన గానం వినిపిస్తూనే వుంటుంది.

విప్లవోద్యమంలో భాగంగా తనవంతు బరువుని తాను ఎత్తుకున్నాడు. జీవితంలోని ఒక దశలో పార్టీ సిద్ధాంతాలు, రాద్ధాంతాలు తనకవసరం లేదనుకున్నాడేమో, సామాన్య ప్రజల విశ్వాసాలతో జతకలసి నడిచాడు. భావవాద, మతవాద విశ్వాసాలతో వున్న ప్రజలను వాటి ద్వారా కూడా బయటకు లాగాలనుకున్నాడేమో, అందుచేతనే బతుకమ్మ, సీతమ్మల చుట్టూ తిరిగాడు.

అతని ఆవేదన, ఆక్రోశాలకు సమాధానాలు - సరైన సమాధానాలు - ఆయన దొరకబుచ్చుకోలేకపోయాడనిపిస్తుంది. ఆత్మ ఒక చోట ఒక విధంగా, చర్య మరోచోట మరో విధంగా మారిపోయాడనుకోవాలి. ఇది విప్లవోద్యమ సిద్ధాంత రాజకీయ, నిర్మాణ సంబంధమైన విషయంగా వుంటుంది. గద్దర్ దేని కోసమో పరితపిస్తున్నాడని దూరంగా వున్న నాకు, అతనితో ప్రత్యక్ష పరిచయం లేని నాకెలా తెలుస్తుంది? అయినా ఆయన ప్రజా విముక్తి కోసం పరితపిస్తున్నాడనుకుంటున్నాను. రాజ్యం ఆయనను అంతం చేయాలనుకుని కుట్ర పన్నిన సందర్భం - అదే రాజ్యశక్తులు ఆయనను కౌగిలించుకొంటున్న తీరు, దోపిడీవర్గ శక్తులు ప్రజల మనిషిని తమ మనిషిగా చాటుకోవాలనే దోపిడీవర్గ రాజకీయ వికృతాన్ని గద్దర్ గమనించకపోలేదు.

గద్దర్ పీడిత ప్రజల మనిషి. జాతి, కుల, మత వివక్షలకు వ్యతిరేకంగా నిలిచిన మనిషి - కామ్రేడ్. అతనికి నా విప్లవ జోహార్లు! ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అనుచరులు, సానుభూతిపరుల దుఃఖంలో పాలుపంచుకొంటున్నాను.

**27-8-2023** — **- విశ్వం**

**కేంద్ర...** (7వ పేజీ తరువాయి)

కన్పిస్తున్నప్పటికీ, బిజెపిపై విరుచుకుపడుతున్నప్పటికీ, దేశంలో బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలన్నింటినీ సమీకరిస్తామని చెబుతున్నప్పటికీ, కొద్దికాలం తర్వాత చప్పుడు చేయకుండా వుండటమే జరుగుతోంది.

సిపిఎం నాయకత్వంలోని కేరళ ప్రభుత్వంపై ప్రారంభం నుండీ విషపూరితమైన, కుట్ర పూరితమైన ప్రచారంతో బిజెపి నిరంతరాయంగా దాడులు సాగిస్తూనే వుంది. కేరళ ప్రభుత్వం కూడా కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల లోని కొన్ని అంశాలను అంగీకరించటంలేదు. ఏమైనా, బిజెపి ఫాశిస్టు ప్రభుత్వం దేశంలో సహజ వనరులన్నింటినీ అంబానీ, ఆదానీలకు కట్టబెడుతోందని ప్రజాశ్రేణుల ముందువరుసలో నిలబడి సిపిఎం నిరసన తెలియజేస్తూ వుంది. కానీ, కేరళలోని విళింజం నౌకాశ్రయాన్ని అదానికి అప్పగించటాన్ని వ్యతిరేకిస్తూ మత్స్యకారులు సాగించిన ఉద్యమం హింసాత్మక రూపం తీసుకొంది. ఈ అంశంపై బిజెపి, సిపిఎంలు రెండూ ఈ ఆందోళనకారుల చర్యలను నిరసిస్తూ సమైక్యంగా ప్రదర్శనలు నిర్వహించారు. ఆశ్చర్యకంగా, కేరళ రాష్ట్ర ప్రభుత్వం, అత్యధిక ప్రకృతిని, ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తూ నిర్మించే 'సిల్వర్ లైన్'గా పిలవబడే హైస్పీడ్ రైల్వేలైన్ నిర్మాణానికి కావలసిన నిధులను, అనుమతులను మంజూరు చేయవలసిందిగా ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేసింది.

తమిళనాడు ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సాగుచట్టాలు, హిందీ భాషా ఆధిపత్యం మొదలగు వాటిని తీవ్రంగా వ్యతిరేకించింది.

దేశంలో ప్రతిపక్ష పార్టీలు వాని మధ్య ఎన్ని విబేధాలున్నప్పటికీ, రానున్న సార్వత్రిక ఎన్నికలలో బిజెపిని ఓడించేందుకు ఒకే కూటమిగా ఏర్పడేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఐఎన్‌డిఐఏ - (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూసివ్ అలయెన్స్ -'ఇండియా') ఏర్పాటు అందులో భాగమే. ఎన్నికల సందర్భంగా కూటములను ఏర్పరచటం ప్రతిపక్ష పార్టీలకు ఒక ఆనవాయితీగా మారింది. ఎన్నికల్లో విజయం సాధించటం మినహా వారికి మరో ఆలోచన లేదు. తమ స్వీయ, రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకునేందుకు పాలకవర్గాలు ఒక ఫ్రంటు ఏర్పరచుకోవాలని ఆసక్తిగా వుంటాయిగానీ, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించటంలో ఖచ్చితమైన వైఖరితో నిలబడలేకపోతున్నాయి. కనుక, ఆ కూటమి ప్రయత్నాలు, కేవలం బిజెపిని ఎన్నికలలో ఓడించటానికి మాత్రమే పరిమితం కారాదు.

కేంద్ర, రాష్ట్ర పాలకవర్గాలు సామ్రాజ్యవాదులకు, బడా బూర్జువాలకు దాసోహమని, అంతిమంగా వారి ప్రయోజనాలకు సేవజేసేవే. కనుక, ప్రజానీకం బిజెపి ఫాశిస్టు తరహా ప్రభుత్వ సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలు, చర్యలతోపాటు, రాష్ట్రాలపై సాగించే దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి. రాష్ట్రం లేదా దేశ ప్రజల అభివృద్ధి, ప్రయోజనాలేమీ పట్టని, తమ స్వీయ రాజకీయ, పాలనాపరమైన ప్రయోజనాలు తప్ప మరేమీ పట్టని రాష్ట్రాలలోని పాలకవర్గ ప్రభుత్వాలను, ప్రతిపక్ష రాజకీయ వర్గాలను వెల్లడి చేయాలి. వాస్తవిక అంశాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు, ప్రేరేపించబడుతున్న ఉన్మాద, విద్వేషాల ఉన్మత్త భావజాలానికి ప్రజలు సమిధలుగా మారకుండా వారిని జాగరూకులను చేయాలి. మేధావులు, సామాజికకార్యకర్తలు, ప్రజాస్వామికశక్తులు, విప్లవ శక్తులన్నీ ఈ మార్గంలో కృషి సాగించాలి. ✱

Read ! Subscribe!!
Class Struggle
Organ of Central Committee of CPI (ML)

# ఐఎన్‌డిఐఏ (ఇండియా) : పేరులో ఏముంది?

**అలోక్ ముఖర్జీ**

**ఒక** పేరులో ఏముందని కొందరు అనవచ్చు. అయితే హేతుప్రాసలు లేకుండా ఏదో ఒక పేరును ముందుకు తోయటం, ఇతరులంతా దానిని ఆమోదించటం... ఈ ప్రశ్నను ముందుకు తెస్తోంది. 'ఇండియా' ఒక గొప్పదేశంగా వుండటానికి బదులుగా, తమ పార్లమెంటరీ కాంక్షల బలివితర్దిపై మన ప్రియమైన దేశాన్ని వుంచటానికి కూడా సిగ్గుపడని స్వీయ కోర్కెల నాయకుల కూటమి పేరుగా మారిపోయింది. మోడీ ఫాశిస్టు తరహా పాలనకు వ్యతిరేకంగా ఈ ప్రత్యేక కూటమి పోరాడుతుందని ప్రజలను నమ్మించేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. ఈ కూటమి మోడీతో ఎక్కడ రాజకీయంగా విబేధిస్తుంది?! దీని గురించి చర్చించటానికి ఈ కూటమి సభ్య పార్టీలకు సమయము లేదు; అయితే, దీనిని ఏవిధంగా ఎగవేయాలనే దానిపై చర్చించటానికి మాత్రం తగినంత సమయముంది. కానీ, ఈ కూటమి పేరు తనుకు తానుగానే ఎన్‌డిఏ నాయకత్వంలోని మోడీ–షాల సిద్ధాంత భావజాలానికే ప్రాతినిధ్యం వహిస్తున్నారని రుజువు చేస్తోంది.

ఈ కూటమి మోడీకి నిజమైన ప్రతిపక్షమే అయివుంటే, అది పేరులోనూ ప్రతిఫలించి వుండేది. ఆ పరిస్థితుల్లో అయితే, మొదట కూటమి కార్యక్రమమేమిటో చర్చించి వుండే వారు. అయితే వారు గుర్రాన్ని బండికి ముందు కట్టేశారు. కూటిమిలోని పార్టీలన్నీ మోడీ పాలన ఫాశిస్టు లేదా నిరంకుశమైనదిగా పిలుస్తున్నారు. అప్పుడు నిరంకుశానికి లేదా ఫాశిజానికి వ్యతిరేకమైనది ఏమై వుండాలి? రాజకీయ పరిజ్ఞానమున్న ఎవరికైనా అది ప్రజాస్వామ్యమని తెలుసు. కూటమి పేరులో 'డి' అక్షరం వుంది; అయితే అది ప్రజాస్వామ్యాన్ని వుద్దేశించికాదు. కానీ, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకోసం అమెరికా ఏకాభిప్రాయంగా నిర్దేశించిన నయా ఉదారవాద సిద్ధాంత శబ్దమైన 'డెవలప్‌మెంటల్' అనే దానిని 'డి' సూచిస్తోంది. 'డెవలప్‌మెంట్' అని వల్లెవేసే ఈ పదం, మోడీ అండ్ కంపెనీ మంత్రంగా నిరంతరం జపిస్తూ వుండేదే. ఇక దీనిలో 'ఎన్' అనే అక్షరానికి 'నేషనల్'(జాతీయ) అనేవిధంగా పశ్చిమబెంగాల్ అధినేత్రి మమతా బెనర్జీ ఆలోచనల యొక్క కీలకాంశంగా జోడించారు.

మోడీ ఉపయోగిస్తున్న 'నేషనల్' అనే పదానికి, వీరు చెబుతున్న ఈ పదానికి అర్థంలో ఏమైనా తేడా వుందా? స్వావలంబనకు బదులుగా ఒక్కసారి నీవు 'డెవలప్‌మెంట్' అనే పదానికి ఆమోదం తెలిపితే, జాత్యహంకారం, యుద్ధోన్మాదాలను నిరంతరం మోసుకు తిరిగే మోదీ చెప్పే అర్థమే దీనికి కూడా వర్తిస్తుంది. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించటం వంటి ఇతర అంశాలు 'కూటమి' అర్థంలో వున్నాయా, వుంటే వాటిని ప్రకటించాలి.

మమతాబెనర్జీ మరో అస్పష్టమైన 'ఇన్‌క్లూసివ్' అనే పదాన్ని చేర్చింది. కూటమిగా చెప్పబడే దాని విశేషణంగా దీనిని ఉపయోగించారని, 'డెవలప్‌మెంటల్' అనే పదాన్ని కాదని ప్రతి ఒక్కరూ స్పష్టంగా వుండాలి. కావున 'డెవలప్‌మెంటల్' కార్యకలాపాలు 'ఇన్‌క్లూసివ్'గా (సమ్మిళితంగా) వుంటాయనేది దీని అర్థం. ఏమైనా, ఐఎంఎఫ్–వరల్డ్‌బ్యాంక్–డబ్ల్యుటిఓల త్రయం నుండి అరువు తెచ్చుకున్న పదమే అది. ప్రజలను మోసగించటానికి, గుత్తకంపెనీల ప్రయోజనాలకు సేవజేసేందుకు తరచుగా ఈ త్రయం 'హోలిస్టిక్'(సమగ్రాకృతి), 'ఇన్‌క్లూసివ్' (సమ్మిళిత) వంటి పదాలను ఉపయోగిస్తుంది. ఏమైనా, ఇక్కడ కూటమికి విశేషణంగా 'ఇన్‌క్లూసివ్'ను ఉపయోగించటమంటే అర్థం, అదానీ, అంబానీ, అలాగే ఇతరులను కూడా వర్గ సమూహాలుగా కాకుండా, రాజకీయ పార్టీలకు ప్రాతినిధ్యం వహించే వారిగా గుర్తింపుతో చేర్చుకోవాలనేదే! పీడిత ప్రజల ప్రయోజనాలు చాలా ప్రాముఖ్యం కల్గినవనేది నిజం. అయితే పీడిత వర్గాలకు వ్యతిరేకులుగా అయితే మాత్రం కాదు. దీనిని బరితెగించి, తెలివిగా చేసుకోవాలి; ఎందుచేతనంటే అంబానీ, అదానీ వంటి వారు, కార్మికులు, పేద ప్రజానీకం కలగలవటమే దీని అర్థమైతే అదొక నవ్వులాట వ్యవహారంగా మిగిలిపోతుంది. వాస్తవానికి 'ఇన్‌క్లూసివ్' అంటే అర్థం–అదానీ, అంబానీ మరియు వారి తరహా వారి ప్రయోజనాలన్నీ 'ఇన్‌క్లూడ్' చేసుకోవాలనేదే!

మొత్తంమీద ఇది భారత ప్రజల ప్రయోజనాలకోసం ఏర్పడిన కూటమి కాదు; అయితే ఫాశిస్టు/నిరంకుశ మోడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజల మనోవేదన, ఆగ్రహాలను కొందరు అవకాశవాద నాయకులు తమ పదవీ కాంక్షకోసం ఉపయోగించుకునేదే! 'ఇండియా' కూటమి నయా ఉదారవాదం విషయంలో ఎక్కడ నిలబడుతుంది? హిందూ మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడటంలో వారు ఎక్కడ నిలుస్తారు, నూతన కార్మిక కోడ్‌లపై వారి వైఖరి ఏమిటి, పొరుగు దేశాలతో శాంతియుత సహజీవనం స్థానంలో, జాతీయవాద దురహంకారం పెంచిన యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించటంలో వీరు ఎక్కడ నిలబడతారు? అక్కడ అన్నీ ప్రశ్నలు, ప్రశ్నలే! మోడీ ప్రభావశీలంగా తన కార్యాచరణను అమలు చేస్తున్నాడు. అభివృద్ధి, జాతీయవాదం, విదేశాంగ విధానాలపై, మోడీ పాలనపై అత్యధిక నాయకులు కూడా ఒకే అభిప్రాయం కలిగి బడా బూర్జువావర్గపు అత్యంత ప్రచండ శక్తులను పూర్తి ఆధిపత్యంతో పాలనకు అనుమతించటం కోసమేనని అభిప్రాయపడు తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'ఇండియా'గా పిలవబడే ఈ కూటమి దేశ ప్రజలకు నమ్మక ద్రోహం చేసింది. ✡

---

**మారుతి...** (14వ పేజీ నుండి)

కార్మికోద్యమం ఈ ధోరణిని ప్రత్యేకించి పరిగణలోకి తీసుకొని దానిని పట్టుకొని నిలుపు చేయటానికి, దానితో గంభీరంగా వ్యవహరించాలి.

'జపనీస్ మేనేజ్‌మెంట్ అండ్ ఇండియన్ రెసిస్టెన్స్' అనే తమ పుస్తకం ద్వారా అంజలి దేశ్‌పాండే, నందితా హక్సర్‌లు ప్రపంచీకరణ ఇండియాలో నేటి కార్మికుల వాస్తవ స్థితిగతులను, దేశంలోని కార్మికోద్యమ వైఫల్యాలను, దేశంలోని ట్రేడ్ యూనియన్ ఉద్యమం ముందున్న సవాళ్ళను వెలుగులోకి తెచ్చి, దేశంలో కార్మికుల కోసం, కార్మికవర్గ ప్రయోజనాలకోసం పని చేస్తున్నామని ప్రకటించుకుంటున్న ప్రతి ఒక్కరూ విమర్శనాత్మకంగా సమీక్షించుకునేందుకు, పరిశీలన చేసుకునేందుకు ఒక అవకాశాన్ని కల్పించారు. దేశంలోని ట్రేడ్‌యూనియన్ ఉద్యమ దుర్బలత్వాన్ని గుర్తించి, దానిని కార్మికవర్గ సిసలైన ఉద్యమంగా పునరుద్ధరించుకొని, పునరుజ్జీవింప చేసు కొనేందుకు, నిజాయితీగా అభిలషిస్తే, ఈ పుస్తకం మరింత ఉపయుక్తంగా వుంటుంది. ✡


*Read !* *Subscribe!!*




*Hindi Organ of Central Committee of CPI (ML)*

# ఉత్తర భారతంలో వరద బీభత్సం

## ప్రకృతి శాపమా? పాలకుల పాపమా?

**జులై,** ఆగస్టు నెలల్లో ఉత్తర భారతదేశంలో ప్రధానంగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, యు.పి., జమ్ము కాశ్మీర్, రాజస్థాన్ రాష్ట్రాలలో రెండు దఫాలుగా భారీ వర్షాలు, వరదలు విరుచుకుపడ్డాయి. ఉత్తరాఖండ్‌లో వరదల తీవ్రత కొనసాగుతోంది. జనజీవనం అస్తవ్యస్తమైంది. కొండచరియలు విరిగిపడటంతో దిగువ ప్రాంతాలలోని గృహాలు, ఇతర నిర్మాణాలు శిధిలాలుగా మారిపోతున్నాయి. కొండచరియలు, మట్టి దిబ్బల కింద సజీవంగా కూరుకుపోయిన వారి మృతదేహాల్ని వెలికితీసే చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. వందలాది మంది ప్రజానీకం ఈ రాష్ట్రాలలో సంభవించిన వరదలు, భారీవర్షాల కారణంగా విపత్తులలో చిక్కుకొని ప్రాణాలొదిలారు. జులై వరదలనుండి తేరకోక మునుపే మరోసారి భీకర వరదలు ముంచెత్తాయి. మొత్తంమీద వేల కోట్ల రూ॥ల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తినష్టం జరిగింది. హిమాచల్‌ప్రదేశ్‌లోనే 210 మంది, ఉత్తరాఖండ్‌లో 60 మంది, పంజాబ్‌లో 40 మంది మరణించినట్లు పత్రికా వార్తల ద్వారా తెలుస్తుండగా, వాస్తవానికి ఈ సంఖ్య మరింత అధికంగా వుంటుంది. ఈ ప్రాంతాల్లోని పర్యాటక, యాత్రాస్థలాలలో చిక్కుకుపోయిన ఇతర రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది యాత్రికులు, పర్యాటకులు నిస్సహాయంగా నిలచిపోయారు. రవాణా, విద్యుత్ వ్యవస్థలు కోలుకోలేనివిధంగా దెబ్బతినటంతో బాధితులకు రక్షణ, సహాయ చర్యలు అందటం మరింత జాప్యమౌతోంది. చార్‌ధామ్ ప్రధాన రహదారిపై కొండచరియలు విరిగిపడి, వాహనాల రవాణా స్థంభించి సరఫరాలు ఆగిపోయాయి. గిర్డీ నదిపై వంతెన కూలి ఇండో–టిబెట్ సరిహద్దువరకు బాధితులకు సహాయంగా రావలసిన రక్షణ బలగాల రాకపోకలు స్థంభించాయి. వేల కోట్ల రూ॥ల ప్రజాధనంతో నిర్మిస్తున్న నాల్గువరసల మనాలీ హైవేపై రవాణా నిలిచిపోయింది.

ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా యమునానది పొంగి ప్రవహించి పరిసర గ్రామాలను ముంచెత్తింది. యమునానది వరద ఢిల్లీలోని ఎర్రకోటను తాకింది. పంజాబ్‌లోని 19 జిల్లాలలో, 150 గ్రామాలు ఈసారి వరద ముంపుకు గురయ్యాయి. గ్రామాలకు గ్రామాలే తుడిచిపెట్టుకుపోయాయి; పశువులు, జంతువులు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. పొలాలన్నీ ఇసుకతో మేటవేయటంతో తిరిగి పంటలు వేయలేని పరిస్థితి నెలకొంది.

2013 సం॥లో ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు, వరదలకు అనేక గ్రామాలు, పట్టణాలు తుడిచిపెట్టుకుపోయి అపార ప్రాణ, ఆస్థి నష్టం జరిగింది. ఈ పెనువిపత్తునుండి ఎలాంటి పాఠాలు నేర్చుకోవటానికీ పాలకులు సిద్ధంగా లేరు.

2023లో తిరిగి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోనే హిమాలయ పర్వత వంపుల్లోని జోషిమఠ్ పట్టణంతోసహా పరిసరాల్లో భూమిలోపలికి కుంగిపోయింది. రానున్న కాలంలో పెను ప్రమాదాలకు హెచ్చరిక చేసింది.

### వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు

వాతావరణ పర్యవసానాలు హిమాలయాలపై, దేశ కోస్తా ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపబోతున్నాయని 'ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్'(ఐపిసిసి) 6వ నివేదిక స్పష్టంగా పేర్కొంది. మనదేశంలో దాదాపు 10 కోట్ల ఎకరాలకు పైగా ప్రాంతం వరద ముంపు నెదుర్కోబోతుందని వాతావరణ అంచనాలున్నాయి. హిమాలయాల్లో సగటు ఉష్ణోగ్రతలు గత కొంతకాలంగా క్రమంగా పెరుగుతున్నాయి. 2023 జూన్ నెలలో ప్రపంచ మహాసముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతలు ఎన్నడూలేని స్థాయిలో నమోదయ్యాయి. మధ్యధరా సముద్ర ప్రాంతాలలో పుట్టి, శీతాకాలంలో ఉపఖండానికి మంచు, వర్షపాతాన్ని తీసుకువచ్చే పశ్చిమ అలజడులు (వెస్టర్న్ డిస్ట్రబెన్సెస్) క్రమంగా అస్థిరంగా వుంటున్నాయి. పశ్చిమ అలజడులకు రుతుపవనాల కలయికతో అసహజ వాతావరణం నెలకొందని, 'హైరిస్క్' ఘటనలు జరిగే అవకాశముందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు కూడా. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు వేడెక్కటం మూలంగా ఉద్భవించే ఎల్‌నినో వలన ప్రపంచవ్యాపితంగా ఉష్ణోగ్రత, వర్షపాతాల తీరుతెన్నులు మారిపోతాయి. కొన్ని చోట్ల కుంభవృష్టి, మరికొన్ని చోట్ల అనావృష్టి నెలకొంటుంది. ప్రపంచవ్యాపితంగా వెలువడుతున్న కర్బన ఉద్గారాల తీవ్రత భూతాపాన్ని పెంచుతూనే వుంది. భూగ్రహం వేడెక్కుతోందనే స్థితిని దాటి మరుగుతోందనే దశకు చేరుకుందని ఐక్యరాజ్య సమితి అధ్యక్షుడు గుటెర్రస్ వ్యాఖ్యానించారు.

### ఈ వాతావరణ మార్పులకు కారణాలేమిటి?

సామ్రాజ్యవాదులు, వారి దళారులైన వివిధ దేశాల పాలకులు తమ సూపర్ లాభార్జనలకోసం చిత్తమొచ్చిన రీతిలో ప్రకృతితో వ్యవహరించటమే వాతావరణంలో ఈ మార్పులకు ముఖ్యమైన కారణం. అడవుల విచ్చలవిడి నరికివేత, వాతావరణంలోకి కర్బన ఉద్గారాలను భారీగా విడుదల చేయటం, భూతాపం క్రమంగా పెరగటానికి కారణంగా వుందని, ఇది వాతావరణంలో అనూహ్య మార్పులకు దారి తీస్తుందని 200 దేశాల ప్రాతినిధ్యంతో జరిగిన 'కాప్–20' సదస్సు పునరుద్ఘాటించింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి, మనిషిని ప్రకృతి నుండి వేరుచేస్తుందని, హద్దుల్లేని వనరుల దోపిడీ పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని కారల్‌మార్క్స్ వ్యాఖ్యానించింది అక్షర సత్యంగా రుజువౌతోంది.

### హిమాలయ పర్వత ప్రాంతాల్లో అభివృద్ధి పేరిట ప్రకృతి విధ్వంసం

హిమాలయాలు మనదేశ ఉత్తర, ఈశాన్య, వాయవ్య ప్రాంతాలలోని 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో విస్తరించి వున్నాయి. గంగ, యమున వంటి జీవనదులకు హిమాలయ ప్రాంతం జన్మస్థలంగా వుండి, అనాదిగా జీవకోటి మనుగడకు దోహదపడుతోంది. వన్య ప్రాణులకు, జీవవైవిధ్యానికి పేరెన్నికగన్న అడవులు, లోయలతో విస్తరించిన ప్రాంతమిది.

సున్నిత వాతావరణంతో, సుందరమైన ఈ ప్రాంతాన్ని తమ స్వార్థ, స్వీయ ప్రయోజనాల కోసం పాలకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. 2013 నాటి వరదలలో మృతిచెందిన వారి స్మారకం పేరిట 16 బైపాస్‌లు, 15 ఫ్లైఓవర్లు, 3516 కల్వర్టులతో ఉత్తరాఖండ్‌లో నిర్మించిన భారీ ఛార్‌ధాం ప్రాజెక్టు పర్యావరణాన్ని దెబ్బతీసి వినాశనానికి హేతువవుతుందని అనేకమంది నిపుణులు ఆనాటి నుండీ హెచ్చరిస్తూనే వున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో కొండచరియల పతనం తరచూ జరుగుతుందని ఇస్రో ఎప్పుడో తేల్చిచెప్పింది. 2020–22ల మధ్యకాలంలో కొండచరియల పతనం ఆరు రెట్లు పెరిగిందని అంచనాకొచ్చారు. అనేక హెచ్చరికలను ఖాతరు చేయకుండా గత పదేళ్ళలో హిమాలయ పర్వత సానువుల్లో ఏకంగా 69 నేషనల్ హైవే ప్రాజెక్టులకు పాలకులు ఆమోదం తెలిపారు.

హిమాలయ ప్రాంతంలో ఇప్పటికే 168 జలవిద్యుత్తు కేంద్రాలుండగా, 2030 నాటికి మొత్తంగా 1088 విద్యుత్తు కేంద్రాలు స్థాపించటానికి అనుమతులిచ్చారు. సముద్ర మట్టానికి 2200-2500 మీటర్ల ఎత్తులో జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణం నష్టదాయకమన్న నిపుణుల సూచనలను ఈ సందర్భంగా పరిగణలోకే తీసుకోలేదు.

అంతేగాక, ఇష్టారాజ్యంగా సాగిన అక్రమ గనుల తవ్వకాలు, శిధిలావశేషాల్ని నదుల్లో పడేయటం, సహజనదీ ప్రవాహాల్ని నిరోధించిన నిర్మాణాలు, అశాస్త్రీయంగా చేపట్టిన భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు...వంటివన్నీ ఈ ప్రాంతంలో విపత్తులను మరింత తీవ్రం చేశాయి. వరద తాకిడి అధికంగా వుండే ప్రాంతాలలో నిర్మాణాలు, భారీ కట్టడాలు సాగించటం, మురుగునీటి పారుదల వ్యవస్థను విస్మరించటం, వివిధ నిర్మాణాలకోసం చెరువులు, సరస్సులను పూడ్చివేయటం- విపత్తు మోతాదును అనేకరెట్లు పెంచుతోంది. హిమాలయాల ప్రాంత సంరక్షణకోసం జరగాల్సిన వ్యవస్థాగత కృషిపై మహేష్ చంద్రకమిటీ, చోప్రాకమిటీ వంటివి విలువైన సూచనలెన్నో చేసినా, వాటిని పాలకులు చెత్త బుట్టల పాల్జేశారు. ప్రజల ఆలోచనలను మళ్ళించటంకోసం తిరిగి కొత్తగా ఇప్పుడు ఈ ప్రాంత సమగ్ర అధ్యయనంకోసం సుప్రీంకోర్టు నిపుణుల సంఘం ఏర్పరచాలని నిర్ణయించారు.

సామ్రాజ్యవాదుల, బడా కార్పొరేట్ల ప్రయోజనాల కనుగుణంగానే ఆగస్టు మొదటి వారంలో బిజెపి నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం, అటవీ సంరక్షణ (సవరణ) చట్టం పేరిట యధేచ్ఛగా అడుల విధ్వంసానికి అనుమతించింది. దేశ సరిహద్దులనుండి లోపలికి వంద కి॥మీ॥ పరిధి వరకు తమ ఇష్టారాజ్యంగా అడవులను కట్టబెట్టేందుకు ఈ సవరణ చట్టం అనుమతిస్తోంది. దీనితో అత్యంత సున్నిత వాతావరణ స్థితిగతులతో నున్న హిమాలయ పర్వత ప్రాంతం కూడా మరింత విధ్వంసానికి గురయ్యే ప్రమాదముంది.

విచ్చలవిడిగా అడవుల నరికివేతతో చెట్లు కనుమరుగై వాటి ఆకులు మట్టిలో కలిసే ప్రక్రియ ఆగిపోతుంది. వాననీటి వలన భూమి కోతకు గురై, నదుల్లోకి మట్టి భారీగా పేరుకుంటోంది. మరోవైపున వాననీటిని నిల్వచేసుకొనే సామర్థ్యం కూడా భూమికి తగ్గిపోతోంది. భూమికి నిల్వసామర్థ్యం తగ్గి, నదుల్లో మట్టి పేరుకు పోవటంతో భారీవర్షాల కారణంగా వచ్చే నీటిని నిలుపుకోలేక, నదులు ఉప్పొంగి వరద ఉధృతికి, వినాశనానికి దారితీస్తోంది.

(తరువాయి 5వ పేజీలో)

## మణిపూర్ ...

(12వ పేజీ నుండి)

ముందే విడుదల చేశాడు. ఈ తరహా యాత్రలు కూడా గడిచిన మూడు సంవత్సరాలుగా మాత్రమే సాగుతున్నాయి. మను మానేసర్ విడుదల చేసిన వీడియోలకు ప్రతిగా కొందరు ముస్లిం యువకులు కూడా వీడియోలను సామాజిక మాధ్యమాలలో వుంచారు. ఈ క్రమంలో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఊరేగింపు రోజున శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే వాతావరణం నెలకొని ఉంది. ఇతర పట్టణాల నుండి, పొరుగు రాష్ట్రాల నుండి కూడా విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలను, సుమారు 5 లేక 6 వేల మందిని భక్తుల పేరిట పోగు చేశారు. వీరు తమ చేతులతో కర్రలు, కత్తులు బహిరంగంగా ప్రదర్శిస్తూ ఊరేగింపు చేయడమేకాక బిట్టు బజరంగీ అనే వి హెచ్ పి కార్యకర్త , "మీ బావమరిదిని వచ్చాను. తగిన సత్కారాలు చేయరండి" అంటూ ముస్లింలను రెచ్చగొట్టే ప్రసంగాలు, నినాదాలు ఇస్తూ, అవన్నీ ఊరేగింపు మైకులో బిగ్గరగా ప్రకటిస్తూ సాగాడు. ఇంత హింసాపూరిత వాతావరణం నెలకొని ఉన్నా పోలీసు బలగాలు సాయుధ ఊరేగింపు గుంపులను నిరోధించే ప్రయత్నం చేయకపోగా, స్వల్ప సంఖ్యలో ఉండటమే కాక నిర్లిప్తంగా మౌన ప్రేక్షకులుగా వ్యవహరించారు. డబల్ ఇంజన్ బుల్డోజర్ భాజపా ప్రభుత్వం, సాయుధ మూకల దండయాత్రకు స్వేచ్ఛనిచ్చినట్లు పథకం ప్రకారం మతోన్మాద కార్యకలాపాలను సాగనిచ్చారు.

**స్థానిక మేవాటి ముస్లిం యువకులు**

జూలై 31 నాటి సాయుధ ఊరేగింపుకి నిరసన ప్రకటించడంతో కొంత ఘర్షణ జరిగి ప్రదర్శన చెల్లా చెదురయ్యింది.

ఆ సందర్భంగా ఒక భజరంగ్ దళ్ కార్యకర్తకు భౌతిక రక్షణ నిచ్చిన ఒక ముస్లిం వ్యక్తి ఇంటిని కూడా మరుసటి రోజు బుల్డోజర్ విధ్వంసంలో ప్రభుత్వం నేలమట్టం చేసింది. అదే రోజు గురుగావ్ నగరానికి మతోన్మాద మూకుమ్మడి దాడులను విస్తరింపజేసి అక్కడి జామా మసీద్ ఇమామ్‌ను హత్య చేశారు. తర్వాత కొద్ది రోజులలో భాజపావారి మహా పంచాయత్‌లు నిర్వహించి అరెస్టు అయిన ఇమామ్ హంతకులను విడుదల చేయాలని, హిందువుల షాపులలో పనిచేసే ముస్లిం పని వారిని పనులనుండి తొలగించాలని, ముస్లింలను గ్రామాలలోకి రాకుండా నిషేధించాలని తీర్మానాలు చేయించారు. ఇవన్నీ పచ్చి ఫాసిస్టు పద్ధతులని వేరే చెప్ప పనిలేదు.

## నూహ్‌లో ఉన్మాద చర్యలు విడివిడి సంఘటనలు కావు

అప్పటికి మూడు నెలలుగా సాగుతున్న మణిపూర్ దురాగతాలు జులై 19వ తేదీన బట్టబయలైన పిదప భాజపా భక్త బృందాలు తప్ప, సుప్రీంకోర్టుతో సహా దేశం దేశమంతా ఆగ్రహం ప్రకటించాయి. అన్ని రాష్ట్రాలలో ప్రజలు నిరసనలై వెల్లువెత్తుతున్న రోజులు. పార్లమెంట్ శీతాకాలం సభలు సమావేశాలు ప్రారంభమై పది రోజులు గడిచినా మణిపూర్ ఘటనలపై ప్రధానమంత్రి వివరణ కోసం పట్టు బడుతున్న విపక్షాల నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించడం, చివరకు ప్రధానమంత్రి నోరు విప్పించడానికి ప్రతిపక్షకూటమి పార్టీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించడం, దాన్ని లోక్‌సభ స్పీకర్ జులై 26న ఆమోదించడం తెలిసినదే. ఈ పరిస్థితులలో మణిపూర్‌పై ఆగ్రహపూరిత చర్చలను మరోఘటనపైకి మళ్ళించడానికి, బిజెపి పాలకులు బరితెగించి ఒక పథకం ప్రకారం సృష్టించినవే హర్యానా రాష్ట్రంలోని నూహ్, గురుగావ్‌లలో సాగిన విద్వేషపూరిత దాడులు.

ఒక సంవత్సరంలో 5 రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు, పది నెలలలో సార్వత్రిక పార్లమెంటు ఎన్నికలు దగ్గర పడుతున్న సందర్భంగా మత విద్వేషాలను జాతీయ ఉన్మాదాలను సృష్టించడం ద్వారా తప్ప గెలుపు పొందటం సాధ్యం కాని పరిస్థితికి చేరిన భాజపా, నేటి కేంద్ర ప్రభుత్వం పదేపదే పుల్వామా లాంటి ఘటనలు సృష్టించ లేదు. కానీ మతోన్మాద ఘటనలను విస్తారంగా సృష్టించగల దుర్మార్గపు ఎజెండా, దానిని అమలు చేయగల ఆర్ఎస్ఎస్ ఫాశిస్టు శ్రేణులు వారి వెనుక ఉన్నాయి. తమ పాలనలో ఉన్న రాష్ట్రాలలో ఈ ఎజెండాను మొదట అమలు పరచి దేశవ్యాప్తంగా మతవిద్వేష వాతావరణాన్ని విస్తరింపజేసి ఎన్నికలలో గెలుపొందటానికి వేసుకున్న కుట్ర పూరిత దుర్మార్గ పథకంలో భాగమే నేటి హర్యానా ఘటనలు.

శ్రామిక విప్లవ శక్తులు, ప్రజాస్వామిక లౌకికవాదులు, మతసామరస్య జీవులు ఏకమై ప్రజలలో చైతన్యాన్ని పెంపొందిస్తే తప్ప ఈ తరహా మతోన్మాద పూరిత దుష్ట పథకాన్ని ఓడించలేము. దేశంలోని సమస్త సంపదలను కైవసం చేసుకుంటున్న సామ్రాజ్యవాదుల బడా కార్పొరేట్ కుబేరుల దోపిడీని అరికట్టలేము. ★

# మణిపూర్ దురాగతాల కొనసాగింపుగా హర్యానాలో హిందూమతోన్మాద అగ్నికీలలు!

**హర్యానాలో** మరొకసారి ఫాసిస్టు తరహా మతోన్మాద విచ్చిన్న రూపాలు బయటపడ్డాయి. హిందూమతోన్మాదాన్ని విస్తరింపజేస్తున్న సంఘ పరివార్ శక్తుల నిర్వహణలోని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్‌ల ఆధ్వర్యంలో జులై 31వ తేదీన హర్యానా రాష్ట్రంలోని నూహ్ పట్టణంలో మతకలహాలను పథకం ప్రకారం వ్యాప్తి చేశారు. 16 వేల పైన జనాభా ఉన్న నూహ్ పట్టణం నుండి హర్యానా రాష్ట్రంలోని కొన్ని ఇతర పట్టణాలకు, ముఖ్యంగా దేశ రాజధాని న్యూఢిల్లీకి దగ్గరగా ఉండే, ఇటీవలి కాలంలో పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న గురుగావ్ పట్టణానికి మతోన్మాద దాడులు విస్తరించాయి.

ఆరోజు (తెల్లవారితే ఆగస్టు1) అర్ధరాత్రి గురుగావ్ నగరంలోని సెక్టార్ 57లో ఉన్న అంజుమన్ జామా మసీదుపై మతోన్మాదులు దాడి జరిపి ఆ మసీదుకు చెందిన మొహమ్మద్ సాద్ అనే 26 ఏళ్ల యువ ఇమామ్‌ను అతని అనుచరుడుని హత్య గావించారు. అప్పటికే నూహ్ పట్టణంలో జరిగిన కలహాలలో ఇద్దరు పోలీసులతో పాటు, మొత్తం ఏడుగురు మరణించారు. ఉద్రిక్త పూరిత వాతావరణం నెలకొని ఉన్నప్పటికీ దాడులు, ప్రతి దాడులు జరిగే అవకాశం ఉందని స్పష్టంగా తెలిసి నప్పటికీ హర్యానా రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన పోలీసు రక్షణ ఏర్పాట్లు చేయకుండా ఉదాసీనంగా వ్యవహరించింది. ఫాశిస్టు మతోన్మాదుల విధ్వంసకాండలో సాధారణ ముస్లిం ప్రజలు కోల్పోయిన ఆస్తుల విలువ కోట్లాది రూపాయల్లో ఉంటుంది. ఉన్మాదుల విధ్వంసకాండ అలా ఉండగా హర్యానా రాష్ట్రాన్ని ఏలే భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం మత కలహాలలో పాల్గొన్నవారు,అందుకు సహకరించిన వారు అనే పేరుతో, అలాంటి వారి అక్రమ కట్టడాలు అనే సాకుతో, అమలులో ఉన్న చట్టాలను కూడా లెక్కపెట్టకుండా, బుల్డోజర్లతో ముస్లింల గృహ విధ్వంసకాండ సాగించింది. డబల్ ఇంజన్ బుల్డోజర్ విధానాన్ని అనుసరించింది. హర్యానా రాష్ట్ర హైకోర్టు స్వయంగా జోక్యం చేసుకొని కట్టడాల కూల్చివేత విధానాన్ని ఆపు చేయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించేదాకా, అక్రమ కట్టడాల పేరుతో మూడు రోజుల పాటు ప్రభుత్వ విధ్వంసకాండ సాగింది. ప్రజల్ని కాపాడవలసిన రాజ్యమే అన్య మత నిర్మూలన సాగించడం పట్ల హర్యానా రాష్ట్ర హైకోర్టు తన తీవ్ర అభిశంసనను ప్రకటించింది.

## హర్యానాలో హిందూ మతోన్మాద విచ్ఛిన్న కార్యకలాపాల నేపథ్యం

గడచిన 35 ఏళ్లుగా సంఘపరివార శక్తులు ఉద్దేశపూర్వకంగా మత విద్వేష కేంద్రంగా రాజకీయ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ప్రత్యేకంగా నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన పిదప మతోన్మాద వ్యాప్తి హద్దుల్లేని విధంగా సాగుతున్నదనేది జగమెరిగిన సత్యం.

ఎన్నికల ముందు మతకలహాలను వ్యాప్తి చేయటం అనే విధానం నుండి ఆ వాతావరణం ఫలితంగా పొందిన రాజకీయ అధికారాన్ని నిలబెట్టుకోవటానికీ, ప్రజలను అనునిత్యం పక్కదారి పట్టించడానికి మత విద్వేషపూరిత విచ్ఛిన్నకర సామాజిక వాతావరణాన్ని సృష్టించడం వారి రోజువారీ కార్యక్రమం అయిపోయింది. ఇదే పనిలో అటు ప్రభుత్వము, ఇటు సంఘపరివారీయ శక్తులు అలుపెరుగకుండా సమన్వయంతో కృషి చేస్తున్నాయి.

హర్యానా రాష్ట్రంలోని మేవాటి జిల్లా కేంద్రంగా నూహ్ పట్టణం ఉన్నది. (2016లో దాన్ని నూహ్ జిల్లాగా మార్చారు.) మొత్తం రాష్ట్రంలో ఏడు శాతం మాత్రమే ముస్లిం జనాభా ఉన్న హర్యానాలో, 21 జిల్లాలలో ఈ ఒక్క జిల్లాలోనే దాదాపుగా 80% దాకా మేవాటీ ముస్లింలు ఉన్నారు. హిందూ రాజపుత్రులతో బలీయ సాంస్కృతిక సంబంధాలు కల ఒక ప్రత్యేకమైన తెగగా సుమారు 700 సంIIలుగా మేవాటీలు కొనసాగుతున్నారు.

16వ శతాబ్దంలో రాజపుత్ర ప్రభువు అయిన రాణా సంగ , మొగల్ రాజవంశ పాలన నెలకొల్పిన బాబర్‌తో యుద్ధం చేసినప్పుడు, మేవాటీలు రాణా సంగ పక్షాన నిలిచారు. హిందూ పండుగలను జరుపుకోవడం కూడా వారికి సాంస్కృతిక వారసత్వంగా ఇటీవల దాకా కొనసాగింది. వారికి ప్రత్యేకమైన మేవాటి భాష ఉండినప్పటికీ ఎక్కువమంది దానిని దేవనాగరి (హిందీ) లిపిలోనే రాస్తారు.

పాకిస్తాన్ దేశ సరిహద్దులకు సుమారుగా దగ్గర ప్రాంతమైనప్పటికీ మేవాటీలు కొందరు దేశభజన కాలంలో సంభవించిన మతకలహాల నుండి తాత్కాలిక రక్షణకోసం పాకిస్తాన్ వెళ్లినప్పటికీ, కొద్ది కాలంలోనే తిరిగి భారతదేశం వచ్చేశారు. ముస్లిం సాంప్రదాయవాదులు మేవాటీలను పూర్తి స్థాయి ముస్లింలుగా పరిగణించకపోవడం నేటికీ ఉంది. ఇంత చారిత్రక సాంస్కృతిక నేపథ్యం ఉన్నందుచేతనే అక్కడ మతకలహాలకు ఆస్కారం తక్కువ. ఇటీవల కాలం వరకు మతసామరస్యానికి పెట్టింది పేరుగా మేవాటి ప్రాంతం ఉన్నది.

అయితే మతసామరస్యం పొడగిట్టని సంఘ పరివార శక్తులు, హిందువులు ముస్లింల నడుమ విద్వేష కలహాలను రెచ్చగొట్టడానికి బహు విధాలుగా గత కొన్ని సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే గురుగావ్ నగరంలో సెక్టార్ 57లో ఉన్న మసీదును అక్కడ నుండి తొలగించాలనే ప్రయత్నం గడచిన 19 ఏళ్లకు పైగా సాగుతోంది. అందుకు కోర్టు కేసులు నడిపించారు. అయినప్పటికీ సుప్రీంకోర్టు కూడా మసీదును ప్రస్తుతమున్న ప్రాంతం నుండి తొలగించడానికి 2021లో నిరాకరించింది.

మేవాటీలది రైతు నేపథ్యం కలిగిన తెగ. వారిలో నేటికీ కొనసాగుతున్న వృత్తులలో వ్యవసాయం, పశుపోషణ ముఖ్యమైనవి. పశు వుల అమ్మకాలు కొనుగోలు కూడా తరతరాలుగా కొనసాగుతున్న వారి జీవనంలో భాగం.

ఇటీవల సంవత్సరాలలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్‌లు, గోరక్షణ పేరిట పశు వుల వ్యాపారంచేసే ముస్లింలను వేధించడం ఎక్కువైపోయింది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో నాసిర్, జునైద్ అనే ఇద్దరు మేవాటి ముస్లిం యువకుల శవాలు కాల్చి వేయబడి హరియానాలోని భివాని అనే ప్రాంతంలో బయటపడ్డాయి. రాజస్థాన్‌కు చెందిన మను మానేసర్ నాయకత్వాన వారిని కొట్టి చంపేశారని ఆరోపణ ఉంది. నాటినుండి మను మానేసర్ అనే విశ్వహిందూ పరిషత్ నాయకుడు పై హత్యలో అరెస్టు వారంటును తప్పించుకుంటూ రాజస్థాన్ పోలీసుల కళ్ళుగప్పి సంచరిస్తున్నాడు.

గత జులై 31వ తేదీన "బ్రిజ్ మండల్ జలాభిషేక యాత్ర"లో తాను పాల్గొనబోతున్నా నంటూ రెచ్చగొట్టే మతోన్మాద విద్వేషపూరిత వీడియోలను మను మానేసర్ కొద్దిరోజుల

**(తరువాయి 11వ పేజీలో)**

పుస్తక పరిచయం

వీరాజి

# మారుతి సుజికీ సమ్మె: 'జపాన్ యాజమాన్యం-భారత్ ప్రతిఘటన' అంజలీ దేశ్‌పాండే, నందితా హక్సర్‌ల రచన

**2012** సం॥నాటి మారుతి సుజికీ కార్మికులు తమ చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలపై యాజమాన్య అణచివేతను ప్రతిఘటించిన హింసాత్మక సంఘటనలు జరిగిన దశాబ్దం తర్వాత ఆ సంఘటన తాలూకు వివరాలు, తదనంతరం కార్మికులు ఎదుర్కొన్న పరిస్థితులను అంజలీ దేశ్‌పాండే(జర్నలిస్టు, యాక్టివిస్టు), నందితాహక్సర్(మానవహక్కుల న్యాయవాది, టీచర్, ప్రచారకర్త)లు 'జపనీస్ మేనేజ్‌మెంట్ అండ్ ఇండియన్ రెసిస్టెన్స్' అనే పుస్తకం ద్వారా అందించారు. పౌరుల హక్కులను కాలరాచి, లాభాలు ముంచెత్తే ఒక దేశంగా నూతన భారతదేశం తలెత్తుతూ, కార్పొరేటు రాజ్యంగా పరిణామం చెందుతుండటాన్ని గురించిన సంక్షిప్త వివరణను ఈ పుస్తకం అందించింది. బలహీనులకు, తక్కువ శక్తివంతులైన విభాగపు ప్రజలకు విరుద్ధంగా, అకాడమీ సంస్థల తరహాలో ఈ పుస్తకాన్ని రచించలేదని ఈ పుస్తక రచయితలు సరిగ్గానే ప్రకటించారు. అయితే సత్యం, నిర్ధారించగల వాస్తవాలు, న్యాయంతో మారుతి సుజికీ ఫ్యాక్టరీ కార్మికుల దృక్పథంతో ఈ పుస్తకం రాశామని ప్రకటించారు.

1982 అక్టోబర్‌లో సుజుకీ మోటార్ కార్పొరేషన్ కంపెనీకి, భారత ప్రభుత్వానికి నడుమ సంయుక్త వ్యాపారానికి లైసెన్సు పొంది సుజుకీ కంపెనీ, భారతదేశంలోకి ఏవిధంగా చొరబడిందనేది మాత్రమేగాక, క్రమంగా 2003 సం॥నాటికి బాగా లాభాలార్జించి, మారుతి ఉద్యోగ్ లిమిటెడ్‌గా 2007 నాటికి, మారుతి సుజికి ఇండియా లిమిటెడ్‌గా తదనంతరం రూపొందటమేగాక సుజుకీ ఏవిధంగా కార్పొరేట్ సంస్కృతిని, ప్రత్యేకించి జపాన్ దేశ పని సంస్కృతి 'కరోషి'ని కార్మికులపై రుద్దిందో రచయితలు ఈ పుస్తకంలో విలువైన సమాచార మందించారు. భారతదేశ పరిశ్రమలలో కార్మికులపై పనిభారం ద్వారా మరణాలు సంభవించే; అదే సమయంలో కార్మికుల చట్టబద్ధహక్కులు, సౌకర్యాలను దృఢంగా నిరాకరించే విధానాలను అనుసరించారు. కార్మికులను యంత్రాలుగా లేదా యంత్ర భాగాలుగా ఏవిధంగా దిగ జార్చారో, స్వయం చలిత కూర్పు మార్గంలో నిలకడగా వేగాన్ని పెంచుతూ, అమానవీయంగా ఉత్పాదకతను పెంచుతూ, హేతుబద్ధమైన విశ్రాంతి సమయాన్ని కూడా కార్మికులకు ఇవ్వటానికి నిరాకరించడం వంటి వాటిని ఈ పుస్తక రచయితలు స్పష్టంగా చిత్రీకరించారు.

అత్యల్ప కారణాల సాకుతో సుజుకీ యాజమాన్యం కార్మికుల పనులకు సమయాలను నిర్దేశించటాన్ని,వారి చట్టబద్ధమైన ఆదాయాలను, కఠోరశ్రమ ద్వారా వారు సంపాదించిన ఆదాయాలను కూడా దిగమింగటాన్ని వారు ఈ పుస్తకంలో వివరించారు. సుజుకీ యాజమాన్యం కార్మికుల శ్రమశక్తిని అన్ని రూపాల్లో దోపిడీ చేయటం, ఉద్దేశ్యపూరితంగా దేశంలోని చట్టాలను గుర్తించకపోవటం, తేలికగా చూడటం, బాహాటంగా వాటిని ఉల్లంఘించటాలను వారు ఈ పుస్తకంలో స్పష్టంగా చూపించారు. పాలకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ, పోలీసు పాలనాయంత్రాంగం-వ్యవస్థ మొత్తంగా-జపాన్ విదేశీ పెట్టుబడితో లాలూచీపడి, బడాపెట్టుబడికి దాసోహమై వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు దేశ పౌరులను, కార్మికులను సైతం దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా పణంగా పెడు తుండటాన్ని వారు ఈ పుస్తకంలో వెల్లడి చేశారు. బిజెపి, కాంగ్రెస్-రెండు పాలకవర్గ రాజకీయ పార్టీల పాలనలోనూ ప్రభుత్వాల, పాలకుల కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక వర్గస్వభావాన్ని వారు ప్రభావశీలంగా చిత్రీకరించారు. సూపర్ లాభాలార్జించాలనే తన లక్ష్యాన్ని సాధించు కునేందుకు భారతదేశంలో కార్మికుల జీవితాలను విధ్వంసం చేస్తూ విదేశీ పెట్టుబడి సర్వనాశనం చేసే విధంగా ఎలా వ్యవహరించిందో వారు సంక్షిప్తంగా వివరించారు.

మరోవైపున, 2012 నాటి సంఘటన తదనంతర పరిణామాలకు సంబంధించి మారుతీ సుజికీ కార్మికుల, వారి నాయకుల, కొందరు కేంద్ర ట్రేడ్ యూనియన్ నాయకుల ప్రకటనలను పాఠకులముందుంచటం ద్వారా దీనితో ముడిపడిన కార్మిక సమస్య లోతును అర్థం చేసుకోవటానికి, 'ప్రపంచీకరణ' ఇండియాలో కార్మికోద్యమంపై ఎంతో బాధ్యత వుందని, తెలియజేస్తూ వీటిని ఈ పుస్తక రచయితలు పేర్కొన్నారు.

రచయితలు కార్మికుల వాంగ్మూలాలను నమోదు చేసే సందర్భంలో వారు భారత కార్మికోద్యమ ప్రస్తుత పరిస్థితి గురించి, మొరటైన అదుపులేని దోపిడీ నుండి కార్మికుల ప్రయోజనాలను నీతి, నిజాయితీలతో పరిరక్షించే ఒక నిజమైన యూనియన్‌లోకి సంఘటితంచేసే ప్రశ్న గురించి ఉపయుక్తమైన ప్రశ్నలను లేవ నెత్తారు. కార్మికోద్యమాల వివిధ దృష్టికోణాలనే గాక, యాజమాన్యాలతో తమ పని సంబంధిత వివాదాల సందర్భంగా పాలకులు, ప్రభుత్వాలు కార్మికులతో వ్యవహరించే స్వభావం గురించి కూడా 'మారుతీ' కార్మికులు తమ వాంగ్మూలాలలో పేర్కొన్నారు.

మనదేశ పాలకుల రహస్య సమ్మతితో విదేశీ పెట్టుబడి అమానవీయ దోపిడీతో కూడిన తన క్రూరమైన కార్యకలాపాలకు మద్దతుగా మోసపూరితంగా గ్రామీణ ప్రాంతాలలో సామాజిక పునాదిని ఏవిధంగా స్థాపించుకో గలిగిందో ఈ పుస్తకంలో రచయితలు చూపించారు. మారుతి సుజికి మానేసర్ ప్లాంట్ వద్ద 2012 జులై 18న జరిగిన సంఘటనలకు ప్రతి చర్యగా, 200 గ్రామాలకు చెందిన ప్రజానీకం ఒక 'మహా పంచాయిత్'ను నిర్వహించి మారుతీ సుజికీ కార్మిక యూనియన్‌ను ఏకగ్రీవంగా విమర్శించటంతోపాటు, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ మరణానికి దోవతీసిన హింసను ఖండించటమేగాక, కార్మిక సంఘాల న్నింటినీ రద్దుచేయాలని పిలుపునిచ్చారు.

కార్మికులకు మద్దతుగా నిలవాల్సిన సమీప గ్రామాల ప్రజానీకం, ఏవిధంగా యాజమాన్యం వైపు మళ్ళారో ఇది మనకు తెలియజేస్తోంది. ప్లాంట్ మూతపడితే, తమకు వచ్చే ఆదాయాన్ని కోల్పోవలసి వస్తుందేమోనని గ్రామస్థులు భయపడటమే దీనికి కారణం. కార్మికులకు గదులను అద్దెకు ఇవ్వటం ద్వారా, అలాగే రోజువారీ అవసరాలను కార్మికులు షాపులనుండి కొనుగోలు చేయటంద్వారా వారు ఆదాయం పొందుతున్నారు. దీనికంటే గూడా, సుజుకీ కంపెనీ స్థానిక గ్రామస్థులను, గూండాలను - కార్మికులను క్రమశిక్షణలో నుంచటానికి ప్రోత్సహించి వారికి 'బౌన్సర్లు'గా ఉద్యోగం కల్పించింది. కార్మికులు-ఇతర రాష్ట్రాల నుండి

వలసవచ్చిన వారు, స్థానికేతరులుగా వున్నారు. 2012 జులై 18న, సుజుకీ యాజమాన్యంతో కార్మికుల సమస్యలపై యూనియన్ నాయకులు చర్చలు జరుపుతూ వుండటంతోపాటు, సంగ్రామ్ మాహోర్ఖి అనే సూపర్‌వైజర్, ఓ దళిత కార్మికుడైన జియాలాల్‌తో వివాదం పెట్టుకోవటం, కులతత్వ దూషణలకు పాల్పడి కార్మికుడిని అవమానించటం; కాగా యాజమాన్యం కులతత్వ దూషణలకు పాల్పడిన సూపర్‌వైజర్‌ను కాకుండా కార్మికుడిని సస్పెండ్ చేయటం; అనే నిర్దిష్ట సంఘటనపై చర్చిస్తూ వుండగా 100–150 మంది బౌన్సర్లు, ఫ్యాక్టరీ కార్మికుల యూనిఫాం ధరించి వచ్చి, పదునైన ఆయుధాలతో విధులలోనున్న కార్మికులపై అనాగరికంగా దాడి చేయటమేగాక, ఫ్యాక్టరీలోని ఓ భాగాన్ని ధ్వంసంచేసి నిప్పుపెట్టటం జరిగింది. మంటలకారణంగా వ్యాపించిన పొగతో, శ్వాస తీసుకోలేక ఓ హెచ్‌ఆర్ మేనేజర్ ఊపిరి సరిగా అందక మరణించాడు. బౌన్సర్లు ఫ్యాక్టరీలోకి ప్రవేశించి, విధ్వంసానికి పాల్పడటాన్ని అనేకమంది విలేఖరులు పత్రికలలో వార్తలుగా నమోదు చేశారు. అయితే, సుజుకీ యాజమాన్యం, అధికారంలోనున్న పాలకులు, మానేసర్ ప్లాంట్‌లో విధ్వంసం, హింసలకు కార్మికులే కారణమంటూ వారిపై తప్పుడు ఆరోపణలతో వారిని క్రిమినల్ కేసులలో ఇరికించారు. కాగా, ఈ కేసులు సెషన్స్ కోర్టులో విచారణలు జరిగి అంతిమంగా హత్యానేరంపై యూనియన్ నాయకత్వంతోపాటు మరో కార్మికునితో సహా 13 మంది కార్మికులకు యావజ్జీవ శిక్షలు; తక్కువ నేరాలకు పాల్పడిన 33 మంది కార్మికులకు వివిధ శిక్షలు విధించారు. సుజుకీ యాజమాన్యం 546 మంది స్థిర కార్మికులతో సహా 2500 మంది కార్మికులను పనులనుండి తొలగించింది.

వాస్తవాలు, నిజాలు ఇలా వుండగా, యాజమాన్యం, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, సమాజం–కార్మికులను నేరస్థులను చేశాయి. ప్లాంటులో కార్మికులు యూనియన్‌లో సంఘటిత పడటమేగాక వారు నివసించే ప్రాంత ప్రజలతో, సమాజంతో కూడా కలగలిసి తీరాలని, యాజమాన్య అమానవీయ దోపిడీ గురించిన కుటిల పద్ధతులను, కార్మికులపట్ల అనుసరించే అనాగరిక వైఖరిని నిరంతరాయంగా ప్రజానీకానికి తెలియపరుస్తూ వుండాలనే ఒక ముఖ్యమైన గుణపాఠాన్ని కూడా ఈ సంఘటన నుండి నేర్చుకోవలసి వుంటుంది. కార్మికులు గ్రామస్థులను తమ మిత్రులుగా మలచుకోవాలి. వారు కూడా గ్రామాల్లో వివిధ రూపాల్లో ఫ్యూడల్ అణచివేతతో బాధలనుభవిస్తూ వున్నవారే. కార్మికవర్గానికి మిత్రవర్గంగా స్థానిక గ్రామస్థులతో కూడటానికి విదేశీ పెట్టుబడితో నడిచే పెద్ద ఫ్యాక్టరీలో పనిచేస్తున్నామనే తప్పుడు ప్రతిష్ట నడుమ అడ్డుగా రాకూడదు. కార్మికులు గ్రామస్థులతో స్నేహ పూర్వకంగా వుంటూ, గ్రామ సమాజంలో ఒక భాగంగా వ్యవహరించాలి.

ఈ మొత్తం ఘటన సంభవించటానికి ఎవరి ప్రవర్తన కారణమో, ఆ సూపర్‌వైజర్ 'మహాజి' యొక్క వాంగ్మూలం లేకుండానే తీర్పును ప్రకటించటం జరిగిందంటే విద్యావంతమైన న్యాయవ్యవస్థగా చెప్పబడేది కూడా ఎంతటి నిర్దయగా వుంటుందో అర్థమౌతుంది. సుజికీ యాజమాన్యానికి అనుకూలంగా సంఘటన జరిగిన మర్నాటి నుండీ కూడా ఆ సూపర్‌వైజర్ విచిత్రంగా అదృశ్యమయ్యాడు. పైగా, మనేసర్ ప్లాంట్‌లో ఎల్లవేళలా పనిచేస్తూ వుండే, ప్రతి ఒక్క పనినీ పరిశీలనగా తనిఖీచేసే, ప్రత్యేకించి ప్రతి కార్మికుడిని, అతని పనితీరును, కదలికలను నిశితంగా పర్యవేక్షించే సిసిటివి కెమారాలలో నమోదైన వాటిని సాక్ష్యాలుగా తీసుకోకుండానే, వాటిని పరీక్షించకుండానే "గౌరవనీయ న్యాయస్థానాలు" తీర్పులను ప్రకటించాయి. 2012 ఆగస్టు 18న ఆ 'దుర్దినాన' 13 గంటలపాటు సిసిటివి కెమారాలు పనిచేయటం ఆగిపోయిందని కోర్టుకు తెలిపినపుడు, ఆవిధమైన తప్పుడు నివేదనలను తెలివిగల న్యాయస్థానాలు విచక్షణారహితంగా స్వీకరించి, హింసకు, 'హత్య'కు కార్మికులే నేరస్థులని తీర్పు చెప్పగలిగాయి.

సుజుకీ యాజమాన్యంతో మారుతీ కార్మికులు ఘర్షణపడుతున్న ఈ సందర్భంలో, కార్మికుల 'హింస' గురించి పదేపదే ప్రశ్నించటం, నిరంతరాయంగా పత్రికల్లో పేర్కొనటం జరుగుతూ, అదే సమయంలో యాజమాన్యం, ప్రభుత్వాలు, పాలకులు, న్యాయవ్యవస్థ నేరంలో భాగస్తులైన సాంప్రదాయ కేంద్ర ట్రేడ్ యూనియన్ల వైఖరులతో కార్మికులు నిస్సహాయతకు, నిస్పృహకు నెట్టబడ్డారనే అంశాన్ని విస్మరిస్తున్నారు. యాజమాన్యంతోను, తమపై మోపిన అంతులేని అమానవీయ దోపిడీ పరిస్థితులతోను హింసాత్మకంగా తలపడటం మినహా కార్మికులకు మరో ప్రత్యామ్నాయమేదీ మిగల్చలేదు.

యాజమాన్యంతో కార్మికులు హింసాత్మకంగా తలపడటం ఇదే మొదటిసారి కాదు. దీనికి ముందు కూడా ఈ తరహా హింసాత్మకంగా తలపడటాలు జరిగాయి.

2015లో గురుగావ్‌లోని 'ఓరియంట్ ఫాన్స్' ఫ్యాక్టరీలో విద్యుత్ షాక్‌తో ఒక కార్మికుడు తీవ్రంగా గాయపడటంతో పనిచేసే కార్మికులంతా ఆగ్రహించి, పరిశ్రమలోని అనేక కార్లను తగులబెట్టారు.

కర్నాటక రాష్ట్రంలో ఇటీవలే, ఆపిల్‌ఫోన్‌కు సరఫరాదారు అయిన విస్ట్రాన్ కంపెనీ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు అంగీకృత వేతనాల చెల్లింపు వివాదంపై యాజమాన్యంతో హింసాత్మకంగా తలపడ్డారు.

తమ పనిపరిస్థితులను మెరుగుజేసే, ఉపశమింపచేసే ఏ అవకాశం లేకపోవటం వలననే, ఈలాంటి హింసాత్మకంగా తలపడే ఘటనలకు కార్మికులు పాల్పడాల్సి వస్తోంది. సామ్రాజ్యవాద కార్పొరేట్‌శక్తుల ప్రయోజనం కోసం విదేశీ పెట్టుబడికి దాసోహం చేస్తున్న 'గ్లోబలీకరణ ఇండియా'లో వరుసగా అధికారంలోకి వస్తున్న పాలకులు కార్మికుల హక్కులను గుంజివేస్తూ, కార్మికులకు స్వేచ్ఛ లేకుండా చేస్తూన్న ప్రస్తుత పరిస్థితులలో వారుగా కొనసాగే అవకాశాన్ని పాలకులు మసక బారుస్తున్నారు.

ఈనాడు సుజికీ–కాంట్రాక్టు కార్మికులను, కంపెనీ ట్రెయినీలను, సహాయకులను, తాత్కాలిక కార్మికులను, క్యాజువల్ కార్మికులను, నిర్దిష్ట కాల కార్మికులను–ఎలాంటి నియమ నిబంధనలు, ఎలాంటి ఆంక్షలు, చట్టభీతిలేకుండా శ్రామికశక్తిని దోపిడీ చేస్తూ సూపర్‌లాభాలు గడిస్తుండగా, కార్మికులు చెప్పనలవికాని దుర్మార్గమైన జీవన, పనిపరిస్థితుల నడుమ కుంగిపోతున్నారు.

కార్మికుల ఆవేదనను, డిమాండ్లను ఉపశమింపజేయడానికి సుజుకీ యాజమాన్యం మొండిగా నిరాకరిస్తూ బ్రహ్మకుమారి, రాధా సోయాని పంటా వంటి ఆధ్యాత్మిక గురువులను రంగంలోకి దించి వారి ద్వారా విడతలుగా కార్మికులతో సమావేశాలు నిర్వహిస్తూ, అందులో కార్మికులు వారి సమస్యలపై మాట్లాడవచ్చని చెబుతున్నారు. బ్రహ్మకుమారీలు స్వచ్ఛందంగా విదేశీ బడాపెట్టుబడికి సేవజేసే ఉత్సుకతతో ఆమోదం తెలిపి '(కార్మికుల) ఆధ్యాత్మిక సంక్షేమం', 'భావోద్వేగాలను (కార్మికులు) తగిన విధంగా నిలిపివుంచటం'లపై విడతలవారీగా సమావేశాలను నిర్వహిస్తున్నారు. సుజుకీ యాజమాన్యం తన కార్మికులకు ఆధ్యాత్మిక నల్లమందుతో విషమెక్కిస్తోంది. మరోవైపున బ్రహ్మకుమారీలు, ఇతర 'ఆధ్యాత్మిక గురువులు', తమ వర్గ స్వభావాన్ని వ్యక్తంచేస్తూ వత్తిడిలోనున్న నిస్సహాయులైన కార్మికులకు సహకరించటంకంటే తాము దోపిడీవర్గాల పక్షానే వుంటామని ప్రకటించారు. **(తరువాయి 9వ పేజీలో)**

# వ్యవసాయరంగంలో చొచ్చుకువస్తున్న సామ్రాజ్యవాద దిగ్గజ కార్పొరేషన్లు

**గత** నాలుగు దశాబ్దాల కాలంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల కారణంగా భారత వ్యవసాయరంగం ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో వుంది. చిన్న, సన్నకారు రైతాంగం నికృష్ట దారిద్ర్యంలోకి, దుస్థితిలోకి నెట్టబడ్డారు. మాన్‌శాంట్ వంటి సామ్రాజ్యవాద దిగ్గజ విత్తన కార్పొరేషన్లు వేలాది పత్తి రైతుల ఆత్మహత్యలకు కారణమయ్యాయి. లాభాలు, రాయల్టీలు, సాంకేతిక సహాయం చేసినందుకు ఫీజులు మొదలైన రూపాల్లో భారత వ్యవసాయ రంగంలో సృష్టించబడిన మిగులునంతటినీ తమ దేశాలకు తరలించుకువెళ్ళిన తర్వాత ఇప్పటికీ ఈ సామ్రాజ్యవాద దిగ్గజ కార్పొరేషన్లు సంతృప్తిగా లేవు. వారు మన వ్యవసాయ రంగంలోకి వివిధ పద్ధతుల్లో జొరబడేందుకు నిరంతరాయంగా పథకాలు వేస్తున్నారు.

అలాంటి సామ్రాజ్యవాద దిగ్గజ కార్పొరేషన్లలో అంతర్జాతీయ సామ్రాజ్యవాద వ్యవసాయరంగ దిగ్గజ పరిశ్రమ వాల్‌మార్ట్ ఒకటి. ఇది ఇప్పటికే మనదేశ వ్యవసాయ రంగంలో చొచ్చుకొచ్చింది. వాల్‌మార్ట్ ఫౌండేషన్ అనే తన దాతృత్వ సంస్థ నుండి నిధులు పొందుతున్న లాభాపేక్షరహిత సంస్థలుగా చెప్పబడే వాని ద్వారా అది ్రవేశించింది. దీనికి ప్రతిగా ఈ 'లాభాపేక్షరహిత సంస్థలు' రైతు–ఉత్పత్తిదారుని సంఘాలను (ఎఫ్‌పిఓ)ఏర్పరచి, 1.1. హెక్టార్లకన్నా తక్కువ భూమి కలిగివున్న సన్న, చిన్నకారు రైతుల సమష్టిశక్తిని రూపొందించటం ద్వారా రైతాంగం విజయం సాధించేందుకు తాము సహకరిస్తామని మోసగిస్తున్నాయి.

మార్కెట్ యార్డులకు అనుసంధానం చేసే మౌలిక వసతుల నిర్మాణానికి రైతులకు సాంకేతిక సహాయన్నందిస్తామని, తద్వారా చిన్నకమతపు రైతు తన ఆదాయాన్ని పెంచుకోవచ్చునని, తమ జీవనాధారాలను మెరుగు చేసుకోవచ్చుననీ, ఆవిధంగా మధ్యదళారీల నుండి తప్పించుకోగలుగుతారని కూడా వారు ప్రకటిస్తున్నారు.

ఈవిధమైన మోసకారీ వాగ్దానాలతో, మార్కెట్ యార్డులకు అనుసంధానం కావటానికి సాంకేతిక మద్దతు, మౌలిక వసతుల కొరత కారణంగా దుస్థితినెదుర్కొంటున్న సన్న, చిన్నకారు రైతులను వశీకరించుకుని, మన దేశ వ్యవసాయరంగంలోకి వాల్‌మార్ట్ చొచ్చుకువస్తోంది. వాల్‌మార్ట్ దాతృత్వ సంస్థ ఉపాధ్యక్షుడు కేంద్రప్రభుత్వ విధానాలకు తమ కంపెనీ అభినందనలు తెలుపుతోందన్నాడు.

గతంలో మధ్యఅమెరికా, మెక్సికోలలో ప్రయోగాలు నిర్వహించిన వాల్‌మార్ట్, 8 లక్షలమంది రైతులతో 500 ఎఫ్.పి.ఓ.లను ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణా, కర్నాటక, ఒడిషా, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో (9 రాష్ట్రాల పరిధిలో) ఈ నెట్‌వర్క్ చట్రాన్ని ఏర్పరచటానికి ముందుకు సాగుతోంది. వివిధ పేర్లతో కొనసాగుతున్న లాభాపేక్షరహిత సంస్థలుగా చెప్పబడేవి–ఇప్పటికే కాఫీ, జీడిపప్పు, మింట్, మామిడి, కూరగాయలు, గోధుమ, చిరు ధాన్యాలను పండించే సన్న, చిన్నకారు రైతుల మధ్య పనిచేస్తున్నాయి.

వాల్‌మార్ట్ సంస్థ, 2020లో పదివేల ఎఫ్‌పిఓల ఏర్పాటుకు, మరో పదివేల నూతన ఎఫ్‌పిఓలను 2027–28 నాటికి ఏర్పరచే పథకాన్ని ప్రారంభించింది. ఆవిధంగా వాల్‌మార్ట్ రైతులతో అనుసంధానమైన నెట్‌వర్క్‌ను ఏర్పరచుకొని, దానిని పెంచుకుంటోంది.

టెక్నోసర్వ్, డిజిటల్ గ్రీన్, ప్రధాన్ వంటి 'లాభాపేక్ష రహిత సంస్థలు' 6 సం॥ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించాయి. అరకులోయలోని కాఫీ రైతులు, జీడిరైతులు, మహిళా రైతులు, మిరపరైతులు, ఆంధ్ర–తెలంగాణాలలోని జీడి, పసుపు రైతులతో ఈ సంస్థలు సంబంధాలు ఏర్పరచుకుంటూ దగ్గరయ్యాయి.

తమ జోక్యం కారణంగా జీడిపప్పు ధర 13 శాతం పెరిగిందని, రైతుల ఆదాయం 500 శాతం పైగా పెరిగిందని ఈ 'లాభాపేక్షరహిత' సంస్థలు ప్రకటించుకుంటున్నాయి. బ్లూ టోకాయ్, స్టార్‌బక్స్ వంటి భారీ వ్యవస్థాగత కొనుగోలుదార్లను అనేకమందిని తాము రంగంలోకి తీసుకుని వచ్చి అరుకులోయలోని కాఫీ గింజలు కొనుగోలు చేయించామని వారు ప్రత్యేకించి పేర్కొంటున్నారు. ఎఫ్‌పిఓల ద్వారా మెరుగైన పంట ఉత్పత్తులు, ఆదాయాలతో రైతులు లబ్ధిపొందారని వారు చెబుతున్నారు. రిలయెన్స్ స్టోర్‌వంటివి కొనుగోలుకు ముందుకు రావటంతో ఉత్పత్తి జరిగిన దానిలో అధికభాగం దేశీయంగా అమ్మకం జరుగుతోందని వారు ప్రకటిస్తున్నారు.

ఏమైనా, 'లాభాపేక్షరహిత' మధ్యవర్తుల ద్వారా కాఫీ, జీడి, పసుపు, మిర్చి పంటలను భారీ వ్యవస్థాగత కొనుగోలుదార్లకు విక్రయించి, సన్న, చిన్నకారు రైతులకు వాల్‌మార్ట్ ఎంత వరకు లబ్ధిచేకూర్చగలిగిందో తెలయరావటం లేదు.

అయితే, భారత వ్యవసాయరంగంలోకి ప్రవేశంతో వాల్‌మార్ట్ ఎంతో లబ్ధిపొందుతుందనేది వాస్తవం. లాభాలనాశించకుండా 3 కోట్ల 90 లక్షల డాలర్లను భారతదేశంలో వెచ్చించి ఎఫ్‌పిఓలను ఏర్పరిచే పనికి అది ఎన్నడూ పూనుకోదు.

ఈ తరహాలో రైతులతో ఎఫ్‌పిఓలను ఏర్పరచటం సాంప్రదాయ 'మండి' వ్యవస్థను నాశనంచేసి, ఉనికిలోవున్న సహకార సొసైటీలను బలహీనపరిచి, తద్వారా మొత్తం వ్యవసాయ మార్కెట్‌నంతటినీ ఈ సామ్రాజ్యవాద దిగ్గజ కార్పొరేషన్లు ఆక్రమిస్తూ సన్న, చిన్నకారు రైతులకు కీడును తలపెట్టవచ్చు. మనదేశంలోని వివిధ రాష్ట్రాలలో పొగాకు రైతుల విషయంలో తరచుగా మనం చూస్తున్న విధంగానే మార్కెట్లపై గుత్తాధిపత్యం కారణంగా సమీప భవిష్యత్తులో ఈ రైతులంతా దివాళాతీసి, వారి చిన్నపాటి భూకమతాలను కూడా అమ్మివేసుకునే పరిస్థితి వస్తుంది.

ఎఫ్‌పిఓల ద్వారా రైతులు వాస్తవంగా లబ్ధి పొందారో లేదో తెలియదు. అయితే వినియోగదారులకు మాత్రం కాఫీ, జీడి, పసుపు, మిర్చి ధరలు అసాధారణంగా పెరగటం ఓ కఠిన వాస్తవం. బహుశా రైతులకు అతికొద్ది మొత్తపు ఆదాయపెంపు చూపి, వాల్‌మార్ట్ కొండ ప్రాంతాలను కొల్లగొడుతూ లాభాలను దండుకుంటోంది.

వాల్‌మార్ట్–మధ్యఅమెరికా, మెక్సికోలలో తన 'లాభాపేక్ష రహిత' సంస్థల ద్వారా ఏర్పరిచిన ఎఫ్‌పిఓలతో రైతులు పొందిన అనుభవాలు, పూర్తిగా బయటకు రావటంలేదు; వీటిని లోతుగా పరిశీలించాలి.

బహుశా, భారత వ్యవసాయరంగంలోకి వాల్‌మార్ట్ చొరబాటు, భారతదేశంలోకి నాడు ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశానికి మరో నగిషీ రూపమేమో!

అయితే ఓ విషయం స్పష్టం. వాల్‌మార్ట్ భారత వ్యవసాయ మార్కెట్‌లోకి ప్రవేశించటం లాభాపేక్ష దృష్టితోనే. బహుళజాతి దిగ్గజ కార్పొరేషన్ అయిన మాన్‌శాంటో మనదేశ రైతాంగ ప్రజాజీవితాలలో ఎంతటి ఉపద్రవం సృష్టించిందో మనం ఇప్పటికే చూశాం.

కనుక, భారత వ్యవసాయరంగంలోకి సామ్రాజ్యవాద దిగ్గజ కార్పొరేషన్ల ఈ తరహా చొరబాటును, ఈ చొరబాట్ల ఫలితంగా సంభవించే అనేక విపత్తులను వ్యతిరేకిస్తూ మనం అప్రమత్తంగా, మెలకువగా వుండాలి. ✡

# అమెరికా, చైనా, రష్యా

# తమ సరిహద్దులకు ఆవల అంతర్జాతీయ రహదార్ల ప్రారంభం

**ప్రపంచ** సార్వభౌమత్వానికి అమెరికా (జి-7), రష్యా, చైనా దేశాలు తమలో తాము పోటీపడుతూ లక్షల కోట్ల వ్యయంతో ప్రపంచ స్థాయి పథకాలను ప్రారంభిస్తున్నాయి. జి-7 దేశాల ఆధ్వర్యంలో 'ప్రపంచ మౌలిక సదుపాయాలు, మదుపులో భాగస్వామ్యం' (పిజిఐఐ) పథకానికి అమెరికా నాయకత్వం వహిస్తోంది. చైనా 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్' (బిఆర్ఐ) ప్రారంభించగా, రష్యా 'అంతర్జాతీయ ఉత్తర, దక్షిణ రవాణా కారిడార్'(ఐఎన్ఎస్‌టిసి)ని ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టులతో తమ హద్దుల నధిగమించి వారు కార్మికుల శ్రమశక్తిని కొల్లగొడతారు. బహుశా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు దీనితో ఏమైనా అభివృద్ధి చెందవచ్చేమోగానీ, సామాన్య ప్రజల జీవనం ఈ ప్రతిపాదనలతో మారేదేమీ లేదు. కేవలం పెట్టుబడిదారులు శ్రమశక్తిని దోచుకోవటంతో లభించిన లాభాలను తమ జేబుల్లో నింపుకోవటమే జరుగుతుంది. సామ్రాజ్యవాద ఆధిపత్యంతో కూడిన వారి ప్రతిపాదిత పథకాల లోని 'నిజాయితీ'ని ఎవరైనా గ్రహించవచ్చు.

### పి జి ఐ ఐ

ప్రపంచవ్యాపితంగా అభివృద్ధిచెందుతున్న దేశాలలో మౌలిక వసతుల పథకాలకు నిధుల నందజేయటం-అమెరికా నాయకత్వంలోని 'ఏడు దేశాల గ్రూపు'(జి-7) యొక్క సమ్మిళిత ప్రయత్నం. యునైటెడ్ కింగ్‌డమ్(యుకె)లో జరిగిన 47వ జి-7 సదస్సులో అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రకటించిన 'బ్లూడాట్ నెట్‌వర్క్' చొరవయొక్క నూతన రూపమే పిజిఐఐ. జర్మనీలో 2022 జూన్‌లో జరిగిన 48వ జి-7 సదస్సులో మొదటిసారిగా ఈ భాగస్వామ్య పథకాన్ని ప్రకటించారు. చైనా అమలుచేస్తున్న 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్'(బిఆర్ఐ)కి ప్రతిగా ఈ కూటమిని ప్రకటించినట్లుగా పరిగణించాలి. పిజిఐఐ దిశగా ఇప్పటికి గ్రాంటులు, సమాఖ్య ఆర్థికతోడ్పాటు, ప్రైవేటురంగ పెట్టుబడులను సమకూర్చటాల ద్వారా అమెరికా 3 వేలకోట్ల డాలర్లను సమీకరించింది.

### బ్లూడాట్ నెట్‌వర్క్

ప్రపంచ వ్యాపితంగా నిలదొక్కుకోగలిగే మౌలిక వసతుల అభివృద్ధి సూత్రాలను ముందుకు తీసుకెళ్ళేందుకు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, యు.కె., స్పెయిన్ దేశాలు 'బ్లూడాట్ నెట్‌వర్క్'ను బహుళ పక్ష ప్రయత్నంగా ప్రారంభించాయి. ఈ సూత్రాలపై ఆధారపడి మౌలిక వసతుల పథకాల సర్టిఫికేషన్ కొరకు ఒక కార్యవిధానాన్ని అభివృద్ధి చేసేందుకు అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, యు.కె. దేశాలు 'ఓఇసిడి'తో కలసి పని చేస్తున్నాయి. 'బ్లూడాట్ నెట్‌వర్క్' అవగాహనను ప్రారంభించటంలో ఆస్ట్రేలియాకు చెందిన 'ఆస్ట్రేలియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ ఎఫైర్స్ అండ్ ట్రేడ్'(డిఎఫ్ఏజి) మరియు 'జపనీస్ బ్యాంక్ ఫర్ ఇంటర్‌నేషనల్ కో ఆపరేషన్' (జెబిఐసి) అమెరికాతో చేతులు కలిపాయి. 2023 ఏప్రిల్‌లో యు.కె., 2023 మేలో స్పెయిన్ దేశాలు బ్లూడాట్ నెట్‌వర్క్ స్టీరింగ్ కమిటీలో చేరాయి. 2035 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవసరమైన 40 ట్రిలియన్ డాలర్ల విలువైన మౌలిక సదుపాయాల కల్పనలకోసం చైనా రూపొందించిన బిఆర్ఐకి ప్రతిగా రూపొందించినదే బ్లూడాట్ నెట్‌వర్క్.

**బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ)**




### పిజిఐఐ సమకూర్చిన ప్రాథమిక పెట్టుబడులు

రైల్, సౌర విద్యుత్తు, డిజిటల్, చిన్న మాడ్యులర్ రియాక్టర్, సైబర్ భద్రత, టెలికాం, పోర్టులు, శుద్ధ ఇంధన సరఫరా గొలుసులు మొదలైన రంగాలలో పిజిఐఐ 190 కోట్ల 25 లక్షల డాలర్ల పెట్టుబడులు పెట్టింది. ఈ నిధులను అంగోలా, డిఆర్‌సి, ఘనా, ఇండోనేషియా, రుమేనియా, కోస్టారికా, ఈక్వెడార్, ఇండియా, బ్రెజిల్ దేశాలలో పెట్టుబడులు పెట్టారు.

### చైనా: బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ)

2013 సెప్టెంబర్‌లో కజకిస్థాన్‌లో జరిగిన మౌలిక సదుపాయాల పెట్టుబడుల సభలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చైనా ప్రభుత్వ విధానంగా 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్'ను మొదటగా ప్రకటించాడు. 'బిఆర్ఐ' ప్రస్తుతానికి 147 దేశాలకు విస్తరించి వుంది. చైనా నిధులతో నడిచే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను-యూరోపియన్ యూనియన్, అమెరికాలలో మినహా ప్రపంచవ్యాపితంగా చేపట్టటం జరిగింది. ఇ.యు. మరియు అమెరికాలు అంతర్జాతీయంగా పెట్టుబడులు పెట్టకుండా తమ మౌలిక సదుపాయాల అవసరాలనే లక్ష్యంగా చేసుకున్నవిగా కనిపించేవి అయినప్పటికీ 'గ్లోబల్లీకనెక్టెడ్ యూరప్' వంటి అభివృద్ధి పథకాలున్నాయి. ప్రపంచవ్యాపితంగా షుమారు నాలుగు ట్రిలియన్ డాలర్ల వ్యయ అంచనాలతో 2970 బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులకు చైనా నిధులు సమకూర్చిందని అంచనా.

ఈ బిఆర్ఐలో చైనా-మంగోలియా-రష్యా ఎకనామిక్ కారిడార్, న్యూ యురేసియన్ ల్యాండ్ బ్రిడ్జ్, చైనా-మధ్య ఆసియా-పశ్చిమ ఆసియా ఎకనమిక్ కారిడార్, చైనా-ఇండో చైనా పెనిన్సులా ఎకనమిక్ కారిడార్, చైనా-పాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్, బంగ్లాదేశ్-చైనా-ఇండియా-మయన్మార్ ఎకనమిక్ కారిడార్‌ల వంటి ఆరు అంతర్జాతీయ ఎకనమిక్ కారిడార్ లున్నాయి. చైనా యొక్క బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్(బిఆర్ఐ)కు, దాని ప్రధాన పథకమైన చైనా, పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సిపిఇసి)గా చెప్పబడే దానిపట్ల భారత్ తన తీవ్ర వ్యతిరేకతను తెలియజేసింది.

### రష్యా : ఐఎన్ఎస్‌టిసి

ఇది మొట్టమొదట 2000 సం॥లో ప్రారంభమైంది. రష్యాలోని బాల్టిక్ సముద్రాన్ని, ఇండియా పశ్చిమ భాగంలోని అరేబియా సముద్రతీర ఓడరేవులతో ఇరాన్ గుండా అనుసంధానం చేసి రవాణా కారిడార్‌ను నిర్మించాలనేది ఆలోచన. దీనికనుగుణంగా 2002 సం॥లో 7200 కి॥మీ పొడవైన అంతర్జాతీయ ఎన్ఎస్‌టిసి నిర్మాణానికి ఇండియా, రష్యా, ఇరాన్ దేశాలు ప్రాథమికమైన

ఒప్పందాలపై సంతకాలు చేశాయి. మూడు సం॥ల తర్వాత, అజర్ బైజాన్ కూడా ఒప్పందంపై సంతకం చేసింది. అంతిమంగా ఈ ఒప్పందాన్ని ఇండియా, రష్యా, ఇరాన్, అజర్‌బైజాన్, బెలారస్, బల్గేరియా, ఆర్మీనియా, కజకిస్థాన్, కిర్గిస్థాన్, ఒమన్, తజకిస్థాన్, టర్కీ యుక్రెయిన్ వంటి 13 దేశాలు ఆమోదించాయి.

అయితే, కీలక దేశాలు శక్తిసామర్థ్యాలు, చురుకుదనం కలిగివున్నప్పటికీ సంవత్సరాల తరబడీ ఆ ప్రాజెక్టు అమలులో పురోగతి చాలా కొద్దిగా మాత్రమే వుంది. ఇరాన్ అణు కార్యక్రమంపై పశ్చిమదేశాల ఆంక్షలు, ఈ మందగమనానికి ఒకానొక కారణంగా వుంది. అమెరికా ఆంక్షల భయంతో ఇస్లామిక్ రిపబ్లిక్‌లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ఇతర దేశాలు, వారి ప్రైవేటు కార్పొరేషన్లు విముఖంగా వున్నాయి. అయితే 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ, దాని తర్వాత పశ్చిమదేశాలు రష్యాపై ఆంక్షలు విధించటం వంటి పరిణామాలు ఐఎన్ఎస్‌టిసికి తాజా ప్రేరణ కల్పించి రష్యా, ఇరాన్‌లను సన్నిహితం చేసినట్లుగా కన్పిస్తోంది.

ఈ సం॥రం ఫిబ్రవరిలో రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ ఫెడరల్ అసెంబ్లీలో ప్రసంగిస్తూ రష్యా ఐఎన్ఎస్‌టిసిని అభివృద్ధి చేస్తోందని, ఇది ఇండియా, ఇరాన్, పాకిస్థాన్ అదేవిధంగా గల్ఫ్ దేశాలన్నింటితో నూతన వాణిజ్య మార్గాలను తెరుస్తుందని పేర్కొన్నారు. "మనం నల్లసముద్రం, అజోవ్ సముద్ర తీరాల్లో నౌకాశ్రయాలను అభివృద్ధిచేయాలి. ఉత్తర-దక్షిణ అంతర్జాతీయ కారిడార్‌పై మనం ప్రత్యేకించి కేంద్రీకరించాలి' అని పుతిన్ అన్నారు. ఇటీవల పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీమ్ రైసీ ఆన్‌లైన్ ద్వారా ఒకసారి కలుసుకున్న సందర్భంగా, ఇరు దేశాలూ ఐఎన్ఎస్‌టిసిలో తూర్పుదిక్కు సమాహారంలోని ఓ కీలక సంబంధమైన 162 కి.మీ. పొడవైన రాష్త్-అస్తారా రైల్వేలైన్‌ను అభివృద్ధి చేయాలనే ఒప్పందంపై సంతకాలు చేశాయి.

అసలైన పథకం ప్రకారం, ఈ కారిడార్‌కు అనేక శాఖలున్నాయి. కాస్పియన్ సముద్ర పశ్చిమభాగాన, అజర్‌బైజాన్ గుండా రష్యాను ఇరాన్‌తో అనుసంధానం చేస్తుంది. తూర్పునున్న శాఖ కాస్పియన్ సముద్ర తీరం పొడవునా విస్తరించి, తుర్కుమెనిస్థాన్, కజకిస్తాన్ వంటి మధ్యఆసియా దేశాల వివిధ రోడ్డు, రైలు మార్గాల సమాహారాలతో ప్రధాన కారిడార్‌ను అనుసంధానం చేస్తుంది.

భారతదేశంలోని 'ఫ్రెయిట్ ఫార్ వర్డర్స్ సంఘాల సమాఖ్య' యొక్క ఒక నివేదిక ప్రకారం, ప్రస్తుత సాంప్రదాయ మార్గంకంటే ఈ కారిడార్ మార్గం 30 శాతం చౌకగానూ, రవాణా వ్యయం 40శాతం తక్కువగానూ వుంది. రష్యా లేదా యూరప్ నుండి భారతదేశానికి సూయజ్‌కాలవ -బాల్టిక్ సముద్రం-ఉత్తర సముద్రం-మధ్యధరా -అరేబియా సముద్రాల గుండా సాంప్రదాయ మార్గంలో వస్తువులను తరలించటం జరుగుతోంది. ఐఎన్ఎస్‌టిసిని సూయజ్ కాలువ మార్గానికి ఒక ప్రత్యామ్నాయమని పుతిన్ పేర్కొంటున్నాడు.

## రాష్త్-అస్తారా లింక్:

పశ్చిమశాఖలో, వేగవంతమైన రాష్త్-అస్తారా రైల్వేమార్గం అజర్‌బైజాన్ రైల్వేలను ఇరాన్ రైల్వేలతో అనుసంధానం చేసి, సెయింట్‌పీటర్స్ బర్గ్ నుండి ఇరాన్‌లో వత్తిడి అధికంగా వుండే నౌకాశ్రయమైన, గల్ఫ్‌లోని బందార్ అబ్బాస్ వరకు సూటైన కారిడార్‌ను తెరుస్తుంది. పశ్చిమదేశాల ఆంక్షల తాకిడితో, రష్యా, ఇరాన్‌లు పనులను వేగవంతం చేయాలని తలపెట్టాయి. ఇటీవల జరిగిన ఒప్పందం ప్రకారం, రైల్వే నిర్మాణాలపై రష్యా 173 కోట్ల డాలర్లను మదుపు చేయనుండగా, ఇరాన్ ఉజ్జాయింపుగా 500 కోట్ల డాలర్లను ఖర్చు చేయాలనుకోవటంతోపాటుగా, విదేశీ మదుపరుల కోసం ఎదురు చూస్తోంది. రాష్త్-అస్తారా అనుసంధానం 48 నెలలలో పూర్తి అవుతుందని ఇరాన్, రష్యాలు ప్రకటిస్తున్నాయి.

మనకు కావలసిన ఇంధన అవసరాల్లో 80 శాతాన్ని దిగుమతి చేసుకోవటంపైన ఆధారపడి వున్న మన దేశానికి, ఈ కారిడార్ ఇంధన భద్రతకోసం తాజా మార్గాలను తెరుస్తోంది. గత సం॥రం పైగా కాలంలో ఇండియా ప్రధానంగా రష్యాతో తన ఇంధన ఒప్పందాలను పెంపుచేసింది.

అదేవిధంగా ఈ కారిడార్, ఇండియా, మధ్యఆసియాల నడుమ వాణిజ్యాన్ని మరింత పెంపుచేయగలదు. ఇరాన్ అభివృద్ధిచేస్తున్న ఛాబహార్ అనే నౌకాశ్రయాన్ని ఈ కారిడార్‌తో అనుసంధానం చేయవలసిందిగా ఇండియా ప్రస్తుతం అడుగుతోంది.

కాగితాలపై ఈ ప్రాజెక్టు ఎంతటి శక్తివంత మైనదిగా వున్నప్పటికీ, ఈ ప్రాజెక్టు ఇప్పటికీ అనేక సవాళ్ళను ఎదుర్కొంటోంది. కాస్పికన్ సముద్ర పొడవునా రాష్త్-అస్తార్ రైల్వే నిర్మాణం, ఆర్థిక-ఆచరణ కారణాల రెండింటితో ఆలస్యం జరుగుతూవస్తోంది. ఈ అనుసంధానంలో 22 సొరంగాలు, 15 ప్రత్యేక వంతెనలు నిర్మించాల్సి వుండటంతో, ముందుగా నిర్ణయించుకున్న 48 నెలల కాలపరిమితిలోపు పూర్తవుతుందన్న గ్యారెంటీ లేదు.

గతకాలపు సోవియట్ రిపబ్లిక్కులలో కూడా ఉపయోగించిన రష్యన్ రైల్‌గేజ్, ఇరాన్ ఉపయోగించే దానికి భిన్నమైంది. పైగా, భౌగోళికమైన సమస్యలున్నాయి. రష్యా, ఇరాన్‌లకు ఈ ప్రాజెక్టుకు తగినన్ని నిధులు సేకరించటం కష్టంగా తోస్తోంది. ఈ దేశాలు ఇప్పటికే ఆంక్షలతో తంటాలు పడుతుండటంతోపాటు, మూడో పక్షాలు ఇరాన్‌లో మదుపుచేయటంపట్ల విముఖంగా వున్నాయి.

అజర్‌బైజాన్‌తో ఇరాన్ సంబంధం ఉద్రిక్తంగానే వుంది. అజర్‌బైజాన్ ఆర్మేనియాల నడుమ యుద్ధం, కాకసస్ భౌగోళిక రాజకీయాలను సంక్లిష్టం చేస్తున్న నేపథ్యంలో తన ఆంతరంగిక విషయాల్లో ఇరాన్ జోక్యం చేసుకుంటోందని 'బకు' పదేపదే ఆరోపణలు చేస్తోంది.

ఏమైనా, సవాళ్ళు వున్నప్పటికీ యురేషియా ఆర్థిక సమగ్రత కొరకు రూపొందించుకున్న తమ పథకాలలో ఈ కారిడార్‌ను ఓ శక్తివంతమైనదిగా, పరిస్థితులను తారుమారు చేయగలిగినదిగా చూస్తూ రష్యన్లు, ఇరానియన్లు నిశ్చయాత్మకంగా ముందుకు సాగుతున్నట్లే కన్పిస్తోంది. ✸

**2013-2023 సం॥ల నడుమ వివిధ రంగాలలో బిఆర్ఐ ఒప్పందాలలో పెరుగుదల/తరుగుదల**

| రంగం | 2016 | 2017 | 2018 | 2019 | 2020 | 2021 |
|---|---|---|---|---|---|---|
| వ్యవసాయం | 121% | -5.6% | 5% | 23% | 31% | -8.3% |
| రసాయనాలు | 51% | 124% | -72% | 192% | -11% | 17% |
| వినోదం | -25% | -3% | -11% | 9% | -34% | -4% |
| ఆర్థికం | 710% | 173% | -71% | 100% | -88% | -100% |
| ఆరోగ్యం | -13% | 345% | -47% | -45% | -50% | 362% |
| సైనిక వ్యవహారాలు | 114% | 193% | -89% | -80% | 630% | 35% |
| రియల్ ఎస్టేట్ | -17% | 51% | -15% | 5% | -60% | 28% |
| సాంకేతికత | -58% | 15% | 25% | 41% | -63% | -88% |
| రవాణా | -43% | 7% | 103% | -30% | -43% | -1% |
| పర్యాటకం | 451% | 13% | -89% | 26% | -100% | - |
| వినియోగ వస్తువులు | 41% | -44% | -31% | 150% | -61% | 169% |
| ఇతరములు | -21% | 156% | 9% | -59% | -55% | 36% |
| గనులు & లోహాలు | -5% | 1% | 185% | -47% | -48% | 89% |

మూలం: గ్రీన్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏఐఐ

# జాత్యహంకార దాడులకు వ్యతిరేకంగా భగ్గుమన్న ఫ్రాన్స్!

**విప్లవాలకు** పుట్టినిల్లుగా పేరుపొందిన ఫ్రాన్స్ 2023 జూన్ 27 నుండి రెండు వారాలకు పైగా యువకుల ఆగ్రహానికి అతలాకుతలం అయింది. వర్గ అసమాన తలతో పాటు దోపిడీ వ్యవస్థ పెంచి పోషిస్తున్న జాతి వివక్షకు వ్యతిరేకంగా పెల్లుబికిన తిరుగుబాటు, దీని అంతస్సారం.

నాహెల్ మర్జౌక్ అనే 17 ఏళ్ల యువకుడిని 2023 జూన్ 27న ప్యారిస్ నగరానికి శివారు ప్రాంతమైన ' వెంటెర్రే' లో ట్రాఫిక్ పోలీస్ కాల్చి చంపేశాడు. అతను ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి వాహనాన్ని ఆపమన్నా ఆగకుండా సిగ్నల్స్ దాటి ముందుకు వెళ్లాడన్న కారణంగా నిర్దాక్షిణ్యంగా అతి సమీపం నుండి కాల్చి చంపాడు. పోలీసుల హత్యకు బలైన ఆ యువకుని పేరులోని చివరి పదాన్ని (మర్జౌక్) ఫ్రాన్స్ దేశపు వార్తా ప్రసారాలు పలుకకుండా నాహెల్ ఎమ్. అని మాత్రమే శ్రోతలకు పరిచయం చేశాయి. మర్జౌక్ అని చెప్పగానే బహుశా అతని సాంఘిక మూలాలు తెలిసే అవకాశం ఉండి ఉంటుంది. నాహెల్ ఫ్రాన్స్ దేశంలోనే పుట్టిన యువకుడు అయినప్పటికీ యూరోపియన్ మూలాలు ఉన్నవాడు కాదు. అతని పూర్తి పేరు వల్ల అల్జీరియా దేశపు అరబ్ తెగల మూలాలు అందరికీ తెలిసిపోయే అవకాశం ఉంటుంది.

ఫ్రాన్స్ దేశంలో ముఖ్యంగా ప్యారిస్ నగరంలో అల్జీరియా, మొరాకో, ట్యునీషియా తదితర ఆఫ్రికాఖండ దేశాల వారు తగిన సంఖ్యలో జీవిస్తూ ఉంటారు. అమెరికా నాటో కూటముల దురాక్రమణ విధానాల ఫలితంగా మధ్యాసియా ప్రాంతాలైన ఇరాక్, సిరియా తదితర దేశాల నుండి వలస రావాల్సిన దుస్థితి కూడా ఒక కారణమై ఉంటుంది.

ఐరోపా మూలాలులేని పౌరులు సుమారు 10 శాతం పైన ఫ్రాన్స్ దేశంలో నివసిస్తూ ఉన్నారు. ఒకప్పటి ఫ్రాన్స్ దేశపు వలసలుగా ఉండిన జాతుల ప్రజలే వీరిలో అత్యధికులు. 1962లో ఫ్రెంచ్ వలస పాలన నుండి అల్జీరియా జాతీయ విముక్తిని పొందింది.

## స్వేచ్ఛ–సమానత్వం–సౌభ్రాతృత్వం అనే బూర్జువా విప్లవ నినాదాలు

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే బూర్జువా విప్లవ నినాదాలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి ఒకనాటి కారణమైన ఫ్రాన్స్ దేశంలో కూడా, జాతి వివక్ష వ్యక్తం అవుతూనే ఉన్నదనటానికి ఇదొక తాజా ఉదాహరణ. నాహెల్ నడుపుతున్న కారుకు లైసెన్స్ లేదు. ఆ సంగతి తెలిస్తే తన బతుకు తెరువుకి మూలాధారమైన డెలివరీ బాయ్ ఉపాధి పోతుందని అతని భయం. చిన్న వయసులోనే రిస్క్ తీసుకుని అయినా కుటుంబాన్ని పోషించ వలసిన బాధ్యత మీద పడిన జీవన అభద్రత అతనిది. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కాల్చి చంపేసే ఘోరమైన చట్టాలు ఆ దేశంలో ఉన్నాయి. అలాగని అందరి పైన ఒకే విధంగా అవి అమలు జరుగుతాయని అనుకోకూడదు. అరబ్ జాతి, ఇస్లామిక్ మతం మూలాలు ఉండటమే నాహెల్ మరణానికి ముఖ్య కారణం. నాహెల్ తరహా నేరాలు చేసిన ఐరోపావాసులకు ఇంత తీవ్రమైన 'మరణ శిక్షలు' ఉండవు. ఇది అక్కడి జీవితానుభవం. స్పష్టమైన ఈ వివక్షకు నిరసనగా చెలరేగినదే ఫ్రాన్స్ దేశంలోని ఇటీవలి అల్లకల్లోలం. దాదాపు 15 రోజులపాటు ఉధృతంగా సాగిన ఆగ్రహోజ్వల చట్ట ధిక్కారం, పారిస్ నగరాన్ని కుదిపివేసింది. జూన్ 27న పోలీస్ స్టేషన్ ముందు నిరసనగా ప్రారంభమైన ఆగ్రహ ప్రదర్శనతో మొదలై మరుసటి రోజు వాహనాల విధ్వంసకాండగా, షాపులు తగుల పెట్టడంగా చెలరేగిపోయింది.

నాహెల్ శవం అంతిమయాత్ర రోజున ఇది మరింత తీవ్రమైంది. వెయ్యికి పైగా భవనాలు, 5600 వాహనాలు ఈ విధ్వంస కాండకు గురయినాయి. 3300 మంది ఆందోళనకారులను అరెస్టులు చేశారు. ఈ ఉద్యమాన్ని అదుపు చేయడానికి సుమారు 50 వేల మంది పోలీసు బలగాలను మోహరించారు. ఇద్దరు పౌరులు మరణించారు. 808 మంది పోలీసులు గాయపడ్డారు. నగర మేయర్ ఇంటిలోకి కారు బాంబర్ని ప్రయోగించారు.

నాహెల్ కుటుంబ సహాయనిధి కోసం పౌర సంఘాలు చేసిన విజ్ఞప్తికి వ్యతిరేకంగా, అతన్ని కాల్చి చంపిన పోలీసు అధికారి కుటుంబ సహాయ నిధికై ఆ దేశపు పరమ మితవాద అభివృద్ధి నిరోధక ఫాసిస్టు తరహా శక్తులు విజ్ఞప్తి చేయగా, జులై మూడు కల్లా 963 వేల యూరోలు (8 కోట్ల 66 లక్షలు) వసూలైనట్లు ప్రకటించారు.

## నాహెల్ ఉదంతం ఇంతటి అల్ల కల్లోలాన్ని ఎందుకు సృష్టించిందన్నది అసలు ప్రశ్న

అల్జీరియా ఫ్రెంచి వలసగా ఉన్న కాలంలో ఫ్రెంచి దళాలు జరిపిన దారుణ మారణకాండలు ఒక తరం నుండి మరొక తరానికి ఇప్పటికీ గుర్తుకు వస్తాయి. అనేక మంది అల్జీరియన్లు ఫ్రాన్స్‌లో స్థిరపడ్డారు. వలస వచ్చిన ఆఫ్రికా అరబ్బులు, తదితరులు అంటే ఫ్రెంచి అధికార యంత్రాంగానికి చాలా చిన్న చూపు. సాధారణంగా వారిని నేరగాండ్లుగా చూస్తారు. వారితో సాన్నిహిత్యం పెంచుకోవడానికి బదులు ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తారు. అందుకే శ్వేతేతరులు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో తరచూ వివాదాలు జరుగుతుంటాయి. పశ్చిమ దేశాలలో వర్ణ వివక్ష కారణంగా అమెరికా తరువాత ఫ్రాన్స్‌లోనే పోలీసుల చేతుల్లో ఎక్కువ మంది మరణిస్తున్నారు.

2020లో అమెరికాలోని మినియాపోలిస్ పట్టణంలో పోలీసులు జార్జి ఫ్లాయిడ్ అనే నల్లజాతి యువకుడిని ఊపిరాడకుండా చేసి చంపిన తీరును, చుట్టుపక్కల ఉన్నవారు తీసిన వీడియో వలన సంచలనంగా మారి, అమెరికా దేశ అధ్యక్ష భవనానికి ముప్పు కలిగించేంత ఆందోళనకు దారితీసింది. నాహెల్‌ను కాల్చి చంపుతున్న వీడియో కూడా అలాంటి ప్రతిస్పందననే కలిగించింది.

ఫ్రాన్స్ దేశంలోనే, 2005లో, పోలీసులు వెంటాడినపుడు ప్రమాదానికి గురై ఇద్దరు విద్యార్థులు మరణించిన ఘటన, ఆనాడు దేశమంతటా మూడు వారాల పాటు తీవ్ర ఆందోళనలతో సంచలనం కలిగించింది. ఆ తరువాత ఇప్పుడు కూడా అదే మాదిరి ఫ్రాన్సు లోని మైనారిటీలు ఆందోళనకు పూనుకున్నారు. ఫ్రెంచి పోలీసులు ప్రదర్శించే జాతి వివక్ష తీరుతెన్నులకు, దుర్మార్గమైన అణచివేత విధానాలకు ఈ ఉదంతాలు నిదర్శనాలు.

## ఐక్యశ్రామిక, ప్రజా ఉద్యమాన్ని విభజించే కుయుక్తులు

2008లో అమెరికాలో పెల్లుబికిన వాల్ స్ట్రీట్ ఆర్థిక సంక్షోభం యొక్క ప్రభావం యూరప్ మీద గణనీయంగా పడింది. శ్రామిక వర్గాలు, మధ్యతరగతి జీవులు అప్పటికే పోరాడి

సాధించుకున్న అనేక హక్కులకు కత్తిరింపులు మొదలయినాయి. వాటితో గ్రీసు లాంటి దేశాలతో పాటు ఫ్రాన్స్‌లో కూడా శ్రామిక వర్గ ఆందోళనలు తీవ్రతరమవుతూ వచ్చాయి. శ్రామిక ప్రజల న్యాయమైన కోర్కెలను దోపిడీ ప్రభుత్వాలు అణచివేస్తూ ఉండటమే కాక ఫ్రాన్స్‌తో సహా వివిధ యూరోపియన్ దేశాలలో పచ్చి అభివృద్ధి నిరోధక మితవాద రాజకీయ పార్టీలను ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. ఈ మితవాద పార్టీలు లేక సంస్థలు నిస్సిగ్గుగా జాతి వివక్షను రెచ్చగొడుతున్నాయి. ఆయా యూరోపియన్ దేశాల పాత వలసలయిన వెనుకబడిన దేశాల నుండి పొట్ట చేత పట్టుకుని రెక్కల కష్టాన్ని అమ్ముకోవడానికి వచ్చిన శ్రామిక వర్గాలే తమ దేశాల యువతరానికి ఉపాధి లభించకుండా పోవడానికి కారకులంటూ రంగు భేదాల వివక్షను వ్యాప్తి చేస్తూ ప్రజల్లో తమ పలుకుబడిని పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నాయి.

పాలకులు తాము పెంచి పోషిస్తున్న సంక్షుభితమైన దోపిడీ అసమానతలను కప్పిపుచ్చుకుంటూ, వలస వచ్చిన వెనుకబడిన శ్రామిక జీవుల కారణంగానే తమ దేశ జీవన పరిస్థితులు ఎగుడు దిగుడులవుతున్నాయని బుకాస్తున్నారు.

అయితే వెనకబడిన జాతుల వారిని పాశ్చాత్య ప్రభుత్వాలు ఎందుకు తమ దేశం రానిస్తాయి అంటే, వారు చౌకశ్రమ శక్తులు కనుక! వారి శ్రమ నుండి అదనపు విలువను అధికంగా గుంజటానికి, ఆ విధంగా ఎక్కువ లాభాలను గడించడానికి తోడ్పడుతుంది కనుక!!

ఈ వాతావరణంలో ఒకనాటి కనీస బూర్జువా సాంస్కృతిక విలువలకు కూడా పాలకులు తిలోదకాలు ఇచ్చి, జాతి వివక్షలను తమ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. అందునా ఇటీవల ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిని కాల్చి వేయవచ్చు అనే చట్టాలను కూడా చేసుకున్నారు. చట్టం ధనిక, పేద వర్గాలకు, అలాగే తెల్లజాతులకు, అరబ్బు ఆఫ్రికా దేశాలకు చెందిన వారికి ఒకే విధంగా పనిచేయదని ఆచరణలో అమెరికా నుండి ఐరోపా దాకా రుజువు చేస్తున్నాయి .

మాక్రన్ ప్రభుత్వానికి తాజా ఆందోళనతో ఎదురైన సవాలు కారణంగా బ్రసెల్స్‌లో జరుగుతున్న ఒక సమావేశం నుంచి ముందుగానే విరమించుకుని స్వదేశానికి చేరుకోవటమే కాక అప్పటికే నిర్ణయమైన జర్మనీ పర్యటన కూడా వాయిదా వేసుకున్నాడు. సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించేందుకు ఫ్రెంచి అధ్యక్షుడు మాక్రాన్ దేశంలోని 220 మంది మేయర్లతో(స్థానిక సంస్థల అధిపతులు) సమావేశం నిర్వహించాడు.

## 'సియాసత్' మేనేజింగ్ ఎడిటర్ జహీర్ అలీఖాన్‌కు జోహార్లు



**హైదరాబాద్** పత్రికా రంగంలో వుంటూ ప్రజల పక్షాన నిలిచిన ప్రజాతంత్రవాదిగా, సెక్యులర్ భావాలు కలిగిన రచయిత (అబిద్ అలీఖాన్‌గారి) వారసుడిగా, మేధావిగా జహీర్ అలీఖాన్ గారు అందరికీ తెలుసు. అటువంటి ప్రజాపక్ష ఆలోచనాపరుడు, కమ్యూనిస్టు అభిమాని కామ్రేడ్ గద్దర్ అంతిమ యాత్రలో పాల్గొంటూ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. జహీర్ అలీఖాన్‌గారి మరణం పట్ల మా పార్టీ సిపిఐ (ఎం. ఎల్) సంతాపాన్ని తెలుపుతున్నది. ఆత్మీయుడిని కోల్పోయిన ఆయన కుటుంబానికి, సియాసత్ పత్రిక కుటుంబానికి సహానుభూతి వ్యక్తం చేస్తున్నాము.

అమెరికన్ సామ్రాజ్యవాదులు ఇరాక్‌పై దాడి చేస్తున్న సందర్భంలో వెంటనే జహీర్ అలీఖాన్ గారు స్పందిస్తూ హైదరాబాద్‌లో ఏర్పడిన యుద్ధవ్యతిరేక వేదికలో కీలక పాత్ర వహించారు. గుజరాత్ అల్లర్లను సరైన విధంగా అర్థం చేసుకుని కమ్యూనిస్టు పార్టీలతో కలిసి అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఒకటీ రెండూ కాదు, అనేక ఉద్యమ సందర్భాల్లో స్పందిస్తూ, ఉర్దూ పత్రికా రంగంలో కృషిచేస్తూ ఆకస్మికంగా మరణించారు. వారికి నివాళి,వారి కుటుంబానికి సంతాపం తెలియజేస్తున్నాం.

**విశ్వం**
**ప్రధాన కార్యదర్శి**
**CPI (ML)**

నాహెల్ సంఘటన ముందు వరకు, జనవరి నెల నుండి కార్మికుల, ఉద్యోగుల తీవ్రమైన ఆందోళనలను ఫ్రాన్స్ ప్రభుత్వం ఎదుర్కొంటోంది. ఫ్రాన్స్ ప్రభుత్వ పెన్షన్ సవరణ విధానాలకు వ్యతిరేకంగా ఈ సంవత్సరపు వంద రోజులలో దాదాపు 12 సార్లు దేశవ్యాప్త ఆందోళనలు జరిగాయి. మేడే నాడు చాలా ఉధృతంగా ఉద్యమకారులు దేశమంతా కదం తొక్కారు. మక్రాన్ ప్రభుత్వానికి, పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా సాగిన ఆ ఉద్యమం ఎంత తీవ్రమైనదంటే ఆ సమయంలో, ఈ ఏడాది ప్రారంభంలో, బ్రిటన్ రాజు చార్లెస్ కూడా ఫ్రెంచి పర్యటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

నెలల తరబడి పెన్షన్ సమ్మెలు, ఇతర ఆందోళనలతో అట్టుడుకుతున్న ఫ్రాన్స్‌లో నాహెల్‌పై కాల్పుల ఉదంతంతో దానికి వ్యతిరేకంగా నిరసనలు పెల్లుబికాయి. ఉద్యమ ప్రజానీకంలో శ్వేత జాతి అహంకారాన్ని రెచ్చగొట్టడానికి, తద్వారా ఐక్యంగా సాగుతున్న ఉద్యోగుల, కార్మికుల ఆందోళనలను పక్కదారి పట్టించడానికి ఫ్రాన్స్ పాలకులు దీనిని అవకాశంగా తీసుకున్నారు. ఏ సామాజిక విపత్తు సంభవించినా దాన్ని తమ దోపిడీ పాలనకు అనువుగా మలుచుకోవడం పాలకవర్గాలకు వెన్నతో పెట్టిన విద్య కదా!

అమెరికా దేశపు ఆదేశాలను తూచా తప్పకుండా పాటించడానికి ఫ్రాన్స్ నిరాకరించిన ప్రతిసారీ, ఫ్రాన్స్ ప్రభుత్వంపై ఫ్రాన్స్ ప్రజలను అమెరికా రెచ్చగొడుతూ ఉంటుందని ఒక ప్రచారం కూడా ఉన్నది. ఆ విధంగా నాహెల్ సంఘటనను ఫ్రాన్స్ దేశ ప్రభుత్వం ఒక విధంగా, అమెరికా మరొక విధంగా వాడుకున్నాయి.

### కొసమెరుపు:

నాహెల్ సంఘటన (జూన్ 27) జరగడానికి 55 రోజుల ముందే మణిపూర్‌లో జాతి నిర్మూలనా దురంతాలు సాగాయి. మరొక 20 రోజుల దాకా అదీ సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప ప్రధాని మోడీ తన నోటితో మణిపూర్ పేరుని పలుక లేదు. ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమాన్యుల్ మాక్రన్ నాహెల్ సంఘటన జరిగిన వెంటనే తన స్వీడన్ పర్యటనను అర్ధాంతరంగా ముగించుకుని, జర్మనీ పర్యటనను వాయిదా వేసుకుని తన స్వదేశం తిరిగి రాగా, భారత ప్రధాని నరేంద్ర మోడీ, 75 రోజుల ఈ కాలంలో జపాన్, ఆస్ట్రేలియా అమెరికా, ఈజిప్టు వెళ్లి సుభాషితాలు చెప్పి రావటమే కాక ఫ్రాన్స్ దేశానికి కూడా వెళ్లి రక్షణ ఒప్పందాలను కుదుర్చుకుని వచ్చారు.

సందట్లో సడేమియా లాగా నాహెల్ హత్య ఫలితంగా తలెత్తిన తీవ్ర ఆందోళనలను ఎలా అణిచివేయాలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నుండి, భారత ప్రధాన మంత్రి మోడీ నుండి సలహాలు తీసుకోమంటూ ఇక్కడి మతోన్మాద శ్రేణులు, ఫ్రాన్స్ దేశాధ్యక్షునికి ఉచిత సలహాలతో మన సామాజిక మాధ్యమాలను హోరెత్తించారు. ✶

# బళ్లారిలో AIKMKS అనుబంధ KRRS ఆధ్వర్యంలో ఎద్దుల బండ్లు , ట్రాక్టర్లతో ర్యాలీ, బహిరంగ సభ





బహిరంగ సభలో ప్రసంగిస్తున్న కెఆర్ఆర్ఎస్ నాయకులు: ఎండ్లబళ్ళతో రైతుల భారీ ప్రదర్శన

**కర్నాటక** గ్రామీణబ్యాంకు (కెజిబి) అప్పుల వసూలు పద్ధతికి వ్యతిరేకంగా సంవత్సర కాలంగా ఆందోళనలు జరుగుతున్నాయి. బ్యాంకు ప్రధాన కార్యాలయం ముందు 246 రోజులు అహోరాత్రి ధర్నా నడిచింది. 20 వేలు, 30 వేలు అప్పులు తీసుకుని కరువులు, వరదల కారణంగా కట్టలేక పోయిన కొందరు రైతులపై చక్రవడ్డీల భారం మోపి వారందరినీ ఎగవేత దారుల లిస్టులో చేర్చుతున్నారు. ఈ కారణంగా వారికి ప్రభుత్వాలు ప్రకటించే సబ్సిడీలు,ఆర్థిక సహకారాలు, విద్యార్థులకు స్కాలర్ షిప్పులు, ఎద్యుకేషన్ లోన్లు కూడా ఇవ్వకుండా బ్యాంకులు అవమానిస్తున్నాయి. దేశంలో రైతుల ఆత్మహత్యల సంఖ్యలో మహారాష్ట్ర తర్వాత కర్నాటక రెండవ స్థానంలో వున్నది. ఈ బ్యాంకు అప్పులు కూడా ఆత్మహత్యలకు ప్రధాన కారణంగా మారు తున్నాయని, బ్యాంకులిచ్చే వేలం నోటీసులకు భయపడి ఎక్కువమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆయా కుటుంబాలను పరిశీలించినపుడు అర్ధమైంది. ఈ నేపథ్యంలో AIKMKS అనుబంధ KRRS (కర్ణాటక రాజ్య రైతుసంఘం) కార్యకర్తలు టీములుగా అనేక గ్రామాల రైతాంగాన్ని చైతన్యపరిచారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని పోరాటమే పరిష్కార మార్గాలను చూపుతుందని కర్ణాటక లోని 15 జిల్లాలలో విస్తృతంగా తిరిగి రైతాంగాన్ని కదిలించారు.

కరోనా కష్టకాలం, ప్రకృతి విపత్తుల కారణాలు చూపి ఒక్కొక్క కార్పొరేట్ కంపెనీకే వేలకోట్ల ఋణమాఫీలు చేస్తున్నప్రభుత్వాలు(ఒక్క బళ్లారి జిందాల్ కంపెనీకే 58,171 కోట్లు) తీవ్రంగా నష్టపోయిన తమకు భూముల వేలం నోటీసులు పంపుతున్నా ప్రభుత్వంనుంచి స్పందన లేకపోవడంతో తీవ్రంగా పరిగణించిన రైతాంగం ఆందోళన చేపట్టారు. నెలల తరబడి అనేక రూపాలలో ఆందోళనలు సాగాయి.

కర్ణాటక రాష్ట్రంలో ప్రధానంగా బళ్లారి ప్రాంతంలో భూములను కార్పొరేట్లకు తక్కువ ధరలకు కట్టబెట్టే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, పంటల నష్టపరిహారాల కోసం, గిట్టుబాటుధరల కొరకు, అగ్రికల్చరల్ కాలేజీల కోసం, మూడు వ్యవసాయ నల్ల చట్టాల రద్దుకోసం, ప్రజారోగ్య వ్యవస్థల రక్షణకోసం, సాగునీటి విడుదల-కాల్వల ఆధునీకరణ కోసం, డ్యాముల రక్షణ-అంతరాష్ట్ర జల వివాదాల పరిష్కారం వంటి సమస్యలపై నిరంతరాయంగా చిన్న సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలను సంఘటితపరిచి KRRS ఆధ్వర్యంలో ఆందోళనలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే బ్యాంకుల చక్రవడ్డీ దోపిడీ సమస్య సంఘం ముందుకొచ్చింది. బ్యాంకు అధికారులు రైతుల భూములలో పాతిన వేలంనోటీసు బోర్డులను పెరికి వేసి రైతుసంఘం జెండాలను నిలబెట్టి రైతులకు భరోసా కల్పించారు. బ్యాంకుల ముందు, డీసీ ఆఫీసుల ముందు దశలవారీగా సంఘం ఆందోళనా కార్యక్రమాలను, చివరికి నిరవధిక ఆందోళనను చేపట్టింది. ఈ ఆందోళనను తీవ్రతరం చేస్తూ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎడ్లబండ్లు,ట్రాక్టర్లతో వందలాదిమంది బళ్ళారి పట్టణంలో 21-8-23న ప్రదర్శన నిర్వహించి తమ నిరసనను, ఆగ్రహాన్ని నినాదాల రూపంలో తెలియజేశారు. ఆందోళన కొనసాగుతున్న ధర్నా స్థలమైన KGB ప్రధాన కార్యాలయం ఎదురుగా సీనియర్ అడ్వకేట్ భాస్కర్‌రావు గారి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. కర్ణాటక రాజ్య రైతు సంఘ (AIKMKS అనుబంధ) రాజ్యాధ్యక్షులు ఆర్. మాధవరెడ్డి 'ప్రస్తావిక నుడి'లో భాగంగా సంవత్సర కాలపు ఆందోళనా కార్యక్రమాల తీరును వివరించారు. ఆందోళనకు సంఘీభావం తెలపడానికి వచ్చిన సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు, గుల్బర్గా MLA బి.ఆర్ పాటిల్ సభను ప్రారంభించారు. ఉద్యమానికి అండగా ఉంటామని తమ ప్రసంగంలో వివరించారు. సంయుక్త కిసాన్ మోర్చా మధ్యప్రదేశ్ నాయకులు డా॥సునీలం, పోరాటానికి సంఘీభావం తెలుపుతూ ఈ సమస్య కేవలం బళ్లారిదే కాదని దేశ రైతులందరిదనీ, బ్యాంకులు రైతులకు ఇచ్చే ఋణాలపై సరైన విధానం కొరకు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సి ఉందని ఈ విషయమై ఢిల్లీలో జరగబోయే SKM సమావేశాల్లో చర్చిస్తామన్నారు.

AIKMKS కో కన్వీనర్ కామ్రేడ్ ఎస్. ఝాన్సి మాట్లాడుతూ భూములు, నీరు, అప్పులు అన్నీ కూడా వ్యవసాయాన్ని నిలబెట్టుకునే పోరాటాలేనని పట్టుదలతో పోరాటం చేస్తున్న రైతాంగాన్ని అభినందిస్తూ AIKMKS నిరంతరం అండగా ఉంటుందని అన్నారు. కర్ణాటక రాష్ట్ర నాయకులు చాగనూరు మల్లిఖార్జునరెడ్డి, KRRS ఇతర జిల్లాల నాయకులు బడగలపుర నాగేంద్ర, చామరాజ్ మాలిపాటిల్ తదితరులు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. సభకు SKM నుంచి ప్రధాన వక్తగా హాజరుకావాల్సి వున్న ప్రముఖ రైతునేత రాకేశ్ తికాయత్ గారు అరెస్టు వారెంట్ కారణంగా హాజరుకాలేక పోతున్నట్టు తెలిపారు. సభా ప్రారంభంలోనే లైవ్ వీడియో ద్వారా తన సందేశాన్ని వినిపించారు. సంఘీభావం తెలుపుతూ రైతులనుద్దేశించి ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో రెండువేల మందికి పైగా రైతులు పాల్గొన్నారు. 80 ఎద్దుల బండ్లు, 80 ట్రాక్టర్లకు సంఘం జెండాలు అలంకరించి

రైతులు పాల్గొన్నారు. 15 రోజులుగా 200 గ్రామాలలో కర్ణాటక రాజ్యరైతుసంఘ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సభకు అనేక మంది సహకరించి విజయవంతం చేశారు.

అనంతరం 22వ తేదీ ఉదయం 11గం.కు బెంగుళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి బ్యాంకు అధికారులు, ప్రభుత్వ కార్యదర్శుల సమక్షంలో రైతునాయకులతో చర్చించారు. AIKMKS, KRRS నాయకులు ఇచ్చిన మెమోరాండంతోపాటు, రూ.30 వేలలోను తీసుకున్న రైతుకి రూ.2,94,000 బాకీ చూపిన బ్యాంకు స్టేట్మెంట్‌ని ఆధారంతో సహా ప్రతినిధులు చూపారు.ఇది చివరికి లెక్కిస్తే నూటికి 40 పైసల బదులు 4 రూ. పైగా వడ్డీ చెలించాల్సి వస్తున్నది. ఇదే రైతు అకౌంట్‌కు ప్రభుత్వం గడచిన 10 సంవత్సరాల్లో వేసిన 89 వేల రూపాయల్ని కూడా KG బ్యాంకు వారు ఎలా జమచేసుకున్నారో వివరించారు.ఇలాంటి అనేక మంది రైతుల పాసుపుస్తకాలను అందించారు. మేము పూర్తి రుణమాఫీ కూడా అడగడం లేదని, అసలు సొమ్ములో 50 శాతం కట్టడానికి వీలుగా OTS (వన్ టైం సెటిల్మెంట్) అడుగుతున్నామని రైతులు తమ వైపు నుంచి పరిష్కారమార్గాన్ని ప్రతిపాదించారు.

మరొక అంశంగా అన్ని బ్యాంకులు రైతులకు అప్పులు ఇవ్వడం తగ్గించి పారిశ్రామిక వర్గాలకు ఎలా కట్టబెడుతున్నాయో చర్చల్లో బయటపడింది. బ్యాంకర్లు సీఎం గారికి ఇచ్చిన లెక్కలు ఇందుకు ఉదాహరణ. ఈ సంవత్సరం 80% రైతులకు రుణాలు ఇచ్చామని వారు పత్రికల్లో చేసిన ప్రకటన అబద్ధమని రుజువైంది. మొత్తం KGB టర్నోవర్ రూ.76,000 కోట్లలో రూ.7,500 కోట్లు మాత్రమే రైతులకు ఋణాలుగా ఈ సంవత్సరం ఇచ్చినట్లు KGB వారు ఒప్పుకున్నారు. వివరాలు దాచిపెడుతున్నప్పటికీ మిగిలినదంతా కార్పొరేట్ శక్తులకు రైతులపేరుతోనే కట్టబెడుతున్నారని అర్ధమైంది. చర్చల అనంతరం సీఎం అప్పుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.నాబార్డ్, KGBకి స్పాన్సర్డ్ బ్యాంకు అయిన కెనరా బ్యాంకు, ప్రభుత్వ ఆర్థిక శాఖ సెక్రటరీలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని నిరవధిక ఆందోళనను విరమించమని రైతులను కోరారు. బళ్లారికి తిరిగివచ్చి అన్నిజిల్లాల రైతులతో చర్చించుకుని నిరవధిక ధర్నా టెంటును 25-8-23 న బ్యాంకు ప్రధాన కార్యాలయం ముందు నుంచి తాత్కాలికంగా తొలగించారు. సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోతే ఇదే బ్యాంకు ముందు ఆందోళన తిరిగి కొనసాగిస్తామని అక్కడే పత్రికా విలేఖరుల సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటించారు. చక్రవడ్డీ అప్పులపై హామీ తేలేవరకు రైతులు అప్పులు చెల్లించవద్దని, భూములను ఇతర ఆస్తులను ఎక్కడైనా బ్యాంకు ఆన్లైన్లో వేలం వేయడానికి ప్రయత్నిస్తే ఊరుకోబోమని, అలా కొనుక్కున్న వారి ఇళ్ల ముందు సైతం ఆందోళనలు కొనసాగుతాయని KRRS రాష్ట్ర కమిటీ తరపున ఆర్. మాధవరెడ్డి ప్రకటించారు.

సంవత్సర కాలంగా అప్పుల వసూలు పద్ధతి, కొన్ని బ్యాంకులు రైతులపట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపూరిత విధానాలను ప్రశ్నిస్తూ చేసిన ఆందోళన ఫలితంగా ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చే వాటిని బ్యాంకులు తమ అప్పుకి జమచేసుకోవడం చాలావరకు ఆగింది. చిన్న సన్నకారు రైతులు బ్యాంకులవద్ద చేతులు కట్టుకుని లోన్ల కోసం గంటల తరబడి నిలబడి బ్రతిమాలడం కొంత మేరకుతగ్గింది. ఆందోళనల్లో కొంత ఎక్కువ చురుగ్గా పాల్గొన్న కొన్నిగ్రామాల్లో తమ హక్కుగా ప్రశ్నించడం వివరాలను,స్టేట్మెంట్ల రూపంలో తీసుకుని తప్పుడు లెక్కల్ని, పెనాల్టీలను కనిపెట్టి అడగడం జరుగుతున్నది. బ్రతికున్నట్లు సాక్ష్యం కోసమని చెప్పి చదువురాని రైతులతో వేలిముద్రలు వేయించుకొని వడ్డీని అసలులో కలుపుతూ అప్పులను రెన్యువల్ చేయడాన్ని ఎదుర్కోగలుగుతున్నారు. గత సం॥రం RBIతో జరిపిన సంభాషణల ఫలితంగానూ, సుప్రీంకోర్టు ఆదేశాల ఫలితంగానూ రానున్న 2024 జనవరినుంచి వడ్డీపై వడ్డీ విధించకూడదనే నియమాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని RBI కొత్త మార్గదర్శకాలను జారీచేసింది. అనేక విధాలుగా నష్టపోతున్న రైతులను బ్యాంకులు కూడా మోసగించడంతో ఈ సమస్య రైతులకు ఆగ్రహాన్ని తెప్పించి ఆందోళన బాటపట్టించింది. ✸

---

**'భూములూ...** (23వ పేజీ నుండి)

రాష్ట్ర రైతుకూలీ సంఘంతీసుకొని వచ్చిందని చెపుతూ ముగించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ వర్మ యువతరం యొక్క పాత్ర ఈ మహాసభలో కూడా వారు పాల్గొన్న తీరుతో వెల్లడైందని, ఇప్పటికి నాలుగు తరాలు ఈ ఉద్యమ జెండా నీడలో నడిచాయని, భవిష్యత్తరాలు కూడా, ఆదివాసుల అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఉద్యమం కొనసాగుతుందనే విశ్వాసం కలుగుతుందని చెబుతూ ముగించారు. కామ్రేడ్ లలిత దేశవ్యాప్తంగా సాగుతున్న రైతాంగ ఉద్యమాలను ప్రస్తావిస్తూ కొండమొదలు ఉద్యమం ముందుకు సాగాలని కోరారు. రై.కూ.సం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ శ్రీను నాయుడు కొండమొదలు ఉద్యమ ప్రేరణతో విజయనగరం జిల్లా రైతుకూలీ ఉద్యమం మొదలై సాగుతున్నదని వివరించగా, కామ్రేడ్ భాష పశ్చిమ గోదావరి గిరిజనోద్యమం కొండమొదలు ఉద్యమ కొనసాగింపుగా జరిగిన తీరును, కొనసాగుతున్న క్రమాన్ని వివరించగా, వీరందరూ మహాసభ విజయవంతమైనందుకు అభినందలు తెలిపారు.

అనంతరం మహాసభ ఈ క్రింది సాధారణ తీర్మానాలను ఆమోదించింది. 1.భూమి కోసం, జీవించే హక్కు కోసం ఐక్యంగా పోరాడటం తప్ప ఆదివాసులకు మార్గం లేదనీ, భూముల కోసం ముందుకు సాగాలని ఆదివాసులకు పిలుపునిస్తూ, 2. కొండపోడు హక్కులను ఆదివాసి హక్కుల చట్టాలను ఎత్తివేస్తూ పాలకులు తీసుకొచ్చిన అటవీ సంరక్షణ సవరణ చట్టాలను వ్యతిరేకించాలని ఆదివాసులను కోరుతూ, 3. పోలవరం ప్రాజెక్టు పేరిట నిర్వాసితులను కాంటూరు వారీగా విభజిస్తూ నిరంతరం ముంపులకు గురి చేస్తున్న ప్రభుత్వాల విధానాలను ఖండిస్తూ, సమగ్ర పునరావాసం కోసం నిర్వాసితులు తమ పోరాటాలను ఐక్యంగా కొనసాగించాలని పిలుపునిస్తూ, 4. కోర్టులను అడ్డం పెట్టుకుని జీవో నెంబర్ 3 వంటి వాటిని పాలకులు రద్దు చేస్తున్న సమయంలో ఆదివాసీ, విద్యార్థి నిరుద్యోగ ప్రజానీకం, అందరికీ ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం ఉద్యమించాలని విద్యార్థి యువకులకు పిలుపునిస్తూ, 5. మణిపూర్లో ఆదివాసులపై సాగుతున్న ఘాతుకాలన్నీ అక్కడి సహజ వనరులను కొల్లగొట్టడం కోసమేననీ, జాతులు, తెగల మధ్య పాలకులు పెడుతున్న చిచ్చులను తిప్పి కొట్టాలని ఆదివాసి ప్రజానీకానికందరికీ పిలుపునిస్తూ, విద్య, వైద్యం తదితర అంశాలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. అదేవిధంగా 30-7-23న విజయవాడలో జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా జరిగిన సదస్సులో, పునరావాస సమస్యలపైనా, అటవీ చట్టాలపైనా తీర్మానాలు చేసినందుకు రైతాంగ సంఘాల సమన్వయ సమితికి అభినందలు తెలుపుతూ మహాసభ తీర్మానం చేసింది. అనంతరం సంఘ అధ్యక్షులు కామ్రేడ్ వెట్ల విజయ ఈ మహాసభకు సహకరించిన అందరికీ అభివందనాలు తెలిపారు. బాలసంఘం పాటలూ, కొండమొదలు ఉద్యమ పాటలూ, నినాదాలతో మహాసభ విజయవంతంగా ముగిసింది. ✸

## 'భూములూ,అడవులపై హక్కులకోసం మరింత చైతన్యంతో ఆదివాసీ ప్రజానీకం ఉద్యమించాలి!'

## విజయవంతంగా జరిగిన ఏజెన్సీ గిరిజన సంఘం మహాసభ పిలుపు



జెండా ఆవిష్కరించిన కా॥ఇల్లా రామిరెడ్డి; సభలో అమరులకు నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

**ఏజెన్సీ** గిరిజన సంఘం మహాసభ అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలంలోని కొండమొదలు ఆర్ అండ్ ఆర్ పెద్ద కాలనీలో, 8-8-2023న విజయవంతంగా జరిగింది. సంఘాన్ని గ్రామస్థాయి నుండి బలోపేతం చేసుకోవాలన్న నిర్ణయాల్లో భాగంగా రైతు కూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) అనుబంధంగా ఉన్న ఏజెన్సీ గిరిజన సంఘం తన మహాసభను జరుపుకున్నది. దీనికి ముందే కొద్ది నెలలుగా సభ్యత్వ నమోదు, గ్రామ కమిటీ ఎన్నికలు జరిగి, ఎంపిక చేసుకున్న ప్రతినిధులతో ఈ మహాసభ జరిగింది. తొలుత ఏజెన్సీ గిరిజన సంఘం జెండా అయిన విల్లు బాణం గుర్తుగా ఉన్న ఎర్రజెండాను గిరిజన సంఘ అధ్యక్షులు కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి ఆవిష్కరించారు. రైతు కూలీ సంఘం జెండాను ఏ ఐ కె ఎమ్ కె ఎస్ జాతీయ నాయకులు కామ్రేడ్ ప్రసాదన్న ఆవిష్కరించారు. ఉద్యమ నినాదాలు, పాటలతో ఉత్తేజకర వాతావరణంలో మహాసభ ప్రారంభ మైంది. కామ్రేడ్స్ వేట్ల విజయ, తాతి బుల్లెబ్బాయి, వంజం జోగారావులు అధ్యక్షవర్గంగా వ్యవహ రించిన ఈ మహాసభలో మొదట కామ్రేడ్ వేట్ల శ్రీరాములు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానం ద్వారా ఆదివాసి ఉద్యమంలో అమరులైన సంఘ నాయకులు, కార్యకర్తలకూ, కామ్రేడ్స్ కోటయ్య, జస్వంత్‌రావు, మధు వంటి విప్లవోద్యమ నాయకులకు, ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళులర్పిస్తూ సభ ఒక నిమిషం మౌనం పాటించింది.

తొలుత ప్రారంభ ఉపన్యాసం చేసిన రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ మాట్లాడుతూ, కొండమొదలు కేంద్రంగా గిరిజనోద్యమం ప్రారంభమై 54 సంవత్సరాలు అయిందని, ఈ కాలమంతా భూమికోసం, అడవులపై హక్కు కోసం, ఆత్మగౌరవం కోసం పోరాటం సాగిందని తెలిపారు. నిరంతరాయంగా వర్గ ఉద్యమంగా సాగిన కొండమొదలు పోరాటం అనేక మలుపుల గుండా సాగుతూ, ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొని నిలదొక్కు కున్నదని చెప్పారు. అలాంటి స్థితిలో పోలవరం ప్రాజెక్టు పేర ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాచేందుకు, బలవంతంగా తరలించేందుకు పూనుకుందని, చెట్టుకొకరు పుట్టుకొకరుగా కాకుండా, ఐక్యతతో, సంఘటితంగా పోరాడుతూనే అయిష్టంగా ఇక్కడికి వచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పడిన ఉద్వేగ వాతావరణంలో ప్రతినిధులు అందరూ ఐక్యతతో నిలబడతామని, ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ చేశారు. తన అధ్యక్షోపన్యాసాన్ని కొనసాగిస్తూ కామ్రేడ్ ఝాన్సీ, భూమి నీరు అడవులను విదేశాల్లో ఉండే సామ్రాజ్యవాదులు, వారి దళారీలు కొల్లగొడుతున్నారని చెప్పారు. గతంలో కూడా వన సంరక్షణ సమితుల పేర ఇక్కడి నుంచీ ఒరిస్సా వరకూ కొండపోళ్ళలో బలవంతాన ప్లాంటేషన్ మొక్కలు నాటడం చేసారని, వాటిని ఆనాడే వ్యతిరేకించామనీ, ఆదివాసి ప్రజానీకం అనేక ప్రాంతాల్లో వాళ్లదైన పద్ధతులతో అలా మొక్కలు నాటటాన్ని ప్రతిఘటించారని గుర్తు చేశారు. మన అడవి మనకు కాకుండా పోతున్నదంటే అక్కడ సామ్రాజ్యవాదం ఉన్నట్లేనని చెప్పారు. భూమి కోసం కొండమొదలు గిరిజనులు పోరాడుతూ, అనేక ప్రాంతాల పోరాటాలకు ప్రేరణగా నిలిచారని, ప్రస్తుతం ఉద్యమం మరో ముఖ్యమైన మలుపు తీసుకుందని, ఈ మలుపులో మరింత చైతన్యంతో ముందుకు సాగాలని, దానికోసం ఈ మహాసభలో చర్చలు జరగాలని కోరుతూ ముగించారు.

రైతుకూలీసంఘం తెలంగాణ నాయకులు కామ్రేడ్ ప్రసాదన్న మాట్లాడుతూ ఇంతకాలం ఈ ఉద్యమం అనేక ఆటుపోట్లు ఎదుర్కొని కూడా కొనసాగుతూ ఉండటం చిన్న విషయం కాదని, ఈ పోరాటాన్ని కొనసాగించాలని, రాబోయే కాలంలో ఎదురయ్యే సరికొత్త సవాళ్లు ఎదుర్కోవాలని కోరారు. తెలంగాణ ప్రాంతంలో కూడా కొండపోళ్ళ కోసం ఆందోళన కొనసాగుతుందని చెపుతూ, మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ముగించారు. అనంతరం ఏ ఎఫ్ టి యు (న్యూ) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ డి.వి.ఎన్ స్వామి మాట్లాడుతూ కొండమొదలు గిరిజన ఉద్యమం సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, ఈనాడు కార్మికోద్యమం పాలకుల అనేక రకాల దాడులు ఎదుర్కొంటుందని, పోరాడుతున్న ఆదివాసి ప్రజానీకానికి కార్మిక వర్గం అండదండలు ఉంటాయని చెబుతూ ముగించారు.

అధ్యక్షవర్గం ద్వారా ప్రవేశపెట్టిన మహాసభ కార్యకలాపాల నివేదిక ఇప్పటి వరకూ ఏపీ ముఖ్యమైన మలుపులలో గిరిజన సంఘ మహాసభలు జరిగాయో సంఘ భూముల స్వాధీన విధానం, గిరిజనేతుర పేదలకు కూడా మన భూములు ఇచ్చి మనతో పాటు బతకమన్న గిరిజన –




'ఒడిదుడుకులను అధిగమిస్తూ సాగిన అర్థశతాబ్దపు కొండమొదలు గిరిజనోద్యమం' పుస్తకాన్ని పరిచయం చేస్తూ రైతు కూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ఝాన్సీ తొలుత మాట్లాడారు. తూర్పు గోదావరిజిల్లా, దేవీపట్నం మండలంలోని కొండమొదలు ప్రాంతంలో 1968 నుండి 2023 వరకు సాగిన ఉద్యమ చరిత్రను వివరిస్తూ సిపిఐ (ఎం-ఎల్)జిల్లాకమిటి ఈ పుస్తకాన్ని ప్రచురించి నందుకు అభినందనలు తెలియజేశారు. భూమిపై హక్కు కోసం సాగిన కొండమొదలు గిరిజనోద్యమంలోని కీలక అంశాలన్నింటినీ ఈ పుస్తకంలో నమోదు చేశారన్నారు. గిరిజనోద్యమం ఎదుర్కొన్న ఆటుపోట్లు, ప్రజల అసమాన ధైర్య సాహసాలు, పోలీసు నిర్బంధాలు, దాడులు, ఆత్మరక్షణ విధానాలు, అక్రమకేసులు, పోలీసులతో బాహా బాహీ తలపడటాలు, కామ్రేడ్స్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యల అమరత్వం, కార్యకర్తల నిలకడైన కృషి, స్పష్టమైన అవగాహనతో రాజ్యయంత్రాంగాన్ని ఎదుర్కొన్న ఘటనలు, న్యాయస్థానాల్లో పోరాటాలు, ముఖ్యంగా గత 20 సం॥ల కాలంగా పోలవరం నిర్వాసితుల డిమాండ్లపై ఖచ్చితమైన వైఖరులతో సాగించిన ఉద్యమ కృషినంతా స్ఫూర్తిదాయకంగా ఈ పుస్తకంలో పొందుపరిచారన్నారు. ఉద్యమ కాలంలో, నిర్బంధ సమయంలో గిరిజనోద్యమానికి వెన్నంటి నిలచి మద్దతుగా నిలచిన బిడి శర్మ తదితర ప్రజాతంత్రవాదులు, మేధావు లందరికీ ఈ సందర్భంగా ఆమె అభినందనలు తెలియ జేశారు. కాలాక్రమానుగతంగా గిరిజనోద్యమ పరిణామక్రమాన్ని సాధికారికంగా, సవివరంగా ఆరు భాగాలలో ఈ పుస్తకంలో అందించారన్నారు. మనుగోపుల జమిందార్‌ను గడగడలాడించిన పోరాటానికి, దుగ్గేరు ప్రాంత ఉద్యమాలకు కొండమొదలు గిరిజనులు సంఘీభావం, అండదండలు అందించారని, పోరాటం తప్ప మరో మార్గం లేదనే అనుభవాలను ఉద్యమం ద్వారా తెలియ జెప్పారని కా॥ఝాన్సీ వివరించారు. ఆదివాసులను అడవితల్లి ఒడినుండి వివిధ రూపాల్లో గుంజివేస్తున్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యంగా నేటితరం యువజనులు, గంభీరమైన గిరిజనోద్యమ నిర్మాణానికి పూనుకోవాల్సిన అవసరం వుందని, స్ఫూర్తి దాయకమైన ఈ పుస్తకాన్ని సామూహికంగా అధ్యయనం చేయాలని విజ్ఞప్తి చేస్తూ ఆమె ఈ పుస్తకాన్ని పరిచయం చేశారు.

**అడవి, భూమి...** (చివరి పేజీనుండి)

ఈ చట్టాలకు అనుకూలమేనని వివరిస్తూ అటవీ సంరక్షణ చట్ట సవరణను సంపూర్ణంగా వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర)సహాయ కార్యదర్శి కా॥డి.వర్మ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినాన్ని పోరాటదినంగా మనం సరైనవిధంగా నిర్వహించామన్నారు. కామన్ సివిల్‌కోడ్ పేరిట ఆదివాసీ ఆచార సాంప్రదాయాలపై దాడి చేస్తున్నారని, హిందూమతాన్ని రుద్దబోతున్నారని, దొంతుఒరియా, వాల్మీకులను గిరిజనులలో కలిపే చర్యలను నిరసించాలని ఆయన కోరారు.

ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు ఊయక ముత్యాలు మాట్లాడుతూ బిడి శర్మగారి వంటి ఆదివాసీ బాంధవులు 'మావూళ్ళో మా రాజ్యం' కోసం, 1/70 చట్టం అమలుకోసం నిలిచారని చెబుతూ ద్రౌపది ముర్ము ఆదివాసీ మహిళ అయినంతమాత్రాన ఆదివాసుల హక్కులను కాపాడటం జరగదని, ఐక్యపోరాటాలే పరిష్కారమని పేర్కొన్నారు.

ఇంకా ఈ సభలో ఏజన్సీ గిరిజన సంఘం గౌరవాధ్యక్షులు కా॥ఇల్లా రామిరెడ్డి తదితరులు మాట్లాడారు. కొండమొదలు పోరాటాన్ని, అమరుల త్యాగాలను గుర్తుచేస్తూ, గిరిజనులను అడవి నుండి దూరంచేసే పాలకుల కుట్రలను నిరసిస్తూ ప్రజాకళాకారులు పాడిన పాటలు స్ఫూర్తిదాయకంగా వున్నాయి. ✸

---

➡గిరిజనేతర విధానం, స్వాధీనం చేసుకొన్న భూములలో సమిష్టి పంటల విధానంతో మొదలు పెట్టి కుటుంబాల వారీగా భూములు పంచడం, పంటలో కొంత తీసివుంచి మరల తిండికి ఎద్దడి కాలంలో అందరూ కలసి పంచుకొనే పంటల వాటా విధానం వంటివి అన్నీ మహాసభలలో అందరి ఉమ్మడి నిర్ణయాలుగానే తీసుకొనబడినాయని, అందుకే దశాబ్దాలపాటు ఆ నిర్ణయాలు తిరుగులేకుండా అమలు అయ్యాయని పేర్కొంది. ప్రస్తుతం ఎదుర్కొనబోతున్న కొత్త సవాళ్ళను ఎదుర్కొ నేందుకు ఇంకా ఉన్నత చైతన్యం అవసరమని నివేదిక చెప్పింది. అలాగే ప్రతి మహాసభలో అప్పటి వరకూ జరిగిన జమా ఖర్చులు మహాసభ ముందుంచి జరిగిన విషయాలు ముందుంచడం సాంప్రదాయం. దాని ప్రకారం ప్రభుత్వం, భూస్వామ్యశక్తులు మన మీద ఆర్థిక భారాలు మోపి దెబ్బతీసేలా కేసులు పెడుతూ ఉంటే ప్రజల అండతో వాటిని ఎదుర్కొన్న తీరును ఆర్థిక నివేదిక వివరించింది. ఈ నివేదికలపై చర్చ అనంతరం వీటిని మహాసభ ఆమోదించింది. తర్వాత మహాసభ నూతన నాయకత్వ కమిటీని ఎన్నుకుంది కామ్రేడ్ ఇల్లా రామిరెడ్డి గౌరవ అధ్యక్షులుగా, కామ్రేడ్ వేట్ల విజయ అధ్యక్షులుగా, 36 మందితో నూతన కార్యవర్గాన్ని మహాసభ ఎన్నుకొంది.

మహాసభ యొక్క ముఖ్యమైన ఎజెండా ముగిసిన అనంతరం, విజయవంతమైన మహాసభకు ముగింపు ఉపన్యాసం ఇస్తూ, కామ్రేడ్ ఝాన్సీ మహాసభ విజయవంత మైనందుకు అభినందించారు. మూడు విషయాలను ఈ మహాసభ అందించిందని 1. భూములనూ, పూర్తి పునరావాసాన్ని సాధించుకోవడం, 2. సంఘంలో, కుటుంబంలో వచ్చిపడుతున్న చెడు ప్రభావాలకు వ్యతిరేకంగా యువకులను ఐక్యపరచడం, 3. ప్రభుత్వాల యొక్క అటవీ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను కొనసాగించాలని చెప్పారు. అలాగే అర్థశతాబ్దపు కొండమొదలు ఉద్యమ చరిత్రను వివరించే పుస్తకాన్ని మర్నాడు ఆవిష్కరించుకోబోతున్నామని చెప్పారు. ఈ కర్తవ్యాలను ముందుకు తీసుకుపోయేందుకు నూతన కమిటీ నాయకత్వాన ముందుకు సాగాలని కోరుతూ ముగించారు. రైతు కూలీ సంఘ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎంఎస్ నాగరాజు మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు పునరావాసం కోసం సాగించిన పోరాటంలోని ముఖ్యమైన ఘట్టాలను, రాజద్రోహ కేసులను ఎదుర్కొన్న తీరును వివరించారు. పునరావాసం కోసం సాగిన సంఘర్షణనూ వివరించే పుస్తకాన్ని

**(తరువాయి 21వ పేజీలో)**

Janasakti (Communist Revolutionaries' Monthly) RNI No. 8315/63 VJ-077/2022-24
No.of pages : 24 Date of publication : 1st & 2nd of Every Month Posting date : 5th or 6th of Every Month

# ‘అడవి, భూమి, నీటిపై హక్కుకోసం ఆదివాసులు ఉద్యమించాలి’

**- కా॥ఝాన్సీ ఉద్ఘాటన**




ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అమరులకు నివాళులు

**‘ప్రపంచ** ఆదివాసీ దినోత్సవం’ సందర్భంగా 2023 ఆగస్టు 9న ఏజన్సీ గిరిజన సంఘం, రైతుకూలీసంఘం(ఆం.ప్ర)ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా, గంగవరం మండలం-కొండమొదలు ఆర్&ఆర్ పెదకాలనీ ఆదివాసుల సభ జరిగింది. ఈ సభకు ఏజన్సీ గిరిజనసంఘం నాయకులు కా॥కుంజం రామారావు అధ్యక్షత వహించారు. మణిపూర్‌లో బిజెపి ప్రేరిత మతోన్మాద మెయితీ మూకలు నాగా, కుకీ తదితర ఆదివాసీ తెగలు, జాతులపై సాగించిన జాతిహనన మారణకాండలో మరణించిన వారందరికీ సంతాపం తెలుపుతూ సభ రెండు నిముషాలు మౌనం పాటించింది.

### కొండమొదలు గిరిజనోద్యమంపై పుస్తకావిష్కరణ

సిపిఐ(ఎం-ఎల్) తూర్పుగోదావరిజిల్లా కమిటి ప్రచురించిన ‘ఒడిదుడుకులనధిగమిస్తూ సాగిన అర్ధశతాబ్దపు కొండమొదలు గిరిజనోద్యమం’ అనే 272 పేజీల పుస్తకాన్ని ఏజన్సీ గిరిజన సంఘం అధ్యక్షులు కా॥వేట్ల విజయ ఆవిష్కరించి, తొలి పుస్తకాన్ని కొండమొదలు ఉద్యమ సీనియర్ నాయకులు కా॥తామా ముత్యాలుకు, రెండవ పుస్తకాన్ని ఏజన్సీ గిరిజనసంఘం గౌరవాధ్యక్షులు కా॥ఇల్లా రామిరెడ్డికి అందజేశారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కా॥ఝాన్సీ మాట్లాడుతూ దీనిని పోరాట దినంగా జరుపుకోవాలన్నారు. అడవుల న్నింటినీ అధికారికంగా బహుళజాతి, కార్పొరేట్లకు కట్టబెట్టే అటవీ సంరక్షణ (సవరణ) చట్టాన్ని వారంరోజుల క్రితమే పార్లమెంట్ ఆమోదించిందని, ఆదివాసీ మహిళ రాష్ట్రపతి ముర్ముచే దీనికి ఆమోదముద్ర వేయించారని తెలిపారు. ఆదివాసులను ఇప్పటికే వివిధ రూపాల్లో అడవులనుండి తరిమేస్తున్నారని, ఎదురుతిరిగితే మణిపూర్ తరహా దాడులు సాగిస్తామని చేస్తున్న హెచ్చరికలలో భాగమే-బిజెపి కనుసన్నలలో జరిగిన మారణకాండ అని వివరించారు. ఆదివాసులపై, మైనారిటీలపై దాడులు చేస్తే సహించబోమని దేశ ప్రజలంతా బాధితులకు అండగా గొంతెత్తారన్నారు. ప్రజలు చైతన్యవంతులైతేనే పాలకులు భయపడతారన్నారు. ఆదివాసుల దినోత్సవాన్ని, అల్లూరి వర్ధంతిని పాలకులు ఘనంగా జరుపుతూ వంచనాత్మకంగా వ్యవహరిస్తూ, పీడిత ఉద్యమాలను అణచివేస్తున్నారని చెపుతూ ఆదివాసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు పూనిక వహిద్దామని ఆమె పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా॥ఎంఎస్ నాగరాజు మాట్లాడుతూ పాలకులు అటవీ చట్టంలో చేసిన సవరణలతో అడవి నాశనమై ఆదివాసులు నిరాశ్రయులవుతారని, గ్రామసభల అధికారం రద్దవుతుందని పేర్కొన్నారు. పర్యావరణ సమస్యలు తీవ్రంగా తలెత్తుతా యన్నారు. మానవ మనుగడ ప్రశ్నార్థకమౌతుందన్నారు. పాలకపార్టీలన్నీ

**(తరువాయి 23వ పేజీలో)**

## అఖిలభారత ఆదివాసీ సదస్సు

**2023 సెప్టెంబర్ 12, 13 తేదీలు - విశాఖపట్నం**
**డా॥బి.డి. శర్మ ప్రాంగణం (సుబ్బలక్ష్మీ కళ్యాణ మండపం)**

**12-9-23 మధ్యాహ్నం 12 గం॥కు**
**ప్రారంభసభ**

సాయంత్రం 3 గం॥కు
**ప్రదర్శన**

సాయంత్రం 4 గం॥కు
**బహిరంగసభ**
(ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా)

ఆదివాసుల సాంస్కృతిక ప్రదర్శనలు, కళారూపాలు వుంటాయి

ముఖ్య అతిథి :
**కా॥ శాంతీముండా,**
పశ్చిమబెంగాల్ ఆదివాసీ నాయకులు
ముఖ్య వక్త :
**శ్రీ ప్రఫుల్ల సామంతరాయ్,** పర్యావరణవేత్త
**శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు,** మాజీ మంత్రి
AIKMKS కన్వీనర్ **కా॥ సుబోధ్‌మిత్ర,**
కో-కన్వీనర్ **కా॥ ఝాన్సీ**
జాతీయ కమిటీ సభ్యులు **కా॥ శ్రీకాంత్ మొహంతి**
వివిధ రాష్ట్రాల ఆదివాసీ ప్రతినిధులు,
ప్రజాతంత్రవాదులు, మేధావులు,
ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారు.

## ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ (AIKMKS)

Printed, Published and Owned by S. Seshamma
32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
Printed at SVR Offset Printers & Binders, D.No. 24-29-128B, Garimallavari Street, Gulabithota, Vijayawada-3
Editor : S. Seshamma, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010